



www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHI






ఆదివారం | 29-12-2019 | పేజీలు: 14 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 254 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: తదియ మ. 12.16 తదుపరి చవితి; నక్షత్రం: శ్రవణం రా. 8.30 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: రా. 12.52-2.37; దుర్ముహూర్తం: సా. 4.19-5.03; అమృతఘడియలు: ఉ. 9.20-11.03; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 5.47 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



పోలవరం స్పిల్‌వే ప్రాంతంలో నిలిచిన నీరు

# పడకేసిన పోలవరం!

## ఎక్కడి పనులు అక్కడే.. గత 5 వారాల్లో కేవలం 3 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్

- అది కూడా స్పిల్‌వేకే పరిమితం
- మిగిలిన పనులు ఎక్కడివక్కడే
- రివర్స్ టెండరింగ్ అంటే ఇదేనా?
- పనులపై నిపుణుల విస్మయం

ఏలూరు డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పోలవరం ప్రాజెక్టు పేరెత్తితే పరుగులెత్తే పనులు.. వేలాది మంది కార్మికులు.. రోజువారీ లక్ష్యాలతో కాంట్రాక్ట్ ఏజెన్సీల ఉరుకులు.. పనుల పురోగతి లెక్కల్లో అధికారులు.. నిజమా, కాదా తేల్చుకునేందుకు వారంవారం అధికారిక సమీక్షలు.. వర్చువల్ రివ్యూలు.. ముఖ్యమంత్రి స్వయంగా ఈ వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షిస్తూ ప్రాజెక్టు పనులు ముందుకు కదిలేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. కాంట్రాక్ట్ ఏజెన్సీలు సైతం తమకు అప్పగించిన లక్ష్యాలను అందుకునేందుకు రేయింబవళ్లు శ్రమించేవి. ప్రాజెక్టు పనుల్లో ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు నిత్యం చెమటోడ్చేవారు. యంత్రాల చప్పుళ్లు, కార్మికుల హోరు వినిపించేవి. ఇప్పుడు సీన్ 'రివర్స్' అయింది. ఉరుకులు పరుగులెత్తాల్సిన


మిగతా 9వ పేజీలో...


# తేలేదాకా పోరే

## అనిశ్చితి తొలగి అమరావతే కొనసాగేదాకా ఉద్యమంలోనే

- తేల్చేసిన రాజధాని గ్రామాలు
- టెంట్లను పోలీసులు పీకేసినా ఎండలోనే నినాదాల హోరు
- ఉరితాళ్లను పట్టిన వెలగపూడి
- మోకాళ్లపై నిలబడిన తుళ్లూరు
- దేవతలకు మందడం పూజలు
- తెలుగు సభలకు రైతుల సెగ
- సభలోకి వెళ్లి ప్లకార్డుల ప్రదర్శన
- రాష్ట్రమంతా సంఘీభావ వెల్లువ
- తెనాలి, బెజవాడలో రౌండ్‌టేబుల్


తుళ్లూరులో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న మహిళలు

గుంటూరు, తెనాలి, విజయవాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నీడనిచ్చే టెంటు లేదు. శిబిరాలకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో పిల్లాజెల్లాతో వచ్చిన రైతు కుటుంబాలకు తలదాచుకొనే దిక్కులేదు. కూర్చోడానికి రోడ్డు తప్ప మరో 'దారి' లేదు. అయినా.. నిరసనలు వెల్లువెత్తాయి. నినాదాలు ఎగసిపడ్డాయి. ఎండకు చేతిలోని ప్లకార్డులను, పోస్టర్లను అడ్డుపెట్టుకొని మహిళలు ఆందోళనల్లో పాల్గొన్నారు. సర్రుమంటున్న రోడ్లపై అలాగే కూర్చొని తమ ఆగ్రహ, ఆక్రోశాలను రాజధాని రైతులు


మిగతా 10వ పేజీలో...


### ఏపీలో పరిస్థితులు తెలంగాణకు మేలు

రియల్ వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు 11


విశాఖ ఉత్సవ్‌ను ప్రారంభించిన అనంతరం ఏమీ మాట్లాడకుండానే సభికులకు నమస్కరిస్తూ వీడ్కోలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్

# విశాఖలో జగనోత్సవ్!

- స్వాగత సత్కారాల్లో 'రాజధాని' కళ
- 24 కి.మీ. పొడవునా మానవ హారం
- డ్వాక్రా, ఆశాలు, విద్యార్థుల తరలింపు
- ఉత్సవ్‌లో కటౌట్‌పైనే లఘు చిత్రం
- పాదయాత్ర, వైఎస్ దృశ్యాల ప్రదర్శన
- మూడు కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం
- ఎక్కడా ప్రసంగించకుండా మౌనం
- 1,200 కోట్ల పనులకు శంకుస్థాపన

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిపాలనా రాజధానిగా 'విశాఖ వీచికలు' వీస్తున్న వేళ... ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశాఖపట్నం విచ్చేశారు. విమానాశ్రయం నుంచి తొలుత కైలాసగిరికి, పుష్ప ప్రదర్శన ఏర్పాటుచేసిన సిటీ సెంట్రల్ పార్కుకు వెళ్లారు. రూ.1200 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 'విశాఖ ఉత్సవ్' ప్రారంభించారు. సీఎం మొత్తం మూడు కార్యక్రమాల్లో


మిగతా 9వ పేజీలో...


## కొత్త పలుకు!

### ధర్మం తప్పిన రాజు!

...ప్రపంచంలోనే మేటి నగరాల్లో ఒకటిగా అమరావతిని తీర్చిదిద్దుతానని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనలతో నాలుగేళ్లు గడిచిపోగా, మూడు రాజధానుల పేరిట ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాలక్షేపానికి తెర తీశారు.

...రాజధాని తరలింపు నిర్ణయాన్ని తుగ్లక్ చర్యగా ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా వంటివారు అభివర్ణించగా, జగనన్నను తుగ్లక్ అనే వారే తుగ్లక్‌లు అని తమ్మినేని సీతారాం ప్రభృతులు వ్యాఖ్యానించడం తెంపరితనమే అవుతుంది.

...చంద్రబాబు దిగిపోయి జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే హైదరాబాద్ పంట పండుతుందని ఏడాది క్రితమే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పార్టీ సహచరుల వద్ద చేసిన వ్యాఖ్య ఇప్పుడు ఆచరణలో రుజువు అవుతోంది.

...ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పడం వల్ల నిజం అవుతుందన్న సూత్రాన్ని జగన్ అండ్ కో నమ్ముతున్నట్టు ఉన్నారు. నిజంగా ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని రుజువు అయితే దోషులను శిక్షించాలని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో కోరుతున్నా ప్రభుత్వం ఆ పని ఎందుకు చేయలేకపోతున్నది?

...ఇప్పటికే అభివృద్ధి చెందిన విశాఖను మరింత అభివృద్ధి చేయడం వల్ల భవిష్యత్తులో ప్రాంతీయ ఉద్యమాలకు బీజం వేసిన పాపం జగన్ అండ్ కోకే దక్కుతుంది.

-ఆర్కే విశ్లేషణ 4లో..



### లఖ్‌నవూలో హైడ్రామా..

- నా మెడపై చెయ్యేసి తోసేశారు
- నాపై చెయ్యి చేసుకున్నారు
- పక్కకు లాగడంతో కింద పడ్డాను
- నా వల్ల శాంతికి విఘాతమా..?
- పోలీసులపై ప్రియాంక మండిపాటు
- బుల్లెట్ ప్రూఫ్ వదిలి.. స్కూటర్‌పై నిష్క్రమణ
- పోలీసుల అడ్డగింతతో రెండున్నర కి.మీ నడక
- ఆరోపణలు అబద్ధం: పోలీసుల వివరణ

12

### వెయ్యి మంది విద్యార్థులపై కేసులు

అంతా అలీగఢ్ ముస్లిం వర్సిటీ విద్యార్థులే

# తెలుగు కోసం ఉద్యమం




## మాధ్యమంపై ప్రభుత్వం మాట మారేవరకు పోరాటం

- ప్రపంచం మొత్తం మాతృభాషలపైనే నడుస్తోంది
- ప్రభుత్వ నిర్ణయం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం
- సీఎం జగన్‌పై 'భరత్ అనే నేను' సినిమా ప్రభావం!
- భాషకు భవిష్యత్తు లేదన్న ధోరణిలో ప్రభుత్వం తీరు
- ఇప్పుడు ఆంగ్లానికి వంతపాడుతున్నవారు ఏనాడైనా తరగతి గదిలో కూర్చున్నారా?
- ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో వక్తలు

పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం మాత్రమే అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై భాషాభిమానులు భగ్గుమన్నారు. మాధ్యమం మాట మార్చేవరకూ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించే వరకు పోరాటం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.



ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో యానాం కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయవాడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో భాగంగా శనివారం రాజకీయరంగ ప్రతినిధుల సదస్సు నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం తెలుగు మాధ్యమాన్ని కూడా అమలు చేసే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నినాదానికి సీపీఐ కట్టుబడి ఉందన్నారు. చైనా, రష్యా దేశాల్లో విద్యాబోధన మొత్తం మాతృభాషలోనే జరుగుతోందన్నారు. తెలుగు మాధ్యమాన్ని అమలు చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే మీ పిల్లలు ఏ మీడియంలో చదువుతున్నారని సీఎం ప్రశ్నించడం బ్లాక్‌మెయిల్ రాజకీయమన్నారు. ఈ విధానం


మిగతా 9వ పేజీలో...


# కాలేజీ ఒకటే.. ఫీజులే వేరు

- కన్వీనర్-మేనేజ్‌మెంట్ సీట్లకు వేర్వేరు ఫీజులు
- ఖర్చును బట్టి కాలేజీలకు ఫీజుల నిర్ణయం
- ఫిబ్రవరి నాటికి కొత్త ఫీజులపై సిఫారసు
- తెలుగుకన్నా ఇంగ్లిష్ తేలిక భాష
- స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమం సరైందే
- ఉన్నత విద్య కమిషన్ చైర్మన్ వ్యాఖ్యలు




అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌తో పాటు ఇతర వృత్తి విద్యా కోర్సులకు కన్వీనర్-మేనేజ్‌మెంట్ కోటాల్లోని సీట్లకు వేర్వేరు ట్యూషన్ ఫీజులను సిఫారసు చేయనున్నట్టు ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య(రిటైర్డ్) తెలిపారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) కేటగిరీల సీట్లను విభజించి వేర్వేరు ఫీజులను ఖరారు చేస్తుండగా.. ఒక్క ఇంజనీరింగ్ కోర్సు విషయంలోనే ఆ విధానం ఇప్పటి వరకు అమలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయానికి తాను సంపూర్ణ మద్దతిస్తున్నట్టు చెప్పారు. శనివారం తాడేపల్లిలోని కార్యాలయంలో కమిషన్ మెంబర్ సెక్రెటరీ డాక్టర్ ఎన్.రాజశేఖరరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రొఫెషనల్ కోర్సుల ఫీజుల నియంత్రణపై కసరత్తు చేస్తున్నామని, ఫిబ్రవరి నాటికి కొత్త ఫీజులను ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని తెలిపారు. ప్రొఫెషనల్


మిగతా 11వ పేజీలో...


### 'ఎంసెట్' మళ్లీ జేఎన్‌టీయూకేనా!

- పలు సెట్స్‌కు వర్సిటీలు, కన్వీనర్లు మార్పు? 2
- ఏప్రిల్ 20-మే 10 లోపు అన్ని పరీక్షలు పూర్తి
- రేపు ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల



### ప్రధానార్చకుడిగా రమణ దీక్షితులు

- గౌరవప్రద హోదాలో విధుల నిర్వహణ
- నియామకంపై టీటీడీ పాలకమండలి నిర్ణయం
- సలహాల కోసం వినియోగించుకుంటాం: చైర్మన్

2



12

సోమాలియాలో కారుబాంబు..

### 90 మంది దుర్మరణం

- 70 మందికి గాయాలు..
- కాలేజీ విద్యార్థుల సజీవ దహనం
- మృతుల్లో 17 మంది పోలీసులు



పరంజ్యోతి

# మోక్ష ప్రాప్తికి సాధనాలు



ఎంతో ఉత్తమమైనది మానవజన్మ. ఒకరికి ఉపకారం చేసేదే శ్రేష్ఠమైన జీవన విధానం. మనం ఈ ప్రపంచంలోకి వచ్చింది కలిసి జీవించడానికి.. పరమార్థం వైపు పయనించడానికి. ఈ ప్రయాణంలో బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమాల గురించి వివరించుకున్నాం. ధర్మ, అర్థ, కామ, మోక్షాలను ప్రస్తావించుకున్నాం. వివాహ వ్యవస్థను తెలుసుకున్నాం. భారతీయులమైనందుకు, భారతదేశ సంస్కృతి ప్రపంచ దేశాలకు తల మానికమైనందుకు.. గొప్పదైన ఆధ్యాత్మిక జీవన విధానానికి పాటుపడుతూ.. కర్మ, భక్తి, జ్ఞాన, రాజ యోగాల ద్వార మోక్షాన్ని పొందడమే మానవ జీవిత పరమార్థం.

**కర్మయోగం:** మనది కర్మభూమి. ప్రతి ప్రాణిలాగే మనం కూడా కర్మలు చేస్తూ.. జీవనం కొనసాగించాల్సిందే. కానీ, మానవుడు లాభాపేక్షతో కర్మలు చేస్తాడు. కామ్యకర్మలు బంధిస్తాయి. నిష్కామకర్మలు బంధనం నుంచి విముక్తి కల్పిస్తాయి. ఎప్పుడైతే ఫలితాలు ఆశించకుండా.. నిష్కామకర్మలు చేస్తూ.. ఆ ఫలాలను భగవంతుడికి అర్పిస్తామో.. అలాంటి కర్మలు బంధాల నుంచి విముక్తిని కలిగిస్తాయి. భగవద్గీత నుంచి మనం నేర్చుకున్నదిదే.

**రాజయోగం:** మనస్సును నియంత్రించడమే రాజయోగం. ఇది మోక్షప్రాప్తికి రాచమార్గం. అభ్యాసంతో, వైరాగ్యంతో, ఫల అనాసక్తితోనూ మనస్సును నియంత్రించే ప్రయత్నం చేయవచ్చు. అయితే.. ఇది అంత సులభసాధ్యం కాదు. సాధనతోనే అది సాధ్యమవుతుంది.

**జ్ఞానయోగం:** అన్ని యోగాల కంటే జ్ఞానయోగమే శ్రేష్ఠం అని అద్వైతం చెబుతోంది. తత్వ విచారంతో జీవాత్మ స్వరూపాన్ని, ఎవరు జీవులు? ఏది జీవాత్మ? ఏది పరమాత్మ? పరమాత్మతో జీవాత్మ ఏ విధంగా ఏకం కావాలి? తదితర అంశాలను కూలంకషంగా తెలుసుకోవడమే జ్ఞానం. వైరాగ్యం, త్యాగం తదితర లక్షణాలు కలిగి.. అభ్యాసం, శ్రమ మొదలైన వాటితో ప్రయత్నం చేసినట్లయితే జ్ఞానయోగం ద్వారా మోక్షమార్గం సులభమవుతుంది.

**భక్తియోగం:** కలియుగంలో మోక్షప్రాప్తికి భక్తి మిక్కిలి శ్రేష్ఠమైన మార్గం. ఇతర ప్రాణుల పట్ల దయను కలిగి ఉండటం, సాత్వికాహారాన్ని స్వీకరించడం, నియమ నిష్ఠలను కలిగి ఉండటం, సత్య మార్గాన ప్రయాణించడం, అహంకారాన్ని విడనాడటం, సాటి ప్రాణిలో భగవంతుణ్ని చూడగలగడం భక్తి యోగంలో ముఖ్యమైన అంశాలు. నవ విధ భక్తుల గురించి భాగవతం చెబుతోంది. ఏ మనిషి కూడా పుట్టుకతోనే చెడ్డవాడు కాదు. పరిస్థితుల ప్రభావం, దురాశ, అజ్ఞానం, మాయ వల్ల చెడ్డ పనులు చేస్తాడు. ఇవి తప్పని తెలుసుకున్నవాడు.. వాటిని సరిదిద్దుకున్నవాడు మహాత్ముడు అవుతాడు. వాల్మీకిలా మహర్షి అవుతాడు. క్షణిక సుఖం కోసం.. తాత్కాలిక ఆనందాల కోసం వెంపర్లాడకుండా.. శాశ్వత సుఖమైన.. శాశ్వత ఆనందమైన భగవన్నామస్మరణం, సాటి ప్రాణులకు సహాయం, మానవతావాదం, కుటుంబం-సమాజం పట్ల ప్రేమ కలిగి ఉండటం, ఉన్నతమైన మనస్తత్వాన్ని కలిగి ఉండటమే మోక్షానికి మార్గాలు.

- నోముల చంద్రశేఖర్, 98666 69859




## బాలుడు @ 5 కిలోలు

శిశువులు సాధారణంగా 2.5-3.5 కిలోల బరువు ఉంటారు. విజయనగరం జిల్లా పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో శనివారం జన్మించిన శిశువు 5.160 కిలోల బరువు ఉండి అందరినీ ఆశ్చర్యపరిచాడు. చినబొండపల్లికి చెందిన పూర్ణిమ 100 కిలోల బరువు ఉండటంతో.. నెలలు నిండినా ప్రసవ నొప్పులు రాలేదని, దీంతో శస్త్ర చికిత్స చేశామని వైద్యులు చెప్పారు.

- బెలగాం

# ప్రధానార్చకుడిగా రమణ దీక్షితులు

- గౌరవప్రద హోదాలో విధుల నిర్వహణ
- నియామకంపై టీటీడీ పాలకమండలి నిర్ణయం
- సలహాల కోసం వినియోగించుకుంటాం: చైర్మన్



తిరుమల, డిసెంబరు 28: తిరుమల మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులను తిరిగి ప్రధాన అర్చకుడిగా నియమిస్తూ టీటీడీ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న నలుగురు ప్రధాన అర్చకులతో పాటు 'ఐదో అర్చకుడిగా.. గౌరవప్రద హోదాలో' దీక్షితులు విధులు నిర్వహిస్తారని శనివారం జరిగిన సమావేశం అనంతరం టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వివరించారు. ఆయన్ను ప్రధానంగా సూచన లు, సలహాలు తీసుకునేందుకు ఉపయోగించుకుంటామని, నేరుగా ఎలాంటి కార్యకలాపాల్లో పాల్గొనరని పేర్కొన్నారు. అంతకు ముందు రమణ దీక్షితులును తిరిగి ప్రధాన అర్చకుడిగా తీసుకోవటంపై మిగిలిన అర్చకులతోనూ బోర్డు సభ్యులు చర్చించారు. అర్చకుల మధ్య విభేధాలు తలెత్తకుండా, గ్రూపులు ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

### ఇదీ నేపథ్యం...

శ్రీవారికి కైంకర్యాలు నిర్వహించే మిరాశీ కుటుంబాల్లో గొల్లపల్లి వంశానికి చెందిన రమణ దీక్షితులు మిరాశీ రద్దయినప్పటి నుంచి ప్రధాన అర్చకుడిగా వ్యవహరిస్తూ వచ్చారు. 65 ఏళ్లు దాటిన అర్చకులకు పదవీ విరమణ వర్తింపజేస్తూ టీటీడీ ధర్మకర్తల మండలి 2018 మే 16న నిర్ణయాన్ని ప్రకటించింది. దీన్ని ముందే పసిగట్టిన రమణ దీక్షితులు చెన్నై లో మాట్లాడుతూ, టీటీడీపై ఆరోపణలు చేశారు. దీంతో దీక్షితులుతో పాటు ఆరోపణలు చేసిన ఎంపీ విజయసాయిరెడ్డిపై టీటీడీ గతేడాది అక్టోబరులో రూ.200 కోట్లకు పరువునష్టం దావా వేసింది. మరోవైపు, అర్చకత్వం నుంచి దూరమైనప్పటి నుంచి దీక్షితులు వైసీపీ అధినేత జగన్‌కు దగ్గరయ్యారు. జగన్ సీఎం కాగానే రమణ దీక్షితులు తిరిగి టీటీడీలోకి రీ ఎంట్రీ ఇస్తారనే ప్రచారమూ జరిగింది. ఈ క్రమంలోనే గత నెల 7న టీటీడీ ఆగమ సలహామండలి సభ్యుడిగా ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత తిరిగి ప్రధాన అర్చకుడిగా కూడా నియమిస్తూ శనివారం నిర్ణయం తీసుకున్నారు.

# ఉత్తరద్వార దర్శనం 2రోజులే

- సామాన్య భక్తులకే తొలి ప్రాధాన్యం: వైవీ



తిరుమల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి, ద్వాదశిలకు విస్తృత ఏర్పాట్లుచేస్తూ, ఆ రెండురోజుల్లో సామాన్య భక్తులకే ప్రాధాన్యం ఇవ్వాలని టీటీడీ పాలక మండలి నిర్ణయించిందని బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. శ్రీవారి ఆలయ సంప్రదాయం, ఆచారాలను అనుసరించి వైకుంఠ ఏకాదశి, ద్వాదశి దినాల్లో మాత్రమే వైకుంఠ ద్వారాలు తెరిచి ఉంచుతామన్నారు. ప్రతినెలా ఏకాదశి రోజున వైకుంఠ ద్వారాలు తెరవడం అంత సులువు కాదన్నారు. దీనిపై పీఠాధిపతులు, ఆగమ పండితులతో సదస్సు ఏర్పాటు చేసి, సలహాల మేరకు మార్పులు తీసుకురావడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించి, నిషేధం కఠినతరం చేస్తామని వైవీ స్పష్టం చేశారు. కాగా, ఇంజనీరింగ్ పనులకు నిధుల కేటాయింపులో టీటీడీ ఈవో విచక్షణాధికారాలను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించారు. 2019-2020 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టీటీడీ లోగడ రూ.3,116.5కోట్ల అంచనాతో రూపొందించిన వార్షిక బడ్జెట్ రూ.3,243.19 కోట్లకు సవరించారు. బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్‌గా చెన్నై అపోలో ఆస్పత్రిలో పనిచేస్తున్న మదన్‌మోహన్‌రెడ్డిని నియమించారు. ముంబైలో శ్రీవారి ఆలయం, సమాచార కేంద్రం నిర్మాణానికి రూ.30 కోట్లు కేటాయించారు. జమ్ము, కశ్మీర్, వారాణసిలో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. తిరుమల వరాహస్వామి ఆలయ గోపురానికి స్వర్ణతాపడం చేసేందుకు శ్రీవారి బంగారం ఇవ్వనున్నారు.

## లోకం తీరు




## కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): త్రిపుర నుంచి ఒడిశాకు ఆనుకుని బంగాళాఖాతం వరకు కొనసాగుతున్న ఉపరితల ద్రోణి ప్రభావంతో కోస్తాలో మేఘాలు ఆవరించాయి. దీనికి తోడు తేమగాలులు రావడంతో చలి వాతావరణం నెలకొంది. వీటన్నింటితో కోస్తాలో అనేకచోట్ల శనివారం తెలికపాటి నుంచి ఒక మోస్తరుగా వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజుల్లో కోస్తాలో అక్కడక్కడా ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదైనా మేఘాల ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యాయి.





**ఫాలోపియన్ ట్యూబ్‌లు మూసుకుపోవడం**

మహిళలలో సంతానలేమికి సాధారణ కారణం ఫాలోఫియన్ ట్యూబ్‌లు మూసుకోపోవడం. టెస్ట్‌ట్యూబ్ బేబీ (IVF) టెక్నిక్, దాదాపు నాలుగు దశాబ్దాలకు ముందు అభివృద్ధి పర్చబడింది, ఇది అసంఖ్యాక మహిళలకు ఎటువంటి ఫాలోపియన్ ట్యూబ్స్ తెరుచుటకు ఆపరేషన్ అవసరం లేకుండా వారు తల్లి అయ్యేకల సాకారంలో సహాయపడింది.

**కన్సల్టేషన్ కోసం ఏ దంపతులు ఎంచుకోవచ్చు**

| పురుషులు | స్త్రీ |
|---|---|
| అతి తక్కువ వీర్యకణాల సంఖ్య | ఫాలోపియన్ ట్యూబ్‌లు మూసుకుపోవడం |
| వీర్యకణాలు అసలు లేకపోవడం | అండం ఏర్పడడంలో సమస్య |
| వీర్యకణాలలో చలనం తక్కువగా ఉండటం | క్రమరహితమైన రుతుక్రమం |
| నాణ్యత లేకపోవడం | అకాలంలో అండాలు విడుదల |

అందుబాటులోగల సేవలు: ఫెర్టిలిటీ చెకప్ ● IUI ● IVF ● ICSI ● లేజర్ హ్యాచింగ్ ● బ్లాస్టోసిస్ట్ ● ల్యాపరో స్కోపి ● హిస్టెరోస్కోపి ● డోనర్ సర్వీసులు

**ఇందిర IVF హాస్పిటల్ ప్రైవేట్ లిమిటెడ్**

దిల్‌సుఖ్‌నగర్ (హైదరాబాద్): సుయోగ్-PRK టవర్స్, మూసారంబాగ్ మెట్రో స్టేషన్ ఎదురుగా, కరాచి బేకరి పైన, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్

బంజారాహిల్స్ (హైదరాబాద్): మహేష్ బ్యాంక్ ఎదురుగా, రోడ్ నం.12, A'La లిబర్టీ హోటల్ ప్రక్కన, బంజారాహిల్స్, హైదరాబాద్

సికింద్రాబాద్ (తెలంగాణ): భువన టవర్స్, CMR ఎక్స్‌క్లూసివ్ షాపింగ్ మాల్ పైన, సరోజిని దేవి రోడ్, మంజు థియేటర్ దగ్గర, సికింద్రాబాద్.

Helpline 7412077801, Email : help@indiraivf.in, Website : www.indiraivf.com

**మా మరిన్ని సెంటర్స్**

హర్యానా రోహతక్ - హిసర్ ఫరిదాబాద్ గురుగ్రామ్ | కర్ణాటక బెంగళూరు (జె.పి. నగర్ రాజాజి నగర్ ఇందిరా నగర్) ● మైసూరు అస్సాం గుహతి | రాజస్థాన్ - ఉదయ్‌పూర్ ● కోట ● జైపూర్ (వైశాలి నగర్) జవహర్ నగర్) ● అల్వార్ ● జోద్‌పూర్ ● బికానెర్ | వెస్ట్ బెంగాల్ - కోల్‌కతా (పార్క్ స్ట్రీట్ ఠాకుర్పుకూర్) ● అసన్‌సోల్ ● హౌరా ● సిలిగురి | జార్ఖండ్ - ● రాంచి ● జంషెడ్‌పూర్ ఉత్తరాఖండ్ ● డెహ్రాడూన్ | ఒరిస్సా - భువనేశ్వర్ తెలంగాణ - హైదరాబాద్ (దిల్ సుఖ్ నగర్, బంజారా హిల్స్) ● సికింద్రాబాద్ | ఢిల్లీ (పటేల్ నగర్ లాజ్‌పట్ నగర్, ద్వారక రోహిణి, తిలక్ నగర్ షహదర) | MP- ● ఇండోర్ ● భూపాల్ ● జబల్‌పూర్ ● గౌలియార్ | తమిళనాడు ● చెన్నై H.P. ● సిమ్లా

ఉత్తర్ ప్రదేశ్ - లక్నో ● వారణాసి ● మౌ ● బారేలీ గోరఖ్‌పూర్ ● మీరుట్ ● ఆగ్ర ● కాన్‌పూర్ ● ఘజీబాద్ (రాజ్‌నగర్, కౌశంబి), ● ఝాన్సీ ● ప్రయాగ్రాజ్ ● అలిగర్ | బీహార్ - మోతిహరి బేగుసరాయ్ ● భాగల్‌పూర్ ముజఫర్‌పూర్ ● పాట్నా | చత్తీస్‌ఘర్ - రాయ్‌పూర్, బిలాస్‌పూర్ పంజాబ్ - లుథీనా ● అమృత్సర్ చండీఘర్ ● జలంధర్ | మహారాష్ట్ర - నాగ్‌పూర్ ● నాషిక్ ● కొల్హాపూర్ ● పూణే ముంబాయి (థానే, భండూప్, విరర్, గట్కోపర్, బోరివలి నవి ముంబాయి, దాదర్) ● జల్‌గాన్ ● సోలాపూర్, ● ఔరంగబాద్ | గుజరాత్ - రాజ్‌కోట్ అహ్మదాబాద్ ● వడోదర గోవా - పంజిమ్

● 80 Centres PAN India ● Treatment protocol as per individual need ● Patient friendly treatment options

Prenatal Sex Determination & Sex Selection is illegal and not done here.

Disclaimer : The models used in the creative is just for illustration purpose only.


# ఆపరేషన్ 'ట్రైనీ ఐపీఎస్'

- సెల్ చోరీ అని వెళితే.. గంటల తరబడి నిల్చోబెట్టారు
- కనీస మర్యాద కరువు.. పరుష పదజాలంతో హేళన
- ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్లో సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం
- రైటర్ సస్పెన్షన్..సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లకు మెమోలు

ఒంగోలుక్రైం, డిసెంబరు 28: జవాబుదారీతనం.. పారదర్శకత.. ఫిర్యాదిదారుల పట్ల మర్యాద.. ఇవీ పోలీసు ఉన్నతాధికారులు తరచూ చెప్పే మాటలు. కానీ, పోలీసుస్టేషన్లలో అందుకు భిన్నంగా జరుగుతోంది. కొందరు వ్యక్తులు తనను కొట్టి సెల్‌ఫోన్ లాక్కుపోయారని ఫిర్యాదు చేసేందుకు వెళితే గంటల తరబడి నిల్చోబెట్టి యక్ష ప్రశ్నలు వేశారు. కనీస మర్యాద కరువైంది. అర్జెంటుగా ఊరు వెళ్లాలని, ఫిర్యాదు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాలని కోరితే.. 'మీ సెల్‌ఫోన్లన్నింటికీ మేము బాధ్యులమా?' అంటూ ఎకసెక్కాలు! శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారికి ఎదురైన చేదు అనుభవం ఇదీ. తమ ఆపరేషన్ ద్వారా ప్రకాశం ఎస్పీ ఈ విషయాన్ని బయటపెట్టారు. జిల్లా ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోని తాలూకా పోలీస్ స్టేషన్‌లోనే ఈ ఘటన జరగడం విశేషం. క్షేత్రస్థాయి శిక్షణ కోసం వచ్చిన ట్రైనీ ఐపీఎస్ పీ జగదీశ్ సాధారణ యువకుడిలా శుక్రవారం మధ్యాహ్నం తాలూకా పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. ఒంగోలు బస్టాండ్ సమీప మౌర్య హోటల్ వద్ద వాకింగ్ చేస్తుండగా, కొందరు తనను కొట్టి సెల్‌ఫోన్ లాక్కుపోయారని చెప్పారు. ఫిర్యాదు చేయడానికి వచ్చానన్నారు. ఆయన ఎవరో తెలియని సిబ్బంది గంటల తరబడి నిల్చోబెట్టి కనీస మర్యాద ఇవ్వలేదు. 'ఆ మొబైల్ నీదేననే ప్రూఫ్ ఉందా?.. నిజంగా జరగకపోతే నీ మీదే యాక్షన్ తీసుకుంటాం' అంటూ పరుషంగా మాట్లాడారు. హెడ్ కానిస్టేబుల్, రైటర్, కానిస్టేబుళ్లు రకరకాలుగా ఆయననే విచారణ చేశారు. 'సీఐ గారు వస్తారు.. ఆ తర్వాత చూద్దాం' ఇదీ రైటర్ సమాధానం. ఎస్ఐ వచ్చినా పట్టించుకోలేదు. గంటసేపు ఓపికగా భరించి.. 'అర్జెంటుగా ఊరెళ్లాలి.. ఫిర్యాదు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వండి సార్..' అని కోరగా 'మీ సెల్‌ఫోన్లు అన్నిటికీ మేము బాధ్యులమా?' అంటూ హేళనగా మాట్లాడారు. కాగా, పోలీసుస్టేషన్ నుంచి బయటకు వెళ్లిన ఆయన పోలీసు వాహనం ఎక్కడం చూసి సిబ్బంది అవాక్కయ్యారు. తన వాహనంలో ఆయన నేరుగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయగా, రైటర్ సుధాకర్‌ను సస్పెండ్ చేసి, ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మణ్, ఎస్ఐ సాంబశివయ్య, హెడ్ కానిస్టేబుల్ రాజేష్, కానిస్టేబుల్ రమ్యకిరణ్మయిలకు మెమోలు జారీ చేశారు.

# స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్!

- త్వరలో జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి?

అమరావతి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం త్వరలో శుభవార్త వినిపించనుంది. చానాళ్లుగా వారు చేస్తున్న డిమాండ్ మేరకు వారికి జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. ప్రస్తుత నిబంధనల ప్రకారం జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో 90 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, 10 శాతం బోధనేతర ఉద్యోగులకు ప్రమోషన్ ఇవ్వడం ద్వారా భర్తీ చేస్తున్నారు. అయితే ఈ నిబంధనలను సవరించి ఇకపై డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 50 శాతం, బోధనేతర ఉద్యోగులకు 10 శాతం ఇచ్చి.. మిగిలిన 40 శాతం పోస్టులను స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్ ద్వారా భర్తీ చేయనున్నట్టు తెలిసింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కనీసం ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారిని దీనికి అర్హులుగా గుర్తించనున్నారు. పురపాలక శాఖ త్వరలోనే దీనికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేస్తుందని సమాచారం. కాగా.. ప్రస్తుతం 500 మందికిపైగా విద్యార్థులున్న ప్రతి ప్రభుత్వ పాఠశాలను జూనియర్ కళాశాలగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఎంటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ తెలిపారు. 'నాడు- నేడు' కింద పాఠశాలలకు ఇచ్చిన మార్గదర్శకాల్లో ఇలాంటి బడుల్లో జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం తరగతి గదుల నిర్మాణానికి అనుమతులు లభించనున్నాయని ఆయన వెల్లడించారు.

# జేఎన్‌టీయూకే.. 'ఎంసెట్'!

- రేపు ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రొఫెషనల్ కోర్సులు ఆఫర్ చేస్తోన్న కాలేజీల్లో 2020-21 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల నిమిత్తం 'ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్స్)' నిర్వహణపై రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కసరత్తు చేస్తోంది. వచ్చే ఏప్రిల్ 20 నుంచి మే 10వ తేదీలోగా అన్ని పరీక్షలను పూర్తిచేసేలా షెడ్యూల్ రూపొందిస్తోంది. సోమవారం విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ 'సెట్స్' షెడ్యూల్‌ను విడుదల చేస్తారని ఉన్నతవిద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. ఎంసెట్, ఈసెట్, పీజీఈసెట్, ఐసెట్, లాసెట్, ఎడ్‌సెట్, పీఈసెట్ ల నిర్వహణ బాధ్యతలు ఏ విశ్వవిద్యాలయాలకు అప్పగించాలన్న అంశంపై తర్జనభర్జన చేస్తున్నారు. కీలకమైన ఎంసెట్ నిర్వహణ బాధ్యతను మరోసారి జేఎన్‌టీయూకే అప్పగించే అవకాశం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత వరుసగా ఐదు పర్యాయాలు(2015-2019) ఎంసెట్ నిర్వహించిన అనుభవం జేఎన్‌టీయూకేకు ఉంది. మొదటి రెండేళ్లు ఆఫ్‌లైన్‌లో, తర్వాత మూడేళ్లు ఆన్‌లైన్‌లో నిర్వహించగా.. విమర్శలు గానీ, ఆరోపణలు గానీ లేవు. ఎక్కువ సమయం లేకపోవడం, గతానుభవాల దృష్ట్యా మళ్లీ జేఎన్‌టీయూకేకు అప్పగించే పరిస్థితి కనిపిస్తోంది. అలాగే ఈసెట్ నిర్వహణ బాధ్యతను మరోసారి జేఎన్‌టీయూఏకు అప్పగించే అవకాశం ఉంది. ఈ వర్సిటీకి కూడా 2015-2019 వరకు ఈసెట్‌ను నిర్వహించిన అనుభవం ఉంది. మిగిలిన సెట్‌లలో కొన్నింటికి వర్సిటీలు మారే అవకాశం ఉందని సమాచారం. 'సెట్స్' కన్వీనర్ల నియామకంపైనా కసరత్తు చేస్తున్నారు. గత అనుభవంతో పాటు అనేక అంశాల ప్రాతిపదికగా కన్వీనర్లను నియమిస్తారు. గత ఐదేళ్లుగా ఎంసెట్‌కు సీహెచ్ సాయిబాబు, ఈసెట్‌కు భానుమూర్తి కన్వీనర్లుగా వ్యవహరించారు. వివాదాలకు తావు లేకుండా నిర్వహించారన్న అభిప్రాయాలు వీరిపై ఉన్నాయి. సెట్స్ షెడ్యూల్, నిర్వహించే వర్సిటీల పేర్లు సోమవారం ప్రకటించనున్నట్టు హేమచంద్రారెడ్డి చెప్పారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే సెట్స్‌కు ఏపీ ఆన్‌లైన్-టీసీఎస్‌లను సర్వీస్ ప్రొవైడర్లుగా ఎంపిక చేసే అవకాశం ఉంది.

## కడప మహిళకు సౌదీలో చికిత్స

▸ అమెరికా నుంచి వస్తుండగా విమానంలో గుండెపోటు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): అమెరికా నుంచి స్వదేశానికి తిరిగి వస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళకు మార్గమధ్యంలో గుండెపోటు వచ్చింది. దీంతో విమానాన్ని సౌదీలో దింపి చికిత్స నిమిత్తం ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం ప్రస్తుతానికి నిలకడగా ఉంది. బాల నాగమ్మ కడప పట్టణంలోని బాలాజీనగర్ ఎర్రముక్కపల్లిలో నివాసం ఉంటారు. ఆమె అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లారు. కొద్ది కాలం అక్కడ గడిపిన ఆమె స్వదేశానికి బయలుదేరారు. న్యూయార్క్ నుంచి అబుదాబీ మీదుగా ఆమె ప్రయాణిస్తున్న ఎత్తేహాద్ ఎయిర్ లైన్స్ విమానం చెన్నై వస్తోంది. మార్గమధ్యంలో ఆమె ఆరోగ్యం క్షీణించింది. దీంతో విమానాన్ని అత్యవసరంగా శుక్రవారం రాత్రి రియాద్‌లో దించారు. నాగమ్మను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి ప్రమాదం లేదని వైద్య వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతానికి ఆమె ఐసీయూలో ఉన్నారు. ఆమెకు కొనుగోలు చేసిన టిక్కెట్‌లో ఆరోగ్య భీమా సదుపాయం లేకపోవడంతో ఆసుపత్రి బిల్లు చెల్లింపు సమస్యగా మారుతోంది. కడప ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న నాగమ్మ బంధువు స్నేహితుని కుమారుడు సుభాష్ రియాద్‌లో పని చేస్తున్నారు. సమాచారం అందుకున్న సుభాష్ ఆసుపత్రికి వచ్చి వివరాలను సమీకరించారు.

## ఈ-పర్మిట్ అమలుచేస్తే ఎగుమతులు బంద్

▸ ఉభయ గోదావరి జిల్లా కొబ్బరి వర్తకుల సంఘం

అంబాజీపేట, డిసెంబరు 28: రాష్ట్ర ప్రభుత్వం జనవరి 1 నుంచి కొబ్బరి ఎగుమతులపై ఈ పర్మిట్ విధానాన్ని అమలుచేస్తే ఉభయ గోదావరి జిల్లాల నుంచి కొబ్బరి ఎగుమతులను నిలిపివేస్తామని గోదావరి జిల్లాల కొబ్బరి, కొబ్బరి కాయల ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు మద్దాల తమ్మారావు హెచ్చరించారు. ఈ పర్మిట్ విధానంపై మార్కెట్ కమిటీ అధికారులు అంబాజీపేట మార్కెట్ యార్డులో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల మార్కెటింగ్‌శాఖ రీజనల్ డిప్యూటీ డైరక్టర్ ఎ.శారదరాణి మాట్లాడుతూ.. వర్తకులు రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉత్పత్తులను ఎగుమతి చేసే విషయంలో ఈ పర్మిట్‌ను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. కాగా.. పభుత్వం జనవరి 1నుంచి అమలు చేయబోయే ఈ పర్మిట్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని తమ్మారావు తెలిపారు. ఈ పర్మిట్ విధానం అమలుచేస్తే ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోజూ సుమారు 70కు పైగా లారీల కొబ్బరి ఎగుమతులు ఆగిపోతాయన్నారు.

### కౌలు రైతు ఆత్మహత్య

రెంటాల(రెంటచింతల), డిసెంబరు 28: గుంటూరుజిల్లా రెంటచింతల మండలం రెంటాల గ్రామంలో ఓ కౌలు రైతు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సురేష్ కథనం మేరకు గ్రామానికి చెందిన సిద్దవటం శ్రీనివాసరెడ్డి(42)కి రెండెకరాల పొలం ఉంది. దీంతో పాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చిని సాగు చేశాడు. అయితే దిగుబడి లేకపోవడంతోపాటు రుణదాతల ఒత్తిడి పెరిగిపోవడంతో శ్రీనివాసరెడ్డి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# 'ఉపాధి' సగమే!

గత ఏడాది 9,211 కోట్ల వ్యయం.. ఈ ఏడాది 4,478 కోట్లు

▸ ఆర్నెల్లపాటు పనులు నిలిపివేత
▸ అడ్డగోలుగా అధికారుల బదిలీలు
▸ పథకం అమలుపై నీలినీడలు


(ఫైల్ ఫొటో)

అమరావతి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రాష్ట్రంలో ఉపాధి హామీ పథకానికి ఖర్చు చేసిన మొత్తం 9,211 కోట్లు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసింది రూ.4,478 కోట్లు మాత్రమే. అంటే గత ఏడాది పోలిస్తే నిధుల వ్యయం దాదాపు సగమే. కేంద్ర ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఉపాధి హామీ పథకం రాష్ట్రంలో అమలవుతున్న తీరుకు ఇదే నిదర్శనం. భారీ రెవెన్యూ లోటుతో, ఆర్థిక ఇబ్బందులతో ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టించింది జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మాత్రమే. గత తెలుగుదేశం ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని విస్తృతంగా ఉపయోగించుకుని కేంద్రం నుంచి నిధులను రాబట్టుకోగలిగారు. ఫలితంగా రాష్ట్రంలోని కూలీలకు చేతినిండా పని దొరకడమేకాకుండా.. గ్రామాల్లో రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఉద్యాన తోటలు, మొక్కల పెంపకం వంటి అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా జరిగాయి. పథకం అమలులో మన రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచి వివిధ విభాగాల్లో అవార్డులు అందుకుంది. కొత్త ప్రభుత్వం వచ్చాక పథకాన్ని అమలు చేయడంలోనూ, నిధులు వినియోగించుకోవడంలోనూ అంతా వెనుకబాటే కనిపిస్తున్నది. వలసలను నివారించి, గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు దోహదపడే ఉపాధి పథకాన్ని కొత్త ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకుని వేగంగా పనులు చేపట్టాల్సిన కొత్త ప్రభుత్వం వెనక్కిలాగే ప్రయత్నాలు చేసిందని అంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే క్షేత్రస్థాయిలో కీలకమైన ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించింది. అధికారులను ఇబ్బడి ముబ్బడిగా బదిలీ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయని, అంతగా అనుభవం లేని ఇతర శాఖల అధికారులను ఈ పథకంలో నియమించింది. గతంలో చేసిన పనులకు బిల్లులు నిలిపేసింది. రాష్ట్రానికి వచ్చిన నిధులను ఇతర అవసరాలకు వినియోగించింది. వీటన్నిటికీ పరాకాష్టగా.. సాక్షాత్తు పంచాయతీరాజ్ శాఖ మంత్రి అసెంబ్లీలోనే ఉపాధి పథకంలో అవినీతి జరిగిందని ప్రకటించారు. కేంద్ర అధికారులకు రాష్ట్రంలో ఉపాధి పథకం అమలుపై అనుమానాలు వచ్చేలా చేయడంతో ఈ పథకం రాష్ట్రంలో సవ్యంగా కొనసాగుతుందా? అన్న అనుమానాలు ఏర్పడుతున్నాయి.

### తగ్గిన పనులు.. పెరిగిన నిర్వహణ వ్యయం

ఈ పథకం ద్వారా గత ఏడాది డిసెంబరు నాటికి కూలీలకు 24.64 కోట్ల పని దినాలు కల్పించి రూ.4,908 కోట్లు రాష్ట్రానికి రాబట్టుకోగా... ఈ ఏడాదిలో 16.14 కోట్ల పని దినాలు కల్పించి రూ.3,279 కోట్లు మాత్రమే రాబట్టుకోగలిగారు. అంటే గత ఏడాదితో పోలిస్తే రూ.629 కోట్లు తగ్గిపోయింది. మెటీరియల్ కాంపోనెంట్ వినియోగంతో గత ఏడాది రూ.3,887 కోట్లతో నిర్మాణాలు చేపడితే ఈ ఏడాది రూ.943 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. గత ఏడాది 68.91 లక్షల మంది కూలీలకు పనులు కల్పిస్తే ఈ ఏడాది 60.94 లక్షల మందికే పనులు కల్పించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. నిర్వహణకు గత ఏడాది 4.73 శాతం ఖర్చు చేస్తే... ఈ ఏడాది 6.2 శాతం ఖర్చు చేశారు. అంటే పనులు తక్కువ.. దుబారా ఎక్కువ జరిగిందని అంటున్నారు.

**పనుల కేటాయింపులోనూ రాజకీయాలే!**

**ఉపాధి** పథకంలో వ్యక్తిగత పనులు చేపట్టేందుకూ అవకాశం ఉంది. ముఖ్యంగా ఉద్యాన పంటల అభివృద్ధికి పేద రైతులకు ఈ పథకంలో అవకాశం ఉంది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యాన పంటల్లో ఇతర పార్టీల వారికి అవకాశం లేకుండా చేశారు. దీంతో పలుచోట్ల పేద రైతులు తమ పొలాల్లో నిమ్మ, మామిడి తదితర పండ్ల తోటల వేసుకునేందుకు పనులు మంజూరు చేయాలని కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకునే వారే లేరు. కొన్ని గ్రామాల్లో పనిగట్టుకుని ఒక వర్గానికి చెందిన కూలీలకు పనులు కల్పించకుండా అడ్డుకున్నారు. గతంలో ఈ పనుల పురోగతిని ప్రతి వారం ముఖ్యమంత్రి సమీక్ష చేసేవారు. ఇప్పుడు పైస్థాయిలో పర్యవేక్షించే వారే కరువయ్యారు. గ్రామ సచివాలయ సిబ్బంది నియామకం తదితర కార్యకలాపాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు ఈ పథకాన్ని పూర్తిగా వదిలేయడంతో ఈ పరిస్థితి నెలకొందని అంటున్నారు. పైగా కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రాధాన్యంగా తీసుకోకపోవడంతో ఈ పరిస్థితులు ఏర్పడ్డాయంటున్నారు. అయితే రాష్ట్రంలో మరో రూ.2 వేల కోట్ల మేర మెటీరియల్ కాంపోనెంట్ నిధులను మార్చిలోపు ఖర్చు చేసుకునే అవకాశం ఉంది. అందుకే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను ఇళ్ల స్థలాలను చదునుచేసేందుకు వినియోగించడం ద్వారా కార్యకర్తలకు పనులు కల్పించాలని హడావుడి చేస్తున్నారు. మరోవైపు పథకం అమలుపై కేంద్ర ప్రభుత్వం నిఘా ఉన్న నేపథ్యంలో ఇళ్ల స్థలాల పనులకు మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వినియోగిస్తే అభ్యంతరాలు వస్తాయన్న అనుమానాలూ ఉన్నాయి.






### తల్లి మరణం తట్టుకోలేక కుమారుడి మృతి



శ్రీనివాస్, తల్లి సత్యవతి(ఫైల్)

కడియం, డిసెంబరు 28: చిన్నప్పుడు గోరు ముద్దలు తినిపించి అల్లారుముద్దుగా పెంచిన తల్లి అంటే అతనికి ప్రాణం. అలాంటి అమ్మ గుండెపోటుతో విలవిల్లాడటం చూడలేక పోయాడు. కళ్ల ముందే ఆమె గుండెనొప్పితో తనువుచాలించడంతో చలించిపోయిన ఆ కొడుకు అమ్మా అమ్మా అంటూ క్షణాల్లోనే ఆమె మీదపడి ప్రాణాలొదిలాడు. ఈ సంఘటన తూర్పుగోదావరిజిల్లా కడియం మండలం బుర్రిలంక గ్రామంలో జరిగింది. బుర్రిలంక శ్రీవెంకట శ్రీనివాసా నర్సరీ అధినేత పాటంశెట్టి వెంకట్రాయుడు భార్య సత్యవతి (55)కి శుక్రవారం అర్ధరాత్రి గుండె పోటు వచ్చింది. రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించింది. ఆమె వెంటే కారులో ఉన్న పెద్దకుమారుడు పాటంశెట్టి శ్రీనివాసరావు(40) తల్లి హఠాన్మరణాన్ని తట్టుకోలేక క్షణాల్లో ప్రాణాలు విడిచాడు.

### కళ్లలో కారం చల్లి వ్యక్తిపై కత్తితో దాడి

కొలిమిగుండ్ల, డిసెంబరు 28: ముఖానికి మాస్కులు ధరించిన గుర్తు తెలియని దుండగులు ఓ వ్యక్తిపై కత్తులతో దాడి చేసిన ఘటన కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలం కల్వటాలలో శనివారం జరిగింది. కల్వటాలకు చెందిన మద్ది చిన్నసామ్యేలు ప్రిజం సిమెంట్ పరిశ్రమలో సూపర్‌వైజరుగా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని అక్కడే సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ప్రసాద్‌తో కలిసి మోటారుసైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యంలో దుండగులు అటకాయించారు. చిన్నసామ్యేలు కళ్లలో కారం చల్లి కత్తులతో దాడి చేశారు. దీంతో ప్రసాద్ పారిపోయి గ్రామస్థులకు సమాచారం అందించాడు. ఈ లోపు దుండగులు పారిపోయారు.

## మూడు ప్యాకేజీలతో దేశవిభజన



▸ ఓట్ల కోసం మోదీ, షా గబ్బు రాజకీయం
▸ ముస్లింలకే పౌరసత్వం ఇవ్వకపోవడమేంటి?
▸ ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్, సీఏఏలపై ఏచూరి ఆగ్రహం

కర్నూలు(న్యూసిటీ), డిసెంబరు 28: ఎన్ఆర్‌సీ, సీఏఏ, ఎన్‌పీఆర్ అనే చట్టాలను ప్యాకేజీలుగా మార్చుకుని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని విభజించాలని ప్రయత్నిస్తోందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మండిపడ్డారు. ఎన్ఆర్‌సీ, సీఏఏకు వ్యతిరేకంగా లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శనివారం కర్నూలులో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ దేశానికి మోదీ, అమిత్ షా శత్రువులు మాదిరిగా వ్యవహరిస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం వారికి అలవాటైపోయిందని విమర్శించారు. వైఫల్యాలు, అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు బీజేపీ యత్నిస్తోందన్నారు. నాగరికతను, జాతిని వేరు చేసే విధంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్వాతంత్ర్య పోరాటంలో అశ్వక్ ఉల్లాఖాన్, రాంప్రసాద్ అనే ముస్లిం, హిందువు కలిసి పాల్గొన్నారని గుర్తు చేశారు. ఇంత ఐక్యంగా ఉన్న చోట ముస్లింలకు పౌరసత్వం ఇవ్వబోమని మోదీ చెప్పడం చాలా దారుణమన్నారు. ముస్లింలకు తప్ప అన్ని వర్గాల ప్రజలకు పౌరసత్వం ఇస్తామని చెప్పడం, అదీ రాష్ట్రపతి సమక్షంలోనే మోదీ ప్రకటించడం దారుణమైన చర్యగా అభివర్ణించారు. కేవలం ఓట్ల కోసమే మోదీ-షా ద్వయం గబ్బు రాజకీయాలు చేస్తోందన్నారు. ప్రజల ఆగ్రహాన్ని గమనించి ఈ ప్రక్రియను తాము నిలిపివేస్తామని పలు రాష్ట్రాలు ప్రకటించాయని ఏచూరి గుర్తు చేశారు.


**VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)**

'e' Procurement Notice No. CE-06/VMC/AE/2019-20, Dt. 28-12-2019.
Name of Work : Improvement of Water Supply system i.e., replacement of old distribution lines, execution of new lines, HSCs and providing quality sensors and flow regulating system including Operation and maintenance in Vijayawada Municipal Corporation under AMRUT Scheme **(EPC System with Reverse Tendering Auction)** (Estimate amount Rs. 95.91 Crores) (3rd Call)
Contact : S.E, VMC, Vijayawada - 98665 14183
Further details can be seen @ 'e' procurement market palce www.apeprocurement.gov.in
Download of bid documents starts from 30-12-2019 from 3.30 P.M.
Last date / time for receipt of tenders 13-01-2020 upto 4.00 P.M.
Sd/- MARIANNA, FOR COMMISSIONER


## శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం ముందు రాజేంద్రనాథ్‌రెడ్డి, అపోలో సంస్థల వైస్ చైర్మన్ ప్రీతారెడ్డి

తిరుమల, డిసెంబరు 28: తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు శనివారం దర్శించుకున్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, తెలంగాణ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేశవరావు, అపోలో సంస్థల వైస్ చైర్మన్ ప్రీతారెడ్డి తదితరులు ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి.. లడ్డూప్రసాదాలు అందజేశారు.

### దైవబలంతో గ్రహ కూటమి అరిష్టాలకు అడ్డుకట్ట

▸ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



పెందుర్తి, డిసెంబరు 28: చతుర్థ, షష్ఠ గ్రహ కూటమి వల్ల రాష్ట్రం, దేశంలో ఏర్పడనున్న విపత్కర పరిస్థితులు విషతుల్యం కాకుండా దైవబలం నిరోధించగలదని శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేర్కొన్నారు. చినముషిడివాడలో గల పీఠంలో స్వరూపానందేంద్ర సరస్వతి స్వీయ పర్యవేక్షణలో అతి రుద్ర, లక్ష మహా చండీయాగాలు నిర్వహిస్తున్నారు. రెండో రోజు శనివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి అనుగ్రహ భాషణ చేస్తూ ముందుడుకు చర్యలు చేపట్టకుండా ఉంటే గ్రహ కూటమి వల్ల కలిగే కష్టనష్టాలు సునాయాసంగా దాటగలమని అన్నారు. ఈ సమయంలో పాలకులు, సైనికాధికారులు పరిస్థితులను మౌనంగా గమనిస్తూ నిర్ణయాలు వాయిదా వేసుకుంటే మంచిదని ఆయన సూచించారు. రుత్వికులు మనస్సు లగ్నంచేసి యథాశక్తిగా యజ్ఞయాగాదులు చేయాలన్నారు. రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బిరామిరెడ్డి యాగంలో పాల్గొన్నారు. పీఠం ఆస్థాన వేదపండితులు శ్రీకృష్ణశర్మ నేతృత్వంలో 300 మంది రుత్వికులు శాస్త్రోక్తంగా యాగ నిర్వహణ చేశారు.


**రైల్వేల మంత్రిత్వశాఖ**
(రైల్వే బోర్డ్)

నం.ERB-I/2018/2/90

**వేకన్సీ సర్క్యులర్**

కేంద్ర ప్రభుత్వ అధికారుల నుండి డిప్యుటేషన్ లేదా అబ్జార్ప్షన్‌పై పే మాట్రిక్స్‌లో పే బాండ్ -3+ గ్రేడ్ పే రూ.7600/- (ముందస్తు సవరించబడినది)/లెవల్ 12 పే స్కేల్‌లో ఎడిటర్ (భారతీయ రైల్వేలు)/ రైల్వే బోర్డ్, న్యూఢిల్లీలో ఒక ఉద్యోగం కొరకు దరఖాస్తులు కోరబడుతున్నవి. డిప్యుటేషన్ ద్వారా నియామకానికి గరిష్ట వయోపరిమితి దరఖాస్తుల స్వీకరణకు ముగింపు తేది నాటికి 56 సంవత్సరాలు మించి ఉండరాదు. అర్హత గల అధికారులు నిర్ణీత నమూనాలో తగిన విధానంలో వారి దరఖాస్తులను అండర్ సెక్రటరీ (E) III, రూమ్ నం.536-A, రైల్ భవన్, రెయిజీనా రోడ్, న్యూఢిల్లీ-110001 వారికి ఎంప్లాయిమెంట్ న్యూస్/రోజ్‌గార్ సమాచార్ (14.12.2019)లో వేకన్సీ సర్క్యులర్ ప్రచురణ తేది యొక్క 45 రోజుల్లోగా చేరునట్లుగా పంపవలెను.

**డిప్యుటేషన్ కొరకు అర్హత:**
a) (i) పేరంట్ కేడర్ లేదా డిపార్ట్‌మెంట్‌లో రెగ్యులర్ ప్రాతిపదికన హోల్డింగ్ అనలాగస్ ఉద్యోగాలు లేదా (ii) రూ.6600 గ్రేడ్‌పేతో రూ.15,600-39,100 పే బాండ్-3లో ఉద్యోగాలలో రెగ్యులర్ ప్రాతిపదికన నియామకం తర్వాత పొందిన గ్రేడ్‌లో ఐదు సంవత్సరాల అనుభవం లేదా పేరంట్ గ్రేడ్ కేడర్ లేదా డిపార్ట్‌మెంట్‌లో తత్సమానం. మరియు
b) విద్య మరియు ఇతర అర్హతలు కలిగి ఉండుట అనగా (i) గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషులో మాస్టర్ డిగ్రీ లేదా తత్సమానం, (ii) కేంద్ర ప్రభుత్వం యొక్క ఏదేని ప్రచురణ శాఖ లేదా కేంద్ర ప్రభుత్వం క్రింద ఏదేని వార్తాపత్రిక/న్యూస్ ఏజెన్సీ/వార్తా సంస్థలో ఇంగ్లీష్‌లో ఎడిటర్‌గా లేదా జర్నలిజంలో పది సంవత్సరాలు అనుభవం.
వాంఛనీయం: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం లేదా ఇన్‌స్టిట్యూషన్ నుండి జర్నలిజంలో డిగ్రీ లేదా డిప్లొమా.

**ఇతర వివరాలకు దరఖాస్తుదారులు 14.12.2019 నాటి ఎంప్లాయిమెంట్ న్యూస్/రోజ్‌గార్ సమాచార్‌లో ప్రచురించబడిన సవివరమైన ప్రకటనను చూడగలరు అదేవిధంగా భారతీయ రైల్వేల వెబ్‌సైట్ www.indianrailways.gov.in ను దర్శించగలరు.**

మమ్మల్ని అనుసరించండి: /RailMinIndia



సీపీడీసీఎల్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బాలినేని

### విద్యుత్ టారిఫ్ పెంచే ఆలోచన లేదు

▸ మంత్రి బాలినేని

గవర్నర్‌పేట, డిసెంబరు 28: విద్యుత్ శాఖ నష్టాలతో సతమతమవుతున్నా టారిఫ్‌ను పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణం, శాస్త్ర మరియు సాంకేతికశాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం విజయవాడ మొగల్రాజపురం 5వ నెంబరు రూట్‌లోగల ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, గద్దె రామ్మోహన్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ గృహ వినియోగదారులకు అందించే విద్యుత్ రేట్లు పెంచి పేదలపై భారం వేయవద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో సంస్కరణల్లో భాగంగా సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పోరేషన్‌ను మూడు జిల్లాలతో ఏర్పాటు చేసి విజయవాడ కేంద్రంగా సేవలను అందించడం జరుగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యుత్‌శాఖ నష్టాల ఊబిలో కూరుకుపోయిందని, సంస్థ 70 వేల కోట్ల రూపాయల నష్టాల బారిన పడిందని అన్నారు. తప్పని సరిగా సోలార్ విద్యుత్‌ను కొనే పరిస్థితి వల్ల ఆర్థిక ఇబ్బందులు వచ్చాయన్నారు.

### వైఎస్సార్‌టీఎఫ్ నూతన కార్యవర్గం

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కేశవరపు జాలిరెడ్డి, గెడ్డం సుధీర్ ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీ వెన్నుపూస గోపాల్‌రెడ్డి అధ్యక్షతన ఫెడరేషన్ సమావేశమై వీరిని ఎన్నుకుంది. ఎమ్మెల్సీపై నిరాధార ఆరోపణలు చేసిన రెడ్డి శేఖరరెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఫెడరేషన్ నూతన అధ్యక్షుడు జాలిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

### విద్య, వైద్యానికి ప్రాధాన్యం: నీలం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 28: రాష్ట్రంలో విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ఆమె కలెక్టర్, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో కలిసి తాడేపల్లి పీహెచ్‌సీని శనివారం సందర్శించారు. తొలుత ఆసుపత్రిలో ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, వైద్యాధికారిణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఎస్ స్థానిక వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాడేపల్లిలో జనాభా ప్రకారం మరో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. తాడేపల్లి మండలాన్ని మూడు భాగాలుగా విభజించి, మరో డాక్టర్‌ను నియమించి, మొబైల్ యూనిట్లతో ప్రతి కుటుంబానికి ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.





భవన/ భూమి యజమానులారా!
మీ ఆస్తిపై టవర్ల స్థాపనకు మోసపూరిత ఆఫర్ల పట్ల జాగ్రత్త వహించండి

టెలికాం సర్వీస్ ప్రొవైడర్ (TSP)చే గాని లేదా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్ (IP-I)చే గాని మొబైల్ టవర్ స్థాపనకు ఏదేని ఆఫరు కుదుర్చుకొనుటకు ముందు వెబ్ సైట్ నుండి TSP/IP-I ప్రమాణీకతను పరిశీలించండి.

గుర్తుంచుకోండి:
- టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (TRAI)కు మొబైల్ టవర్ల స్థాపన కొరకు ఆవరణల లీజింగ్/అద్దె విషయంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి ప్రమేయం కల్గి ఉండదు.
- ఇందు కోసం TRAI ఎలాంటి "నో అబ్జెక్షన్ సర్టిఫికెట్" జారీ చేయదు

కంపెనీలు/వ్యక్తులు మోసం చేసే విధానం
- వారు మిమ్ములను నేరుగా సంప్రదిస్తారు లేదా వార్తా పత్రికలలో ప్రకటన ప్రచురిస్తారు
- వారు ఆవరణకు లాభదాయకమైన అద్దెను ఆఫరు చేస్తారు.
- నగదు డిమాండ్‌ను సమర్థించుకోవడానికి నకిలీ డాక్యుమెంట్లు మీకు చూపిస్తారు
- ఒక సారి వారి ఖాతాలోకి నగదు బదిలీ అయిన తర్వాత, వారు అదృశ్యమవుతారు

అట్టి మోసపూరిత వ్యక్తుల వలలో పడవద్దని అభ్యర్థించడమైనది.

మొబైల్ టవర్ స్థాపనకు అధిక అద్దె ప్రామిస్ ఉందా

davp 08101/13/0013/1920

భారతదేశంలో ఎక్కడినుండైనా జాతీయ వినియోగదారు హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి
14404 or 1800-11-4000 | www.consumerhelpline.gov.in

ప్రజా ప్రయోజనార్థం జారీ చేసిన వారు
TRAI టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (IS/ISO 9001-2015 ధృవీకరణ సంస్థ) మహానగర్ దూర్‌సంచార్ భవన్, జవహర్ లాల్ నెహ్రూ మార్గ్, న్యూఢిల్లీ-11002, వెబ్‌సైట్:www.trai.gov.in
వినియోగదారు వ్యవహారాల శాఖ వినియోగదారు వ్యవహారాలు, ఆహార మరియు వినియోగదారుల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం, కృషి భవన్, న్యూఢిల్లీ-110001 వెబ్‌సైట్: www.consumeraffairs.nic.in

> ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కడుపులో ఏదో పెట్టుకుని బయటకు మరేదో చెప్పడం వల్లనే సమస్య జటిలం అవుతోంది. "అమరావతిని అభివృద్ధి చేస్తే కమ్మ సామాజికవర్గంవారు ఆర్థికంగా లాభపడతారు. అయినా వాళ్లు మన పార్టీకి మద్దతు ఇవ్వరు. తెలుగుదేశం పార్టీతోనే ఉంటారు. అలాంటప్పుడు విశాఖకు తరలిపోతే అక్కడ మన పార్టీ మరింత బలపడుతుంది. కృష్ణా–గుంటూరు జిల్లాలలో నష్టం జరిగితే ఉత్తరాంధ్రలో భర్తీ చేసుకోవచ్చు" అని జగన్మోహన్‌రెడ్డి తన సన్నిహితుల వద్ద ఇదివరకే స్పష్టంచేశారట. రాజధాని తరలింపునకు ఇదే అసలు కారణం కాగా.. ప్రజలను ఏమార్చడానికై మంత్రులు అర్థంపర్థం లేని వాదనలను తెర మీదకు తెస్తున్నారు. అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం లేదన్న విషయం ముఖ్యమంత్రికి కూడా తెలుసు!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

కొత్తపలుకు

■ ఆర్కే RK




# ధర్మం తప్పిన రాజు!

'తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చును గానీ.. మూర్ఖుల మనస్సు రంజింపజేయరాదు' అన్నాడో కవి. ఆంధ్రప్రదేశ్ రాజధానిని విశాఖకు తరలించాలన్న ప్రభుత్వ పెద్దల వైఖరి ఈ మాటలను గుర్తుకు తెస్తోంది. ప్రపంచంలోనే మేటి నగరాల్లో ఒకటిగా అమరావతిని తీర్చిదిద్దుతానని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనలతో నాలుగేళ్లు గడిచిపోగా, మూడు రాజధానుల పేరిట ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాలక్షేపానికి తెర తీశారు. రాజధానిని విశాఖకు తరలిస్తున్నామంటూ ఉత్తరాంధ్ర ప్రజలను ఊరిస్తున్నారు. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే ఏమి జరిగేదో తెలియదు గానీ, రాజధానికి భూములిచ్చిన రైతులు ఇప్పుడు రోడ్లపాలయ్యారు. వారి జీవితాల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలో మంత్రులు, ఇతర ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ప్రకటనలు పుండు మీద కారం పూసినట్టుగా ఉంటున్నాయి. రాజధాని తరలింపునకు ప్రభుత్వాన్ని నడుపుతున్నవారు చెబుతున్న కారణాలు ఎలా ఉన్నప్పటికీ, కేవలం ఒక్క సామాజికవర్గంపై కోపంతోనే ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారన్నది నిర్వివాదాంశం. రాజధానిగా విశాఖకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రాయలసీమ తదితర జిల్లాల వారికి దూరంగా ఉందన్న కారణంగా

> మూడు రాజధానులు అని చెబుతున్నవారు ఒక్క రాజధానిని కూడా నిర్మించే పరిస్థితిలో ఉన్నారా? అంటే సందేహమే! మొత్తం మీద అమరావతికి భూములిచ్చిన రైతులను దిక్కులేనివారిని చేశారు. బయటకు చెప్పుకోలేని కొత్త సమస్యలను రాజధాని ప్రాంతవాసులు ఎదుర్కొంటున్నారు. నిన్నటివరకు ఆకాశమే హద్దుగా భూముల ధరలు పెరగడంతో ఆడపిల్లల పెళ్లిళ్ల సందర్భంగా కట్నం కింద రెండు కోట్లు ఇస్తామన్న వాళ్లు.. ఆ మేరకు ధర పలుకుతున్నందున ఎకరం భూమి ఇచ్చారు. ఇప్పుడు అక్కడ ధరలు పడిపోవడంతో మీ భూమి వద్దు.. ఇస్తామన్న రెండు కోట్లు ఇవ్వండి అని కొందరు అల్లుళ్ల నుంచి ఒత్తిడి వస్తోందని ఆడపిల్లల కుటుంబీకులు వాపోతున్నారు. గడపదాటి బయటకురాని మహిళలు కూడా రోడ్ల మీదకు వచ్చి తమకు అన్యాయం చేయవద్దని కన్నీటితో వేడుకోవడం జగన్మోహన్‌రెడ్డికి కూడా శోభనివ్వదు.

మధ్యలో ఉన్న ప్రాంతాన్ని గత పాలకులు రాజధానిగా ఎంపిక చేసి అమరావతి అని నామకరణం చేయగా, ఆ పేరు వినడానికి కూడా ప్రస్తుత పాలకులు ఇష్టపడటం లేదు. రైతులు ఉదారంగా ముందుకొచ్చి ఉచితంగా ఇచ్చిన 33 వేల ఎకరాలను సిరికి మోకాలడ్డినట్టు ముఖ్యమంత్రి కాలదన్నుకుంటున్నారు. రాజధాని తరలింపు నిర్ణయాన్ని తుగ్లక్ చర్యగా ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా వంటివారు అభివర్ణించగా, జగనన్నను తుగ్లక్ అనే వారే తుగ్లక్‌లు అని తమ్మినేని సీతారాం ప్రభృతులు వ్యాఖ్యానించడం తెంపరితనమే అవుతుంది. రాజ్యాంగం ప్రకారం ప్రతి రాష్ట్రానికీ ఒకే రాజధాని ఉంటుంది. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చి ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్, జ్యుడీషియల్ క్యాపిటల్ వంటి పేర్లతో ప్రజలను మభ్యపెడుతున్నారు. ఈ సూక్ష్మం తెలియని విశాఖవాసులు తమకు రాజధాని వస్తుందని సంబరపడిపోతున్నారు. మూడు రాజధానుల ప్రకటన తర్వాత సోషల్ మీడియాలో చలామణి అవుతున్న చలోక్తులను బట్టి పాలకుల నిర్ణయం ఎంత అనుచితంగా ఉందో తెలుస్తోంది. చంద్రబాబు దిగిపోయి జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే హైదరాబాద్ పంట పండుతుందని ఏడాది క్రితమే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పార్టీ సహచరుల వద్ద చేసిన వ్యాఖ్య ఇప్పుడు ఆచరణలో రుజువు అవుతోంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు, అధికారంలో ఉన్నవారు చేస్తున్న ప్రకటనలు గమనిస్తే.. 'అదొక నాగరిక సమాజమా? అక్కడ అసలు మేధావులు, విజ్ఞులు లేనే లేరా?' అన్న సందేహం కలుగుతోంది. రాజధానిని తరలించవద్దని ఆందోళన చేస్తున్న రైతులను ఉద్దేశించి "వాళ్ల భాష, ధరించిన దుస్తులను చూస్తే వారెవరో తెలియడం లేదా?" అని మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించడం అహంకారానికి నిదర్శనం కాదా? "70 ఏళ్లుగా వెనుకబడిపోయి ఉన్న ఉత్తరాంధ్రకు మంచి రోజులు వస్తుంటే.. ఆ గ్రామాలవారు సహించలేకపోతున్నారు" అని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఎగతాళి చేస్తున్నారు. 70 ఏళ్లలో పదేళ్లపాటు ధర్మాన ప్రసాదరావు మంత్రిగా ఉన్నారు. అయినా శ్రీకాకుళం జిల్లాను ఉద్ధరించడానికి ఆయన చేసిన కృషి ఏమీ లేదు. ఉద్దానం సమస్యను కూడా జనసేనాని పవన్ కల్యాణ్ వెలుగులోకి తెచ్చారు. విచిత్రం ఏమిటంటే బొత్స సత్యనారాయణ గానీ, ధర్మాన గానీ కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయలు దోచుకున్న వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని విమర్శించేనవారే! ఈ ఇరువురూ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో అమాత్య పదవులు వెలగబెట్టినవారే! దీన్నిబట్టి అప్పుడు ఏమి జరిగిందో వారికి బాగా తెలిసి ఉంటుంది. మాతృభాష తెలుగుకే కులాన్ని ఆపాదిస్తున్న కుసంస్కారులు రాజ్యమేలుతున్నప్పుడు.. ధర్మాన, బొత్స, తమ్మినేని వంటివారు నోరు పారేసుకోకుండా ఎలా ఉండగలరు? వారి తెలివితేటలు గుంటపూలు పూయకుండా ఎందుకుంటాయి? జీవచ్ఛవంలా మిగలబోతున్న అమరావతిని ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామనీ, రైతులకు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదనీ మంత్రి బొత్స చేసిన ప్రకటన గతాన్ని గుర్తుకు తెస్తోంది. రాజశేఖర్‌రెడ్డి హయాంలో పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణ వోక్స్ వ్యాగన్ పరిశ్రమను రాష్ట్రానికి తీసుకురాలేకపోగా పది కోట్ల రూపాయలను అప్పనంగా ధారపోశారు. అదేమంటే "సొమ్ములు పోనాయి.. ఏటిసేత్తాం" అని ముక్తాయించిన చరిత్ర ఆయనది. "అమరావతిని అభివృద్ధి చేయాలంటే లక్షా పది వేల కోట్ల రూపాయలు కావాలి. ప్రభుత్వం వద్ద ఉన్న డబ్బంతా రాజధాని నిర్మాణానికే ఖర్చు చేసి మిగతా రాష్ట్రాన్ని ఎండబెట్టాలా?" అని మరో మంత్రి పేర్ని నాని హూంకరిస్తున్నారు. అమరావతి నిర్మాణానికి ప్రభుత్వపరంగా పైసా అవసరం ఉండదనీ, రైతులిచ్చిన భూములు అమ్మి కావాల్సిన నిధులు సమీకరించుకోవచ్చుననీ, ఇదివరకే చేసిన అప్పును కూడా తీర్చుకోవచ్చుననీ చేస్తున్న వాదన 'చెవిటివాడి ముందు శంఖం ఊదిన' చందంగా ఉంటోంది. భూములిచ్చి త్యాగం చేసిన రైతులను పెయిడ్ ఆర్టిస్టులతో పోల్చి ఎగతాళి చేసే 'సంస్కారం' ఉన్న వాళ్లు మంత్రులుగా ఉన్నప్పుడు ఎవరు మాత్రం ఎదురు చెప్పగలరు? జరగబోయేది ఏమిటో కళ్లెదురుగా స్పష్టంగా కనపడుతున్నా, ఇంకా నిర్ణయం తీసుకోలేదని మంత్రి పేర్ని నాని బుకాయించడాన్ని ఏమనుకోవాలి? ఉత్తరాంధ్రకు ఎగ్జిక్యూటివ్ రాజధాని బహుమతిగా ఇచ్చినందుకు విశాఖవాసులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలకాలని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అధికారుల సమావేశంలో ప్రకటించిన తర్వాత కూడా.. డమ్మీలుగా ఉంటున్న మంత్రులు బుకాయించడానికి ప్రయత్నించడం విడ్డూరంగా ఉంది. అమరావతిలో శాసనసభ, సచివాలయం, హైకోర్టులకు శాశ్వత భవనాలను నిర్మించి ఉంటే రాజధానిని తరలించే అవసరమే ఉండేది కాదని కూడా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మూడేళ్లుగా ఉద్యోగులు పనిచేస్తున్న సచివాలయం భవనాలు, శాసనసభ కొలువుదీరుతున్న భవనం, హైకోర్టు భవనం టెంట్లు కావు కదా? అవి శాశ్వత భవనాలే కదా? కాకపోతే ఈ మూడింటికీ అద్భుతమైన భవనాలు నిర్మించాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దిక్కుమాలిన ఆరాటానికి పోవడం వల్ల ప్రస్తుతం ఉన్నవాటిని తాత్కాలిక భవనాలుగా చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కడుపులో ఏదో పెట్టుకుని బయటకు మరేదో చెప్పడం వల్లనే సమస్య జటిలం అవుతోంది. "అమరావతిని అభివృద్ధి చేస్తే కమ్మ సామాజికవర్గంవారు ఆర్థికంగా లాభపడతారు. అయినా వాళ్లు మన పార్టీకి మద్దతు ఇవ్వరు. తెలుగుదేశం పార్టీతోనే ఉంటారు. అలాంటప్పుడు విశాఖకు తరలిపోతే అక్కడ మన పార్టీ మరింత బలపడుతుంది. కృష్ణా–గుంటూరు జిల్లాలలో నష్టం జరిగితే ఉత్తరాంధ్రలో భర్తీ చేసుకోవచ్చు" అని జగన్మోహన్‌రెడ్డి తన సన్నిహితుల వద్ద ఇదివరకే స్పష్టంచేశారట. రాజధాని తరలింపునకు ఇదే అసలు కారణం కాగా.. ప్రజలను ఏమార్చడానికై మంత్రులు అర్థంపర్థం లేని వాదనలను తెర మీదకు తెస్తున్నారు. అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం లేదన్న విషయం ముఖ్యమంత్రికి కూడా తెలుసు! అయినా వాళ్లు చెప్పే మాటలను మనం వినాల్సిందే! ఎందుకంటే.. భారీ మెజారిటీతో ప్రజలు వారికి అధికారం కట్టబెట్టారు కదా? నిజానికి రాజధానిని విశాఖకు తరలించాలన్న నిర్ణయంపై రాయలసీమ ప్రజలు కూడా ఆగ్రహంగా ఉన్నారని వార్తలు వస్తున్నాయి. యువకుడు.. అవకాశమిస్తే రాష్ట్రాన్ని బాగుచేస్తాడని చంద్రబాబుని కాదని అధికారం అప్పగిస్తే జగన్మోహన్‌రెడ్డి ఇలా చేస్తున్నారు ఏమిటా? అన్న విమర్శలు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డితో జగన్మోహన్‌రెడ్డిని పోల్చుకుంటూ, "ఇలా చేస్తాడనుకోలేదు" అని నిట్టూర్చే వారే అధికంగా ఉన్నారు. అధికారంలో ఉన్నవారు రాజధర్మాన్ని పాటించాలే గానీ ఏదో ఒక సామాజికవర్గంపై కోపంతో రాజధానినే తరలించాలనుకోవడం అవివేకమే అవుతుంది. ముఖ్యమంత్రి అవ్వకముందు రాజశేఖర్‌రెడ్డికి కోపం ఎక్కువగా ఉండేది. తనవాళ్లు, పరాయివాళ్లు అని గిరి గీసుకునేవారు. ఆయనలో కోపం ఏ స్థాయిలో ఉండేదంటే.. ఎంపీగా ఉన్నప్పుడు ఒక రోజు ఢిల్లీలో ఏపీ భవన్‌కు వెళ్లిన ఆయనకు అడ్డుగా వచ్చిన అటెండర్‌ను ముందువెనుక ఆలోచించకుండా కొట్టారు. అదే రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినతర్వాత "నన్ను నేను మార్చుకుంటున్నాను" అని తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించారు. జగన్మోహన్‌రెడ్డి ఇందుకు విరుద్ధంగా అధికారంలోకి వచ్చాక తన శక్తియుక్తులు అన్నింటినీ కక్ష సాధింపులకే వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారు. హైదరాబాద్‌కు దీటైన రాజధాని ఉండాలని చంద్రబాబు అన్నప్పుడు ఎగతాళి చేసినవాళ్లే... ఇప్పుడు విశాఖపట్టణాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై దేశవ్యాప్తంగా చులకనభావం ఏర్పడిన నేపథ్యంలో విశాఖను అభివృద్ధి చేయడం జగన్ అండ్ కోకు సాధ్యమా? సచివాలయాన్ని, అసెంబ్లీని ఏర్పాటు చేసినంత మాత్రాన విశాఖ అభివృద్ధి జరిగిపోతుందా? మూడు రాజధానులు అని చెబుతున్నవారు ఒక్క రాజధానిని కూడా నిర్మించే పరిస్థితిలో ఉన్నారా? అంటే సందేహమే! మొత్తంమీద అమరావతికి భూములిచ్చిన రైతులను దిక్కులేనివారిని చేశారు. బయటకు చెప్పుకోలేని కొత్త సమస్యలను రాజధాని ప్రాంతవాసులు ఎదుర్కొంటున్నారు. నిన్నటివరకు ఆకాశమే హద్దుగా భూముల ధరలు పెరగడంతో ఆడపిల్లల పెళ్లిళ్ల సందర్భంగా కట్నం కింద రెండు కోట్లు ఇస్తామన్న వాళ్లు.. ఆ మేరకు ధర పలుకుతున్నందున ఎకరం భూమి ఇచ్చారు. ఇప్పుడు అక్కడ ధరలు పడిపోవడంతో మీ భూమి వద్దు.. ఇస్తామన్న రెండు కోట్లు ఇవ్వండి అని కొందరు అల్లుళ్ల నుంచి ఒత్తిడి వస్తోందని ఆడపిల్లల కుటుంబీకులు వాపోతున్నారు. గడపదాటి బయటకురాని మహిళలు కూడా రోడ్ల మీదకు వచ్చి తమకు అన్యాయం చేయవద్దని కన్నీటితో వేడుకోవడం జగన్మోహన్‌రెడ్డికి కూడా శోభనివ్వదు. "అమరావతిని వద్దనుకోవడం జాతీయ విషాదం" అని ప్రఖ్యాత జర్నలిస్ట్ శేఖర్ గుప్తా చేసిన వ్యాఖ్యను తీసిపారేయడానికి లేదు. ఆయన అభిప్రాయపడినట్టుగా జగన్మోహన్‌రెడ్డి స్థానంలో రాజశేఖర్‌రెడ్డి ఉన్నట్టయితే ఇలా జరిగేది కాదు.




> జగన్‌కు ఓటేసినందుకు రాజధానికి చెందిన రైతులు తమ చెప్పులతో తామే కొట్టుకుంటున్నారు. జగన్మోహన్‌రెడ్డిపై పిచ్చి అభిమానంతో తమ సెల్‌ఫోన్లలో ఆయన బొమ్మను డిస్‌ప్లే పిక్చర్‌గా పెట్టుకున్నవారు సైతం ఇప్పుడు దాన్ని తొలగిస్తున్నారు. ఇలాంటి సందర్భాలలో "నీకు అట్టినే కావాలి.." అని నెల్లూరులో అంటూ ఉంటారు. ఇప్పుడు "మాకు ఇట్టినే కావాలి.." అని నెల్లూరు ప్రజలు కూడా వాపోతున్నారట. జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నది చారిత్రక తప్పిదమని ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా వ్యాఖ్యానించారు గానీ, సరిదిద్దుకోలేని తప్పు చేస్తున్నారని అని ఉంటే ఇంకా బాగుండేది. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ తన వేయి పడగలు నవలలో "ఒక జాతి చచ్చిపోయినా ఫర్వాలేదు గానీ జీవచ్ఛవంలా ఉండిపోకూడదు" అని వ్యాఖ్యానిస్తారు. ఇది నిజమే కదా!

## ప్రాంతీయ కుంపట్లు?

రాజధానిని తరలించడానికి జగన్ అండ్ కో ఒక్కో సందర్భంలో ఒక్కో కారణం చెబుతూ వచ్చింది. అమరావతి భూములలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందన్నది ప్రధాన వాదనగా తెర మీదకు తెచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత మీడియాలో అడ్డగోలు రాతలతో ప్రజలను తప్పుదారి పట్టించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడు మాసాలైంది. గత పాలకులను ఇరికించడానికి సీఐడీ ద్వారా విచారణ జరిపించారు కూడా. అయినా ఫలానావారు ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని రుజువు చేయలేకపోయారు. ఇప్పటికీ గాలిపోగేసి ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. బాలకృష్ణ అల్లుడు భరత్ కుటుంబానికి జగ్గయ్యపేట వద్ద ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వజూపిన 500 ఎకరాలను ఇప్పుడు ఇన్‌సైడర్ ట్రేడింగ్‌గా మంత్రి బొత్స ప్రభృతులు అభివర్ణిస్తున్నారు. గత ప్రభుత్వం నోటిఫై చేసిన 29 గ్రామాలకు ఆమడ దూరంలో జగ్గయ్యపేట ఉంది. చంద్రబాబు ప్రభుత్వం ఈ భూమికి ధర ఎక్కువగా నిర్ణయించినందున భరత్ కుటుంబం ఆ భూమిని వదులుకుంది. అయినా నిందలు మోపుతూనే ఉన్నారు. భరత్ స్థానంలో మరొకరు ఉండివుంటే.. ఈ అంశంపై కోర్టులో పరువునష్టం దావా వేసి ఉండేవారు. భరత్‌కు విశాఖలో గీతం విశ్వవిద్యాలయం ఉన్నందునే ఈ నిందను మౌనంగా పిరికితనంతో భరిస్తున్నారు. చంద్రబాబుకు చెందిన హెరిటేజ్ సంస్థ కూడా 29 గ్రామాలకు అవతల కొంత భూమిని కొనుగోలు చేసింది. ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేయాలనుకుంటే ఆ 29 గ్రామాల పరిధిలోనే భూమి కొనుక్కునేవారు కదా? ముఖ్యమంత్రి అయిన కొత్తలో ఢిల్లీలో విలేకరుల సమావేశంలో కళ్లు పెద్దవి చేసి మరీ "కనీవినీ ఎరుగని కుంభకోణం.." అని అభివర్ణించిన జగన్మోహన్‌రెడ్డి ఇంతవరకు ఒక్కరిని కూడా దోషిగా నిలబెట్టలేకపోయారు. ఆరు మాసాలుగా రంధ్రాన్వేషణ చేసి కూడా ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని నిరూపించలేకపోగా ఇప్పుడు మళ్లీ లోకాయుక్త, కాకుంటే సీబీఐ లేదా సీఐడీతో విచారణ జరిపించాలని శుక్రవారంనాడు మంత్రిమండలి నిర్ణయించడం విడ్డూరంగా ఉంది. అమరావతిని చంపేయడానికి కారణం కావాలి కనుక ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని చెబుతూ వస్తున్నారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పడం వల్ల నిజం అవుతుందన్న సూత్రాన్ని జగన్ అండ్ కో నమ్ముతున్నట్టు ఉన్నారు. నిజంగా ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని రుజువు అయితే దోషులను శిక్షించాలని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో కోరుతున్నా ప్రభుత్వం ఆ పని ఎందుకు చేయలేకపోతున్నది? అన్నదే ప్రశ్న! రాష్ట్రానికి జగన్మోహన్‌రెడ్డి వల్ల ఇంత నష్టం జరుగుతుందని తెలియక మద్దతు ఇచ్చామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఇప్పుడు తీరిగ్గా వాపోతున్నారు. రాజశేఖర్‌రెడ్డి వద్ద మంత్రిగా పనిచేసిన కన్నాకు జగన్మోహన్‌రెడ్డి గురించి తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉంది. సుపుత్రుడి వ్యవహారాలను జీవించి ఉన్నప్పుడు రాజశేఖర్‌రెడ్డి కూడా భరించలేకపోయారన్నది బహిరంగ రహస్యం! ఇప్పుడు రాష్ట్ర ప్రజలు కూడా జగన్మోహన్‌రెడ్డి ఇలా చేస్తారని అనుకోలేదని వాపోతున్నారు. రాజధాని అమరావతి విస్తరించి ఉన్న కృష్ణా–గుంటూరు జిల్లాలకు చెందిన మంత్రులు, శాసనసభ్యులు ఏడవలేక నవ్వుతున్నారు. ప్రజలలో వ్యక్తమవుతున్న నిరసనలను ఎలా ఎదుర్కోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. రాజధాని గ్రామాల రైతులు చేపట్టిన ఆందోళన ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసుకోని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం అయినా ఆశ్చర్యపోవాల్సింది ఏమీ లేదు. కక్షపూరిత మనస్తత్వంతో ప్రభుత్వ పెద్దలు వేస్తున్న అడుగుల వల్ల ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ప్రాంతీయ కుంపట్లు రాజుకునే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే అభివృద్ధి చెందిన విశాఖను మరింత అభివృద్ధి చేయడం వల్ల భవిష్యత్తులో ప్రాంతీయ ఉద్యమాలకు బీజం వేసిన పాపం జగన్ అండ్ కోకే దక్కుతుంది. "రాజధాని అయినా ఇవ్వండి లేదా ప్రత్యేక రాష్ట్రమైనా ఇవ్వండి" అని రాయలసీమకు చెందిన ప్రముఖుల నుంచి ఇప్పటికే డిమాండ్ మొదలైంది. భౌగోళికంగా రాష్ట్రానికి ఒక చివరన ఉన్న విశాఖను రాజధానిగా ఎంపిక చేయడం ఏమిటని సీమవాసులు మండిపడుతున్నారు. అమరావతి నిర్మాణాన్ని కొనసాగించి ఉంటే హైకోర్టుతోపాటు రాజధానిపై వివాదాలన్నీ సమసిపోయి ఉండేవి. కర్నూలువాసుల కోరిక మేరకు అక్కడ హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేస్తే సరిపోయేది. అయితే ఇప్పుడు తేనెతుట్టెను కదిలించారు. తేనెటీగల దాడికి ఎవరు బలవుతారో తెలియదు. ప్రస్తుతానికి రాష్ట్రం బలైపోతున్నది. తమ ప్రాంతంలో రాజధాని అని అంటే ఎవరికి మాత్రం ఆనందంగా ఉండదు. ఉత్తరాంధ్రవాసులు, ముఖ్యంగా విశాఖవాసులు కూడా సచివాలయం, శాసనసభ వస్తే తాము బాగుపడిపోతామని అమాయకంగా నమ్ముతున్నారు. అయితే ప్రశాంత జీవనానికి అలవాటుపడిన విశాఖవాసుల్లో ప్రభుత్వ నిర్ణయం పట్ల ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. తమపై కడప జిల్లా వారి పెత్తనం పెరిగిపోయే ప్రమాదముందని వారు భయపడుతున్నారు. గతంలో విశాఖ ఎంపీ స్థానానికి పోటీ చేసిన రాజశేఖర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి ఓడిపోవడానికి కూడా ఈ భయమే ప్రధాన కారణమని చెబుతారు. "ఆంధ్రప్రదేశ్ రాజధాని ఎక్కడ ఉన్నా తేడా ఉండదు. తమిళనాడులో ఉన్నా, తెలంగాణలో ఉన్నా తేడా ఉండదు" అని సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ వ్యాఖ్యానించారంటే.. రాజధాని అనే మాటలను ఎంత చులకన చేసుకుంటున్నారో పాలకులకు అర్థమవుతోందా? తొలుత 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' అనే సినిమా తీసి, ఆ పేరుపై అభ్యంతరాలు రావడంతో 'అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు'గా టైటిల్ మార్చి హడావుడి చేసిన రామ్‌గోపాల్ వర్మ తన తదుపరి చిత్రానికి 'ఉత్తరాంధ్ర తీరంవైపు కదులుతున్న కడప రెడ్లు' అనే టైటిల్‌తో మరో సినిమా తీస్తారేమో చూడాలి అని గుంటూరు జిల్లాకు చెందిన ఒక మిత్రుడు వ్యాఖ్యానించడాన్ని తప్పుబట్టగలమా? కమ్మ రాజ్యాన్ని ధ్వంసం చేసినందున ఉత్తరాంధ్ర వైపు కదులుతున్న కడప రెడ్లు అని రామ్‌గోపాల్ వర్మ చెప్పుకోవచ్చు కూడా! రాజధాని మార్పుపై సామాజిక మాధ్యమాలలో చలామణి అవుతున్న జోక్స్ అయినా.. పాలకుల కళ్లు తెరిపిస్తాయనుకోవడం అత్యాశ అయ్యేలా ఉంది. జగన్‌కు ఓటేసినందుకు రాజధానికి చెందిన రైతులు తమ చెప్పులతో తామే కొట్టుకుంటున్నారు. ఈ ఆవేదన ఆగ్రహంగా మారితే పాలకులకు ఎటువంటి పరిస్థితి ఎదురవుతుందో ఊహించుకోవడం కష్టమేమీ కాదు. జగన్మోహన్‌రెడ్డిపై పిచ్చి అభిమానంతో తమ సెల్‌ఫోన్లలో ఆయన బొమ్మను డిస్‌ప్లే పిక్చర్‌గా పెట్టుకున్నవారు సైతం ఇప్పుడు దాన్ని తొలగిస్తున్నారు. ఇలాంటి సందర్భాలలో "నీకు అట్టినే కావాలి.." అని నెల్లూరులో అంటూ ఉంటారు. ఇప్పుడు "మాకు ఇట్టినే కావాలి.." అని నెల్లూరు ప్రజలు కూడా వాపోతున్నారట. జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నది చారిత్రక తప్పిదమని ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా వ్యాఖ్యానించారు గానీ, సరిదిద్దుకోలేని తప్పు చేస్తున్నారని అని ఉంటే ఇంకా బాగుండేది. అంధకారంగా మారుతున్న తమ భవిష్యత్ గురించి ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పటికి తెలుసుకుంటారో తెలియదు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ తన వేయి పడగలు నవలలో "ఒక జాతి చచ్చిపోయినా పర్వాలేదు గానీ జీవచ్ఛవంలా ఉండిపోకూడదు" అని వ్యాఖ్యానిస్తారు. ఇది నిజమే కదా! ■

> ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు, అధికారంలో ఉన్నవారు చేస్తున్న ప్రకటనలు గమనిస్తే.. అదొక నాగరిక సమాజమా? అక్కడ అసలు మేధావులు, విజ్ఞులు లేనే లేరా? అన్న సందేహం కలుగుతోంది. రాజధానిని తరలించవద్దని ఆందోళన చేస్తున్న రైతులను ఉద్దేశించి "వాళ్ల భాష, ధరించిన దుస్తులను చూస్తే వారెవరో తెలియడం లేదా?" అని మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించడం అహంకారానికి నిదర్శనం కాదా? "70 ఏళ్లుగా వెనుకబడిపోయి ఉన్న ఉత్తరాంధ్రకు మంచి రోజులు వస్తుంటే.. ఆ గ్రామాలవారు సహించలేకపోతున్నారు" అని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఎగతాళి చేస్తున్నారు. మాతృభాష తెలుగుకే కులాన్ని ఆపాదిస్తున్న కుసంస్కారులు రాజ్యమేలుతున్నప్పుడు.. ధర్మాన, బొత్స, తమ్మినేని వంటివారు నోరు పారేసుకోకుండా ఎలా ఉండగలరు?

---

> కాలం అస్థిరమైనది. ప్రతి క్షణమూ మారుతుంటుంది. ధర్మం స్థిరమైనది. కాలాతీతంగా నిలుస్తుంది. అస్థిరమైన కాలానికి కట్టుబడడమా? సుస్థిరమైన మనదైన ధర్మానికి నిలబడడమా? ప్రతిరోజూ పాటించాల్సిన సంకల్పాన్ని, డైరీలో రాసుకుని, కన్వీనియెంట్‌గా మరిచిపోయే అలవాటు చేసుకున్నప్పుడే మన మెదళ్లు మొద్దుబారిపోయాయి. గోడ గడియారంలోని ముళ్లకు జీవితాన్ని వేలాడేసి, రోజెప్పుడు గడుస్తుందా? అని నిస్తేజంగా, నిస్సారంగా కుర్చీలో కూలబడిపోవాలా? నిముషాలనే మెట్లుగా మార్చుకుని సప్తాశ్వరథ సమారూఢుడితో దీటుగా పైపైకి పరుగులు తీయాలా? తేల్చుకోవడానికైనా మనం కొత్త సంవత్సరాన్ని స్వాగతించాల్సిందే!

# శుభం

ఈనాటి ఉషా కిరణం.. రేపటి ఉదయ సంధ్యా జ్యోతి.. అది ఏదైనా కృష్ణతత్వమైన చీకటిని వెలిగించిన వెలుతురే! వెలుగు నీడలో చీకటి దాగుందా? చీకటిని దాటి వచ్చి వెలుగు రేఖ విచ్చుకుందా? ఒక చొప్పదంటు ప్రశ్న. ఏదేమైనా అదొక 'అ–రుణా'నుబంధం! ప్రతి రోజూ ఉదయిస్తున్నా ప్రాతస్సూర్యుడెప్పుడూ పాతబడలేదు. ప్రాగ్దిశ పర్వతాల్లో వెలిసే ప్రభాకరుడెప్పుడూ కొండ దిగి అలసిపోలేదు. మంత్రముగ్ధుల్ని చేసే దినకర మయూఖ తంత్రుల వీణానాదమెప్పుడూ వినిపించకుండా ఆగిపోలేదు. అవిశ్రాంత కాల గమనంలో 'కిరణ– జన' సంయోగ ప్రక్రియకు ఏ రోజూ అంతరాయం ఏర్పడలేదు.


మరో 365 రోజులు గడిచిపోయాయి. అనంత కాల గమనాన్ని అంకెల్లో బంధించడానికి మనం పడే ఆరాటం అర్థరహితమని నిరూపిస్తూ... గోడ మీద వేలాడే క్యాలెండర్లో చివరి పేజీ... రెండు రోజుల్లో మళ్లీ చిరిగిపోనుంది. కాలానికి మనిషి పెట్టుకున్న లెక్క... ఏళ్లు వచ్చాయో, పోయాయో... అతనికే అర్థంకానిది! నిత్య నూతనమైన కాల గమనంలో, ఫలానా రోజు ప్రత్యేకమంటూ కొత్తదనాన్ని వెతుక్కోవడమే వ్యర్థ ప్రయాస. అజ్ఞానపు నిద్ర మత్తును వదిల్చే జ్ఞాన భాస్కరుడి పండుగను... మత్తులో మునిగి జరుపుకోవడమే... ఒక వైరుధ్య విషాదం. సూర్యుడు కనిపిస్తేనే వెలుగు... అది ఉదయం– జ్ఞానం! సూర్యుడు లేకుంటే చీకటి.. అది రాత్రి– అజ్ఞానం! రోజు మొదలయ్యేదే దినకరుడితో! అర్ధరాత్రి సూర్యోదయాన్ని చూడగలమా? ప్రాక్ ప్రపంచవాసులమైన మన వెనక జరుగుతున్న సూర్యోదయాన్ని... పాశ్చాత్యులు అద్దంలో చూపిస్తే... అదే అసలు అరుణోదయమని భ్రమపడి ఆరాధిస్తున్న అమాయకపు జాతి మనదన్నాడు సామవేదం. కనిపించే దేవుడికి నిత్యం పొద్దున్నే సూర్య నమస్కారాలు చేయాల్సిన జాతి... బారెడు పొద్దెక్కాకగానీ లేవని, లేవలేని దుస్థితికి దిగజారడం నిజం. సమస్త చరాచర జీవకోటి బ్రాహ్మీ ముహూర్తంలో ఎగిలివారక ముందే, చుక్కపొద్దులోనే నిద్రలేస్తుంటే.. మనం మాత్రం కోడి కూత కోసమో, అలారం మోత కోసమో వేచి చూస్తూ దుప్పట్లో దాక్కుంటున్నాం. అజ్ఞానపు జీవరాశి కూడా... సూర్యుడి తొలి పిలుపునకు ముందే మేల్కొంటుంటే... మనిషి మాత్రం మిలమిలల కరెంటు వెలుగుల్ని నమ్ముకుని, మాయదారి చీకట్లో మగ్గిపోతున్నాడు. మనిషిని చేరేందుకు కోట్ల కాంతి సంవత్సరాల నుంచి భాస్కరుడు తన కిరణ పుంజాలను పంపిస్తున్నా... కడప దాటి ఎండలోకి వెళ్లలేని అజ్ఞానులం మనం. ఏడాదికి 350 రోజులు ఎండకాసే, ఉష్ణమండల దేశంలో 70 శాతం మంది డీ విటమిన్ లోపమంటూ, ఇంపోర్టెడ్ మాత్రలు మింగుతుంటే బీచ్‌ల్లో సన్‌బాత్ చేసే పాశ్చాత్యులు నవ్విపోక ఇంకేం చేస్తారు?! మన సాంస్కృతిక మూలాలను మరిచినందుకు పట్టిన దుర్గతి ఇది! సర్వరోగ నివారణమైన ఆదిత్య హృదయ సారాంశాన్ని అర్థం చేసుకోలేక, కాలం మారిందని కట్టుకథలు చెప్పుకొంటున్న ఫలితమిది! అయినా పండుగ పండుగే.. పది మందితో నడవాల్సిందే! కనుక కొత్త సంవత్సరాన్ని స్వాగతిద్దాం.!

> విడదీతలు, కలబోతలకు సాక్షిభూతం కాలం. పెను మనో వేదనను కూడా 'కాల కల్ప' చికిత్సతో మాన్పగల కాలాన్ని, ఒకింత ఒడిసిపట్టడం కోసమైనా మనం కొత్త సంవత్సరాన్ని స్వాగతించాలి.

కాలం అస్థిరమైనది. ప్రతి క్షణమూ మారుతుంటుంది. ధర్మం స్థిరమైనది. కాలాతీతంగా నిలుస్తుంది. అస్థిరమైన కాలానికి కట్టుబడడమా? సుస్థిరమైన మనదైన ధర్మానికి నిలబడడమా? ప్రతిరోజూ పాటించాల్సిన సంకల్పాన్ని, డైరీలో రాసుకుని, కన్వీనియెంట్‌గా మరిచిపోయే అలవాటు చేసుకున్నప్పుడే మన మెదళ్లు మొద్దుబారిపోయాయి. గోడ గడియారంలోని ముళ్లకు జీవితాన్ని వేలాడేసి, రోజెప్పుడు గడుస్తుందా? అని నిస్తేజంగా, నిస్సారంగా కుర్చీలో కూలబడిపోవాలా? నిముషాలనే మెట్లుగా మార్చుకుని సప్తాశ్వరథ సమారూఢుడితో దీటుగా పైపైకి పరుగులు తీయాలా? తేల్చుకోవడానికైనా మనం కొత్త సంవత్సరాన్ని స్వాగతించాల్సిందే!

ఉదయాస్తమయాలు జరుగుతూనే ఉంటాయి. కానీ సూర్యుడు ఉదయించడం కోసం అస్తమిస్తాడా? అస్తమించడం కోసం ఉదయిస్తాడా? పాతబడేందుకు కొత్త ఏడాది వస్తుందా? కొత్త ఏడాదికి అవకాశమివ్వడం కోసం పాతది గతంలోకి నిష్క్రమిస్తుందా? సంవత్సరాలు ఎన్ని వస్తున్నా... సమయం లేదన్న మాటే పెరుగుతూ వస్తున్నది. నిజానికి సమయం ఒకప్పుడు ఎంత ఉందో... ఇప్పుడే అంతే ఉంది! మారింది సమయం కాదు... మనం! సమయం 'స్వ'మయంగా మారి... రెండు చేతులు సెల్‌ఫోన్‌లో చిక్కుకుపోయి... కళ్లు బ్లూస్క్రీన్‌కు అతుక్కుపోయి... బుద్ధి డేటాలో కూరుకు పోయినప్పుడు.. తలవంపులే తప్ప... తలెత్తుకు తిరిగే పరిస్థితి లేని కాలంలో... మానవ సంబంధాలను మిగుల్చుకోవడానికైనా ఒక అకేషన్ కావాలి కనుక... కొత్త సంవత్సరాన్ని మనం స్వాగతించాల్సిందే.

'సర్, మీరు రోజూ లేటెందుకు వస్తారు? చేతికి వాచీ పెట్టుకోవచ్చు కదా?' అని అడిగినప్పుడు... 'నేను వాచీ పెట్టుకున్నంత మాత్రాన ఆర్టీసీ బస్సు సమయానికి వస్తుందా? తన




ఇష్టమున్నప్పుడు వచ్చే ఆర్టీసీ బస్సు కోసం, నేను వాచీ పెట్టుకుని, టైమ్ చూసుకుంటే వచ్చే లాభమేంటి? అసహనం, టెన్షన్ పెరగడం తప్ప' అని 25 ఏళ్ల క్రితమే అనువాదం మాస్టారు జవాబిచ్చినపుడు అది జీవితానుభవాన్ని ఆచరణలోకి అనువదించినట్టు అనిపించింది. కాలం, సహనం రెండు గొప్ప యుద్ధవీరులన్నాడు టాల్‌స్టాయ్. ఏదీ దేన్నీ గెలవలేదు. ఏదీ దేన్నీ ఓడించలేదు. కానీ కలిపి ఉంచగలిగితే, ఒకదానికొకటి పూరకమవుతాయి. కాలానుగుణంగా బతకాలంటే సహనం కావాలి. సహనం మిగలాలంటే కాలం కలిసిరావాలి. రెంటికీ మధ్య సమన్వయమే టైమ్ మేనేజ్‌మెంట్. కాలజ్ఞానమంటే రాబోయే కాలంలో ఏం జరుగుతుందో చెప్పే తెలివి కాదు. ఉన్న కాలాన్ని ఎలా వాడుకోవాలో తెలుసుకోవడం.

'మూర్ఖుడు గడియారంలో ముల్లు కదలనీకుంటే ధరాగమనమంతటితో తలకిందై పోతుందా?' అన్నాడు కవి. సమయం సరిపోవడం లేదంటున్నవాళ్లు మరింత సమయాన్ని వెతుక్కోవడం కోసం, అది సాధ్యం కాకపోతే మరింత సహనాన్ని నేర్చుకోవడం కోసమైనా మనం కొత్త సంవత్సరాన్ని సాదరంగా స్వాగతించాలి.

'గత కాలము మేలు, వచ్చు కాలము కంటెన్' అన్నారు పెద్దలు. ఏ కాలానికైనా వర్తించే సూక్తి ఇది. గుండెను పిండేసే గాయాలను కూడా మరుపు పొరల్లోకి నెట్టి మాయం చేయగల శక్తి కాలం సొంతం. సవాల్ చేసే సమస్యల్ని కూడా సమూలంగా పరిష్కరించేది కాలం. అది ప్రవాహ సదృశం. సాయంకాలపు ఎండలో నీడలా పెరిగే సజ్జన భవబంధాలను, ఉదయకాలపు ఎండలో నీడలా ఉండాల్సిన శతృత్వాలను తనలో కలిపేసుకుని సాగిపోయేది కాలం. విడదీతలు, కలబోతలకు సాక్షిభూతం కాలం. పెను మనో వేదనను కూడా 'కాల కల్ప' చికిత్సతో మాన్పగల కాలాన్ని, ఒకింత ఒడిసిపట్టడం కోసమైనా మనం కొత్త సంవత్సరాన్ని స్వాగతించాలి.

ఎదురే లేదనుకున్న వారిని ఎత్తిపడేస్తుంది కాలం. పాతాళంలో ఉన్నవారిని పైకి తెస్తుంది. అనుకున్నది అందకుండా చేస్తుంది. అనూహ్యతను అందిస్తుంది. కాలాన్ని దోచుకోగలమే తప్ప దాచుకోలేం. టైమ్ కోసం మనం వేచి చూడవలసిందే. టైమ్ మన కోసం వేచి చూడదు. చేతికి వాచీయే తప్ప సమయం మన చేతిలో ఉండదు. తనకు నచ్చినట్టు వచ్చే కాలాన్ని స్వాగతించడం తప్ప మరేమీ చేయలేం కనుక... మనం కొత్త సంవత్సరాన్ని స్వాగతించాల్సిందే.


భగవంతుడి ప్రయోగశాలలో కాలనాళికలో చిక్కుకున్న స్వల్పకాలిక జీవులం మనం. 'మా కురు ధన జన యవ్వన గర్వం... హరతి నిమేషా కాలస్సర్వం' అన్నారు ఆది శంకరాచార్యులు. డబ్బు, పరివారము, యవ్వనం ఉందని గర్వపడకు. కాలం తలచుకుంటే నిముషంలో వాటన్నింటినీ హరిస్తుందని హెచ్చరించారు. కాటేసేందుకు పొంచి ఉండే కాలసర్పంలాంటి కాలాన్ని ప్రసన్నం చేసుకోవడం కోసమైనా మనం కొత్త సంవత్సరాన్ని స్వాగతించాలి.

**చివరాఖరు:** ఈ 'కృ.తి.'ని ఇన్నాళ్లూ అభిమానించి, ఆదరించిన అందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటూ... ఈ 'కాలమ్'ను ముగించే కాలం ఆసన్నమైందని విన్నవించుకుంటూ... అందరికీ చిరకాలం మంచి జరగాలని మనసారా కోరుకుంటూ... శుభం!!

మీ
కృష్ణమూర్తి తిగుళ్ల
kruthi1972@gmail.com

జీవితం ఒక ప్రయాణం... పరుగు ఆగదు!
ఈ ప్రయాణంలో ఎన్నో చూస్తుంటాం!
రోజులు గడిచే కొద్దీ కొన్నే గుర్తుంటాయి!
కొన్నిటి గురించే మళ్ళీ మళ్ళీ వింటుంటాం...
మాట్లాడుకుంటాం!
సినిమాల్లోనూ అంతే!
ప్రతి ఏడాదీ ఎన్నో చిత్రాలు వస్తాయి! చివరకు, గుర్తుండేది కొన్నే!
ఆ కొన్నిటి గురించే ప్రముఖంగా వినిపిస్తుంది!
అలా 2019లో 'టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ'గా నిలిచిన కొన్ని సినిమాల సంగతులు...

# టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ 2019



## చారిత్రక చిత్రం

### సైరా నరసింహారెడ్డి

గడచిన కాలాన్ని తిరిగి తీసుకురాలేం... కాలంలో వెనక్కీ వెళ్ళలేం! అందుకే... పెద్దలు 'గతం గతః' అనేది! అయితే... గడచిన కాలానికి వెండితెరపై రూపం ఇవ్వవచ్చు. చరిత్రను వెండితెరపై కళ్ళకు కట్టినట్టు చూపించవచ్చు. తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు 'ఉయ్యాలవాడ' నరసింహారెడ్డిని చిరంజీవి రూపంలో దర్శకుడు సురేందర్‌రెడ్డి, నిర్మాత రామ్‌చరణ్ ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఆయన చరిత్రను వెండితెరపై సాక్షాత్కరింపజేశారు. తెలుగులో ఈ ఏడాది వచ్చిన ఏకైక చారిత్రక చిత్రం 'సైరా నరసింహా రెడ్డి'. థియేటర్లలో ప్రేక్షకులు ఆ కాలంలోకి వెళ్ళారంటే... అదంతా చిత్రబృందం చేసిన కఠోర శ్రమ ఫలితమే.

## సందేశాత్మక సినిమా

### మహర్షి

గ్రామాల దత్తత అంశంతో 2015లో మహేశ్‌బాబు 'శ్రీమంతుడు' చిత్రం చేశారు. స్నేహం నేపథ్యంలో వ్యవసాయం ప్రాముఖ్యం తెలియజేసే కథతో ఈ ఏడాది ఆయన 'మహర్షి' చేశారు. నలుగురికీ అన్నం పెట్టే రైతన్నల సమస్యలు, వాళ్ళ ఆత్మహత్యల గురించి ఈ చిత్రంలో చూపించారు. చిత్రంలో రైతు నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు, భావోద్వేగాలు, వీకెండ్ ఫార్మింగ్ దృశ్యాలు పలువుర్ని ఆకర్షించాయి.



## ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

### 'ఎఫ్ 2'

సినిమాలో శ్రీమతి తమన్నా చేసే పనులతో వెంకటేశ్... ముందు ప్రేయసిగా, తర్వాత శ్రీమతిగా మెహరీన్ చేసే పనులతో వరుణ్ తేజ్ ఫ్రస్ట్రేషన్‌కి గురయ్యారు. వాళ్ళ ఫ్రస్ట్రేషన్ థియేటర్లలో నవ్వులు పూయించింది. ఫుల్ ఫన్! ఈ ఏడాది సంక్రాంతికి థియేటర్లలోకి వచ్చిన 'ఎఫ్ 2' కుటుంబ కథా చిత్రాల ప్రేక్షకులందరినీ నవ్వించింది. హీరోలు వెంకటేశ్, వరుణ్‌తేజ్ నటన... హీరోయిన్లు తమన్నా, మెహరీన్ అందాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ప్రేక్షకులకు వినోదం పంచడమే పరమావధిగా రూపొందించిన చిత్రమిది. వినోదంతో విజయం అందుకుంది.



## జీవితకథా చిత్రం

### మల్లేశం

చేనేత కార్మికుల వెతలు తీర్చిన ఆసు యంత్రం సృష్టికర్త చింతకింది మల్లేశం. సంకల్పం బలమైనది అయితే ఎన్ని అవరోధాలు ఎదురైనా జయించవచ్చని చెప్పడానికి సాక్ష్యం ఆయన జీవితం! పాఠశాలతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టిన మల్లేశం... సాంకేతికతను ఎలా అందిపుచ్చుకున్నారు? ఆసు యంత్రం ఎలా రూపొందించారు? వంటి జీవిత సంఘటనల సమాహారంగా 'మల్లేశం' చిత్రం తెరకెక్కింది. తల్లీకొడుకులు, భార్యాభర్తల మధ్య అనుబంధాలను, కుటుంబ భావోద్వేగాలనూ ఈ చిత్రంలో చూపించారు. 30 ఏళ్ళ మల్లేశం జీవితాన్ని, ఆసు యంత్రం రూపొందించడానికి పడిన వ్యయప్రయాసలను, శ్రమను దర్శక-నిర్మాత రాజ్ రాచకొండ మూడు గంటల్లోపు చూపించారు. తొలి చిత్రమైనా చిత్రాన్ని చక్కగా తెరకెక్కించారు. మల్లేశంగా ప్రియదర్శి, తల్లిగా ఝాన్సీ, తండ్రిగా ఆనంద చక్రపాణి, సతీమణిగా అనన్య నాగళ్ల తమ పాత్రల్లో ఒదిగి నటించారు.


ప్రియదర్శి, ఝాన్సీ

## లుక్ ఆఫ్ ది ఇయర్

### నందమూరి బాలకృష్ణ

బాలకృష్ణ మాస్ హీరో. 'రూలర్'లో ఆయన క్లాసీ లుక్ ఈ ఏడాది ఓ సర్‌ప్రైజ్! మార్వెల్ స్టూడియోస్ సృష్టి 'ఐరన్‌మ్యాన్'లో హాలీవుడ్ నటుడు రాబర్ట్ డౌనీ జూనియర్ పోషించిన టోనీ స్టార్క్ గెటప్‌లో బాలకృష్ణ కనిపించి చర్చనీయాంశమయ్యారు. ఈ లుక్‌లో తనను చూసినవారంతా 'నందమూరి టోనీ స్టార్క్' అంటున్నారని బాలకృష్ణ అన్నారు.




శ్రద్ధా శ్రీనాథ్

## కొత్త హీరో గురూ!

### నవీన్ పోలిశెట్టి

నవరసాల సమ్మేళనం నటన. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో తెలుగు తెరకుహీరోగా పరిచయమైన నవీన్ పోలిశెట్టి... కథ, అందులో పాత్ర పరిధి మేరకు అన్నిటిలో ప్రతిభ చాటుకునే ప్రయత్నం చేశాడు. డిటెక్టివ్‌గా నవ్వించాడు. మదర్ సెంటిమెంట్ సీన్స్‌లో కళ్లు చెమ్మగిల్లేలా చేశాడు. నటనతో తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తి, ఉత్కంఠ కలిగించాడు. కోపం, బాధ... అన్నిటినీ హావభావాల్లో చూపించాడు. గొంతు మార్చి మాట్లాడే నేర్పు ఇతడి సొంతం. హీరోగా నవీన్ పోలిశెట్టికి 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' తొలి చిత్రమే. నటుడిగా ఇంతకు ముందు '1... నేనొక్కడినే', 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' చిత్రాలు, హిందీలో కొన్ని యూట్యూబ్ ఫిల్మ్ చేశాడు. ఆ అనుభవమంతా హీరోగా తొలి చిత్రంలో కనిపించింది. అలాగే, ఈ ఏడాది 'మీకు మాత్రమే చెప్తా'తో దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా పరిచయమయ్యారు. అంతకు ముందు, 'ఫలక్‌నుమా దాస్'లో ఆయన ఓ పాత్ర చేశారు. 'దొరసాని'తో విజయ్ దేవరకొండ తమ్ముడు ఆనంద్ దేవరకొండ, 'రాజ్‌దూత్'తో శ్రీహరి కుమారుడు మేఘాంశ్, 'మత్తు వదలరా'తో సంగీత దర్శకుడు కీరవాణి కుమారుడు శ్రీసింహా కూడా హీరోలుగా వచ్చారు.



## ఉత్తమ క్రీడా నేపథ్య చిత్రం

### జెర్సీ

ప్రతి ఒక్కరికీ ప్రీతిపాత్రమైనది ఏదో ఒకటి ఉంటుంది. ప్రాణం ముఖ్యమా? ప్రీతిపాత్రమైనది ముఖ్యమా? అంటే ప్రాణానికి ఓటేసే వాళ్ళ శాతం ఎక్కువ ఉంటుందేమో! అయితే... ప్రాణం ముఖ్యం కాదని క్రీడాప్రాంగణంలో అడుగుపెట్టిన ఓ క్రికెటర్ కథ 'జెర్సీ'. ఇష్టమైన రంగంలో విజయం సాధించడానికి వయసు, శరీరం అడ్డంకి కాబోవని స్ఫూర్తి రగిలించే చిత్రమిది. ఓ వయసు వచ్చాక... మధ్య తరగతి క్రీడాకారులు ఎదుర్కొనే సమస్యలనూ, కుటుంబ పరిస్థితులనూ సున్నితంగా సినిమాలో చర్చించారు. అన్నిటికంటే ముఖ్యంగా క్రికెట్ నేపథ్య సన్నివేశాలను లైవ్‌లో చూస్తున్న అనుభూతి వచ్చేలా తెరకెక్కించారు. నాని సహజ నటన... దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తీసిన విధానం ప్రేక్షకుల్ని కట్టిపడేస్తాయి. కన్నడ, తమిళ, మలయాళ భాషల్లో పలు చిత్రాలు చేసిన శ్రద్ధా శ్రీనాథ్... 'జెర్సీ'తో తెలుగు తెరకు పరిచయమయ్యారు. తెరపై పాత్ర మాత్రమే కనిపించేలా నటించి ఆకట్టుకున్నారు.



## అనూహ్య విజయం

### ఇస్మార్ట్ శంకర్

'ఇస్మార్ట్ శంకర్' విడుదలకు ముందు, ఆ సినిమాలో పాటలు ప్రేక్షకుల నోళ్ళలో నానాయి. ప్రచార చిత్రాల్లో హైదరాబాదీ యువకుడిగా హీరో రామ్ ఆహార్యం, దర్శకుడు పూరి జగన్నాథ్ మార్క్ డైలాగులను రామ్ పలికిన విధానం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. అయినా... 'ఇస్మార్ట్ శంకర్' పెద్ద అంచనాలు లేకుండానే థియేటర్లలోకి వచ్చింది. వ్యాపార వర్గాలతో పాటు సగటు ప్రేక్షకుల ఊహకు అందనంత భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అందరి అంచనాలను తల్లకిందులు చేసింది. కమర్షియల్ మీటర్‌లో కరెక్టుగా సినిమా తీస్తే... కాసులు కురవడం ఖాయమని నిరూపించిన



## కొత్త దర్శకులు 'ఎవరు'?

వినోదాత్మక చిత్రాలకు, వాణిజ్య హంగులున్న చిత్రాలకు ఓ వెసులుబాటు ఉంటుంది. ఓ సన్నివేశాన్ని సాదాసీదాగా తీసేసినా... తర్వాత సన్నివేశంలో చక్కదిద్దుకునే వీలుంటుంది. అదే థ్రిల్లర్ చిత్రాలకు... ప్రతి క్షణం పోరాటమే. ప్రేక్షకుడి చూపు తిప్పుకోనివ్వకుండా సినిమా తీయాలి. తొలి ప్రయత్నంలో అలా తీసి విజయం అందుకోవడం, ఎవరీ కొత్త దర్శకుడు అని పరిశ్రమ వర్గాలు, ప్రేక్షకులు చూసేలా చేయడం గొప్ప విషయమే. ఈ ఏడాది అటువంటి ఘనత సాధించిన ముగ్గురున్నారు. విజయవంతమైన కామెడీ థ్రిల్లర్ 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో దర్శకుడిగా పరిచయమైన స్వరూప్ ఆర్ఎస్‌జె... 'ఎవరు'తో విజయం అందుకున్న దర్శకుడు వెంకట్ రామ్‌జీ... 'మత్తు వదలరా'తో తాజాగా ప్రేక్షకుల ముందుకొచ్చిన రితేశ్ రానా... ప్రతిభావంతులైన యువ దర్శకుల జాబితాలో చేరారు. 'ఫలక్‌నుమా దాస్'లో హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం వహించారు విశ్వక్‌సేన్. తెలంగాణ నేపథ్యంలో 'దొరసాని' తీసిన కెవిఆర్ మహేంద్ర, క్యాస్ట్ ఇష్యూను వినోదాత్మకంగా చెప్పిన 'ఎవ్వరికీ చెప్పొద్దు' దర్శకుడు బసవ శంకర్ పేర్లూ వినిపించాయి.



## వివాదాస్పద చిత్రాలు

### లక్ష్మీస్ ఎన్టీఆర్, అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు

ఒక వ్యక్తి నుండి శక్తిగా ఎదిగిన మహనీయులు చరిత్రపుటలకు ఎక్కుతారు. ఎంతో మంది మనోభావాలతో చరిత్ర ముడిపడి ఉంటుంది. అటువంటి చరిత్రతో సినిమాలు తెరకెక్కించడం కత్తిమీద సాములాంటి వ్యవహారమే. తేడా వస్తే ప్రజా తేనెతుట్టెను కదిపినట్టే. ఈ ఏడాది దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రెండుసార్లు ప్రజా తేనెతుట్టెను కదిపారు. థియేటర్ గడప ఎక్కాల్సిన దర్శక-నిర్మాతలు, ప్రేక్షకులు కోర్టు గడప ఎక్కారు. దివంగత నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జీవితంలోకి లక్ష్మీపార్వతి ప్రవేశించిన తర్వాత ఏం జరిగిందనే కథతో... అగస్త్య మంజుతో కలిసి రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'లక్ష్మీస్ ఎన్టీఆర్'. అలాగే, మే 2019 నుండి సెప్టెంబర్ 2020 మధ్య జరిగిన ఊహాజనిత ఘటనల ఆధారంగా సిద్ధార్థ తాతోలు దర్శకత్వంలో వర్మ సంస్థ నుండి వచ్చిన చిత్రం 'అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు'. ఈ రెండూ చాలా వివాదాలకు నెలవుగా మారాయి. వీటికి వ్యతిరేకంగా కొందరు కోర్టులను ఆశ్రయించడంతో అనుకున్న తేదీల కంటే ఆలస్యంగా విడుదలయ్యాయి. అభ్యంతరాల నేపథ్యంలో 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' టైటిల్‌ను 'అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు'గా మార్చారు. వరుణ్‌తేజ్ హీరోగా నటించిన 'వాల్మీకి' టైటిల్‌పై బోయ సామాజిక వర్గం అభ్యంతరాలు తెలపడంతో 'గద్దలకొండ గణేష్'గా మార్చారు. '90ఎంఎల్'పై కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ వివాదాలు వెంటనే సమసిపోయాయి. వర్మ చిత్రాలు సృష్టించిన వివాదాలు రోజుల తరబడి వార్తల్లో నిలిచాయి

• సత్య పులగం













# స్వామి అవతరణ మనకోసమే!


**తిరుప్పావై**

## పద్నాలుగో పాశురం

ఉంగళ్ పుళైక్కడై త్తోట్టత్తు వావియుళ్
శెంగళు నీర్ వాయ్ నెగిళ్న్దు అమ్బల్ వాయ్
కూంబినగాణ్
శెంగల్ పొడి క్కూరై వెణ్పల్ తవత్తవర్,
తంగళ్ తిరుక్కోయిల్ శంగిడువాన్ పోగిన్దార్,
ఎంగళై మున్నమ్ ఎళుప్పువాన్ వాయ్
పేశుమ్
నంగాయ్! ఎళున్దిరాయ్! నాణాదాయ్,
నావుడైయాయ్!
శంగొడు శక్కరమ్ ఏన్దుమ్ తడక్కైయన్
పంగయ క్కణ్ణానై ప్పాడు ఏల్ ఓర్
ఎంబావాయ్

**భావం:** వచ్చిన గోపికలందరూ శ్రీకృష్ణుణ్ణి చేరాలనే ఆర్తితో వచ్చినవారు. ఇళ్ళలో నిద్రపోతున్న వారందరూ స్వామే వచ్చి తమను పొందాలని అనుకొనేవారు. 'సర్వాంతర్యామే రావాలి తప్ప మనం వెళ్ళి పొందగలమా?' అనే భావనతో ఉన్నవారు. నిద్ర లేవడానికి బద్ధకిస్తున్న ఒకరిని "అమ్మా! నీ ఇంటి పెరటి తోటలో దిగుడు బావి ఉంది. అందులో ఎర్ర కలువలు (తామరలు) వికసించాయి. నల్ల కలువలు ముకుళించాయి. (అజ్ఞానం తొలగి జ్ఞానం వికసించిందని భావన. పైన ఉన్న సూర్యుడే... అంటే భగవానుడే జ్ఞానప్రదాత. తెల్లవారిందని భావన.) సన్న్యాసులు, మఠాధిపతులు, ఆచార్యవర్యులు దేవాలయానికి కదులుతున్నారు. మా అందరికన్నా ముందుగా మేలుకొలుపుతానని నువ్వే మాట ఇచ్చేవు కదా! బీరాలు ఆడినదానా! ప్రతిన పూనని పూర్ణురాలా! సిగ్గు వదలిన దానా! మాటల చమత్కృతి కలిగిన దానా! లేచి రావమ్మా! శంఖు చక్రాలు ధరించిన వాడిని... పంకజ నేత్రుణ్ణి సేవిద్దాం. ఉపాస్య దైవమైన శ్రీకృష్ణుడు మన కోసం భువిలో అవతరించాడు. ఆయనను లేపి స్తోత్రాలు పాడుదాం. రావమ్మా! మాతో కలిసి రా! ఈ భవ్యమైన వ్రతం... మనం ఆచరించాల్సిన అద్వితీయ వ్రతం" అని గోపికలు ఆహ్వానిస్తున్నారు.

● ఎ. సీతారామారావు





## ముత్యాల ముగ్గు





**బి.భారతి**
హసన్‌బద, తూర్పుగోదావరి జిల్లా

24 చుక్కలు
8 వరుసలు
8 వచ్చే వరకు
సరి చుక్క





**ఇ.శృతి**
సింగపూర్

18-10
మధ్య చుక్క



17 చుక్కలు
9 వచ్చే వరకు
సందు చుక్క



**దుర్గాభవాని**
పంజాగుట్ట, హైదరాబాద్

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.

మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033.
Email: navya@andhrajyothy.com


## డైలీ సుడోకు - 237

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 7 | | | | | 8 | | |
| 3 | | 2 | | | | 4 | 6 | 5 |
| | | 8 | 1 | | | | 9 | |
| | 3 | 1 | 6 | 9 | | | | |
| | 6 | | 7 | | 8 | | 1 | |
| | | | | 2 | 1 | 5 | 7 | |
| | 9 | | | | 3 | 1 | | |
| 8 | 2 | 3 | | | | 6 | | 9 |
| | | 7 | | | | | 5 | 8 |

### సుడోకు- 236 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 6 | 1 | 9 | 5 | 2 | 4 | 3 | 8 |
| 3 | 2 | 8 | 7 | 6 | 4 | 1 | 9 | 5 |
| 4 | 5 | 9 | 8 | 1 | 3 | 6 | 7 | 2 |
| 2 | 1 | 7 | 3 | 9 | 6 | 5 | 8 | 4 |
| 5 | 8 | 4 | 1 | 2 | 7 | 9 | 6 | 3 |
| 6 | 9 | 3 | 5 | 4 | 8 | 7 | 2 | 1 |
| 8 | 3 | 6 | 4 | 7 | 5 | 2 | 1 | 9 |
| 9 | 7 | 5 | 2 | 8 | 1 | 3 | 4 | 6 |
| 1 | 4 | 2 | 6 | 3 | 9 | 8 | 5 | 7 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.




జై చెన్నకేశవ పిక్చర్స్
JANUARY
1ST
RELEASE
రాజానరసింహ
కాంబినేషన్‌లో వస్తున్న అద్భుత చిత్రం...


విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్
JAN
3RD
2020
RELEASE
'గద్దలకొండ గణేష్' ఫేమ్
అధర్వ
నటించిన
బూమరాంగ్
నిర్మాత
సి.హెచ్. సతీష్ కుమార్
కథ-స్క్రీన్‌ప్లే & దర్శకత్వం
ఆర్.కె. కణ్ణన్



Lalit Modi & Gautamchand Rathore
Presents
MISSION OF DOG
RELEASING ON JANUARY 3rd
K.C. BOKADIA'S
నమస్తే నేస్తమా...
Written & Directed by
K.C. BOKADIA
Through....INDRA FILMS RELEASE Contact:9100216976
ZEE MUSIC CO. Watch the Trailer and video song only on www.youtube.com/zeemusicsouth
SUJEETHads


1st JANUARY RELEASE
ఉల్లాల ఉల్లాల
PRODUCER : A. GURU RAJ
DIRECTION : SATHIYA PRAKASSH


MATINEE ENTERTAINMENT
ఆంధ్రజ్యోతి
హైదరాబాద్ నడిబొడ్డున ఎన్కౌంటర్ : ఆరుగురు మృతి
విజయ్ వర్మ (WILD DOG) చర్య
MATINEE ENTERTAINMENT'S
WILD DOG
WRITER - DIRECTOR AHISHOR SOLOMON
PRODUCERS NIRANJAN REDDY, ANVESH REDDY
SHOOTING IN PROGRESS


PUSHKAR FILMS
PARAMVAH
JAN 1ST
2020
GRAND RELEASE
STARRING
RAKSHIT SHETTY
PUSHKAR FILMS
PRODUCTION
ASN
రక్షిత్ శెట్టి
అతడే
శ్రీమన్నారాయణ
TELUGU-KANNADA-HINDI-TAMIL-MALAYALAM
DIRECTED BY SACHIN
PRODUCED BY
PUSHKARA MALLIKARJUNAIAH
DISTRIBUTED BY : SRI VENKATESHWARA FILMS

# జాప్యానికి మూల్యం చెల్లించాల్సిందే..



## పరిహారం పొందడం వినియోగదారుల హక్కు

ఆర్థిక సర్వీసుల కంపెనీలు సేవల్లో జాప్యానికి భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. సేవా లోపానికి పరిహారం పొందడం వినియోగదారుల హక్కుగా సెబీ, ఆర్‌బీఐ, ఐఆర్‌డీఏఐ గుర్తించాయి. కంపెనీలకు ఏ సేవ అందించేందుకు చట్టపరంగా ఎంత గడువు ఉంది, ఆ గడువు దాటినట్టయితే కస్టమర్లు ఎంత మొత్తంలో పరిహారం పొందగలుగుతారో చూద్దాం..

### సాధారణ బీమా

**క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లో వైఫల్యం**

**క్లెయిమ్ ఆమోదం లేదా తిరస్కరణ గడువు :** తుది సర్వే నివేదిక, సంబంధిత సమాచారం అందిన రోజు నుంచి 30 రోజులు
**పెనాల్టీ :** సంబంధిత పత్రాలన్నీ అందిన తేదీకి, క్లెయిమ్ చెల్లింపు తేదీకి మధ్యన బ్యాంకు రేటుపై రెండు శాతం వడ్డీ జోడించి చెల్లించాలి.

### జీవిత బీమా

**డెత్ క్లెయిమ్..**

**క్లెయిమ్‌కు సంబంధించి ప్రశ్నలు అడిగేందుకు గడువు :** 15 రోజులు
**క్లెయిమ్ అనుమతి లేదా తిరస్కరణ గడువు :** సంబంధిత పత్రాలు అందిన తేదీ నుంచి 30 రోజులు
**పెనాల్టీ :** అన్ని రకాల పత్రాలతో దరఖాస్తు అందిన తేదీ నుంచి బ్యాంకు రేటుపై (ప్రస్తుతం 5.4 శాతం) రెండు శాతం వడ్డీతో చెల్లించాలి.

**మరింత దర్యాప్తు అవసరమైతే**

**దర్యాప్తు పూర్తి కావలసిన గడువు :** 90 రోజులు
**క్లెయిమ్ చెల్లింపు లేదా తిరస్కరణ :** దర్యాప్తు పూర్తయిన తేదీ నుంచి 30 రోజులు
**పెనాల్టీ :** అన్ని రకాల పత్రాలతో దరఖాస్తు అందిన తేదీ నుంచి బ్యాంకు రేటుపై రెండు శాతం వడ్డీ జోడించి చెల్లించాలి.

**మెచ్యూరిటీ, సర్వైవల్ బెనిఫిట్**

**కంపెనీ విధి :** పాలసీదారులందరికీ పైన పేర్కొన్న చెల్లింపులు చేయవలసిన తేదీ కన్నా ముందుగానే ఏ రోజున సొమ్ము చెల్లిస్తారు తెలియచేయడంతో పాటు పోస్ట్ డేటెడ్ చెక్కు పంపించాలి. బ్యాంకు ఖాతా వివరాలున్నట్టయితే ఆ మొత్తాన్ని నిర్దేశిత తేదీ నాటికి ఖాతాలో జమ చేయాలి.
**పెనాల్టీ :** అన్ని రకాల పత్రాలు అందిన తేదీ నుంచి బ్యాంకు రేటుపై రెండు శాతం వడ్డీ జోడించి చెల్లించాలి.

**ఫ్రీలుక్ గడువు తర్వాత పాలసీ రద్దు, సరెండర్, ఉపసంహరణ**

**రిఫండ్ చెల్లింపు గడువు :** అవసరమైన పత్రాలు జత చేసిన అభ్యర్థన పత్రాలు అందుకున్న తేదీ నుంచి 15 రోజులు
**పెనాల్టీ :** అన్ని రకాల పత్రాలు లేదా అభ్యర్థన అందిన తేదీ నుంచి బ్యాంకు రేటుపై రెండు శాతం వడ్డీ జోడించి చెల్లించాలి.

### ఆరోగ్య బీమా

**క్లెయిమ్ సెటిల్మెంట్**

**గడువు :** సాధారణ కేసుల్లో సంబంధిత పత్రాలన్నీ అందిన సమయం నుంచి 30 రోజులు
**మరింత దర్యాప్తు :** ఏదైనా కేసులో మరింత దర్యాప్తు అవసరం అని భావిస్తే సంబంధిత పత్రాలన్నీ అందిన రోజు నుంచి 30 రోజుల లోపు పూర్తి చేయాలి. పత్రాలు అందిన తేదీ నుంచి 45 రోజుల లోపు క్లెయిమ్ సెటిల్ చేయాలి.
**పెనాల్టీ :** పత్రాలన్నీ అందిన తేదీకి, క్లెయిమ్ చెల్లింపు తేదీకి మధ్యన బ్యాంకు రేటుపై రెండు శాతం వడ్డీతో చెల్లించాలి.

### పన్నులు

**అడ్వాన్స్ టాక్స్ లేదా టీడీఎస్‌గా చెల్లించిన అదనపు మొత్తం రిఫండ్**

**గడువు :** జూలై 31 లోగా రిటర్న్‌లు దాఖలు చేసిన కేసుల్లో అసెస్‌మెంట్ సంవత్సరం ఏప్రిల్ ఒకటో తేదీ లోగా రిఫండ్ ఇవ్వాల్సి ఉంటుంది. జూలై 31 దాటి వచ్చిన రిటర్న్‌లకు ఏ తేదీన రిటర్న్ అందితే ఆ రోజు నుంచి ఈ గడువు ప్రారంభమవుతుంది.
**పెనాల్టీ :** చెల్లించవలసిన రిఫండ్ మొత్తంపై నెలకు 0.5 శాతం వడ్డీ చెల్లించాలి. చెల్లించిన పన్నులో రిఫండ్ చేయాల్సిన మొత్తం 10 శాతం కన్నా తక్కువ ఉంటే ఎలాంటి వడ్డీ చెల్లించనక్కరలేదు.

**అదనంగా చెల్లించిన సెల్ఫ్ అసెస్‌మెంట్ పన్ను రిఫండ్**

**గడువు :** పన్ను చెల్లించిన తేదీ లేదా రిటర్న్ దాఖలు చేసిన తేదీ నుంచి వడ్డీ చెల్లింపు వర్తిస్తుంది.
**పెనాల్టీ :** చెల్లించవలసిన రిఫండ్ మొత్తంపై నెలకి 0.5 శాతం వడ్డీ చెల్లించాలి. చెల్లించిన పన్నులో రిఫండ్ చేయాల్సిన మొత్తం 10 శాతం కన్నా తక్కువ ఉంటే ఎలాంటి వడ్డీ చెల్లించనక్కరలేదు.

### మ్యూచువల్ ఫండ్స్

**రిడెంప్షన్ సొమ్ము లేదా డివిడెండు చెల్లింపు**

**గడువు :** అభ్యర్థన అందిన తేదీ నుంచి 10 రోజులు లేదా డివిడెండు ప్రకటించిన రోజు నుంచి 30 రోజులు
**పెనాల్టీ :** జాప్యం జరిగినన్ని రోజులకు 15 శాతం వడ్డీ

### బ్యాంకింగ్

**ఖాతా డెబిట్, ఏటీఎంలో నగదు రాకపోవడం**

**గడువు :** 6 రోజులు (టీ+5=లావాదేవీ జరిగిన రోజుతో కలిపి)
**పెనాల్టీ :** టీ+5 రోజుల గడువు దాటితే రోజుకి రూ.100

**కార్డ్ ఖాతా డెబిట్, లబ్ధిదారుని ఖాతాలో నగదు జమకాకపోవడం**

**గడువు :** టీ+1
**పెనాల్టీ :** రోజుకు రూ.100

**పీఓఎస్ వద్ద ఖాతా డెబిట్, చార్జి స్లిప్ రాకపోవడం**

**గడువు :** టీ+5
**పెనాల్టీ :** రోజుకు రూ.100

**కార్డు ఖాతా డెబిట్, ఈ-కామర్స్ లావాదేవీ జరగకపోవడం**

**గడువు :** టీ+5
**పెనాల్టీ :** రోజుకు రూ.100

**ఐఎంపీఎస్ లావాదేవీలో ఖాతా డెబిట్, యూపీఐ బదిలీ విఫలం**

**గడువు :** టీ+1
**పెనాల్టీ :** రోజుకు రూ.100




# సకాలంలో రిటర్నులు ఫైల్ చేయకుంటే?


రాంబాబు గొండాల




జీఎస్‌టీలో రిజిస్ట్రేషన్ చేసుకున్న సాధారణ పన్ను చెల్లింపుదారులు నెలవారీ రిటర్న్ GSTR-3B దాఖలు చేయాలన్న విషయం తెలిసిందే. రిటర్నులు సకాలంలో దాఖలు చేయని పక్షంలో, రిటర్న్ దాఖలు చేయని కాలానికి గాను పన్ను మదింపు చేసే అధికారం అధికారులకు ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విధి విధానాలను రూపొందించింది.

రిటర్ను గడువు తేదీకి మూడు రోజుల ముందు, గడువు తేదీ కాగానే రిటర్న్ దాఖలు చేయని వ్యక్తులు అందరికీ సిస్టమ్ ద్వారా మెయిల్ లేదా మెసేజ్ పంపబడుతుంది. గడువు తేదీ ముగిసిన 5 రోజుల పిమ్మట సదరు వ్యక్తులకు ఒక నోటీసు పంపబడుతుంది. దీనినే GSTR-3A అంటారు. ఇది ఇచ్చిన 15 రోజుల లోపు సదరు వ్యక్తి సంబంధిత రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ 15 రోజుల లోపు రిటర్న్ దాఖలు చేయకుంటే సంబంధిత అధికారి తన దగ్గరున్న సమాచారం మేరకు చెల్లించవలసిన పన్ను మదింపును చేపట్టి ఒక ఆర్డర్ జారీ చేయటం జరుగుతుంది. దీన్ని ASMT-13 అంటారు.

ఇది జారీ చేసిన 30 రోజుల్లోపు సంబంధిత రిటర్న్ దాఖలు చేస్తే పర్వాలేదు. లేకుంటే రికవరీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. దీని ప్రకారం సంబంధిత వ్యక్తికి ఇతర వ్యక్తుల నుంచి రావాల్సిన మొత్తం ఏమైనా ఉన్నా అంటే ఇతని దగ్గర నుంచి సరుకు లేదా సేవలు పొందిన వ్యక్తులు ఏమైనా చెల్లింపులు జరపాల్సి ఉంటే, అలాగే రిటర్న్ దాఖలు చేయని వ్యక్తికి సంబంధించి ఏమైనా మొత్తం అతని బ్యాంకులో లేదా పోస్టాఫీస్‌లో ఉన్నా ఆర్డర్‌లో ఉన్న మొత్తాన్ని ఆయా వ్యక్తులు లేదా బ్యాంకుల నుంచి తీసుకునే హక్కు సదరు అధికారులకు ఉంది.

అలాగే కొన్ని సందర్భాల్లో ASMT-13 ఆర్డర్ ఇవ్వటానికి ముందే సంబంధిత వ్యక్తులకు సంబంధించిన ఆస్తులను, బ్యాంకు ఖాతాలను జప్తు చేసే అధికారం కమిషనర్‌కు ఉంటుంది. అదే విధంగా సదరు వ్యక్తుల రిజిస్ట్రేషన్ రద్దు చేసే అధికారం కూడా జీఎస్‌టీ అధికారులకు ఉంటుంది. కాబట్టి రిటర్న్ దాఖలు చేయటంలో ఎలాంటి అశ్రద్ధ వహించరాదు.

**గమనిక :** ఈ వ్యాసాల ద్వారా ఇస్తున్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. పాఠకులు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత చట్టాలు/నిబంధనలను కూలంకషంగా పరిశీలించాలి.

## జనవరి 1 నుంచి

# ఎండీఆర్ చార్జీలుండవ్



దేశంలో డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. రుపే డెబిట్ కార్డు, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) చార్జీలను ఎత్తివేయనున్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ నిర్ణయం అమలులోకి రానుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ త్వరలోనే ఈ నిర్ణయాన్ని నోటిఫై చేయనుందని ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతులతో సమావేశం అనంతరం ఆమె చెప్పారు. కొత్త నిబంధన ప్రకారం.. రూ.50 కోట్లు, అంతకు మించి వార్షిక టర్నోవర్ కలిగిన కంపెనీలు రుపే డెబిట్ కార్డు, యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు జరిపేందుకు ఏర్పాట్లు చేసుకోవడం తప్పనిసరి. రూ.50 కోట్లకు పైగా టర్నోవర్ కలిగిన వ్యాపారాలు రుపే, యూపీఐ, భీమ్, ఆధార్ పే, డెబిట్ కార్డులు, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ వంటి చౌక డిజిటల్ చెల్లింపుల వసతులు ఏర్పాటు చేయాలని, ఈ లావాదేవీలపై కస్టమర్ల నుంచి ఎండీఆర్ చార్జీలు వసూలు చేయవద్దని ఈ ఏడాది జూలైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సీతారామన్ ప్రతిపాదించారు.

### ఎండీఆర్ అంటే?

కస్టమర్ల నుంచి డిజిటల్ మార్గంలో చెల్లింపులను స్వీకరించినందుకు గాను వ్యాపారి బ్యాంక్‌కు చెల్లించే రుసుమునే ఎండీఆర్ అంటారు. లావాదేవీ సొమ్ములో అతి స్వల్ప శాతాన్ని బ్యాంక్ ఎండీఆర్ రూపంలో వసూలు చేస్తుంది. ఎండీఆర్ చార్జీల మినహాయింపుతో డిజిటల్ చెల్లింపుల రంగంలో విదేశీ పేమెంట్ గేట్‌వేలతో పోలిస్తే రుపే, యూపీఐల పోటీ సామర్థ్యం మెరుగుపడనుంది.

# ఆ డెబిట్ కార్డులు ఇక పనిచేయవ్!




మీరు ఎస్‌బీఐ, పీఎన్‌బీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులకు చెందిన మాగ్నెటిక్ స్ట్రిప్ డెబిట్ కార్డులు వాడుతున్నారా..? అయితే జాగ్రత్త. మీ కార్డులు ఈ నెల 31 తర్వాత పనిచేయకపోవచ్చు. భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) మార్గదర్శకాల ప్రకారం.. భారత్‌లో ఉన్న ప్రతి బ్యాంకు కూడా తమ మేగ్నటిక్ డెబిట్ కార్డులను ఈ నెలాఖరులోపు యూరోపే, మాస్టర్ కార్డ్, వీసా (ఈఎంవీ) చిప్ కార్డుగా మార్చాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈఎంవీ కాని కార్డులన్నీ 31వ తేదీ తర్వాత నిలిచిపోనున్నాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ, పీఎన్‌బీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులకు చెందిన వినియోగదారుల్లో మాగ్నెటిక్ డెబిట్ కార్డుదారులు ఎక్కువగా ఉన్నారు. ఇవి కాక ఇతర బ్యాంకుల్లో మాగ్నెటిక్ కార్డుదారులు కూడా నెలాఖరులోపుగా తమ కార్డును మార్చుకోవాల్సి ఉంటుంది.

### ఈఎంవీ అంటే..?

డెబిట్ కార్డు చెల్లింపుల్లో యూరోపే, మాస్టర్‌కార్డ్, వీసా (ఈఎంవీ)లకు సంబంధించిన సాంకేతికతను ప్రపంచవ్యాప్తంగా ప్రామాణికంగా పరిగణిస్తారు. ఈ చిప్ ఉన్న కార్డులకు మరింత భద్రత లభిస్తుంది. తొలినుంచీ వాడుతున్న మాగ్నెటిక్ స్ట్రిప్‌లతో పోలిస్తే ఇది చాలా సురక్షితం. ఈ నేపథ్యంలోనే భారత్‌లో కూడా ఈఎంవీ కార్డులను ఆర్‌బీఐ తప్పనిసరి చేసింది. వినియోగదారులు తమ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని ఇప్పటికే బ్యాంకులు మెయిల్, ఎస్ఎంఎస్‌ల రూపంలో పలుమార్లు సూచిస్తున్నాయి.

# టీపీఏ ఎంపిక మన చేతుల్లోనే..



ఆరోగ్య బీమా కంపెనీలు ప్రకటించే ఒకే థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్‌తో (టీపీఏ) పాలసీదారులు సర్దుకుపోయే కాలం మారింది. ఇప్పుడు తమకు అనుకూలమైన టీపీఏను ఎంచుకునే స్వేచ్ఛ పాలసీదారులకే దక్కింది. భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఇటీవల పాలసీదారులకే ఆ స్వేచ్ఛ అందించే ఐఆర్‌డీఏఐ (థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్స్-హెల్త్ సర్వీసెస్-సవరణ) నియంత్రణ, 2019ని అధికారికంగా ప్రకటించింది. పాలసీ విక్రయించే సమయంలోనే కొందరు టీపీఏల జాబితాను ఎంపిక నిమిత్తం అందచేయాలని ఆరోగ్యబీమా కంపెనీలను ఆదేశించింది. అయితే రెన్యువల్ సమయంలో మాత్రమే పాలసీదారులు టీపీఏలను మార్చుకునే అవకాశం కల్పించింది. అలాగే ఆరోగ్య బీమా పాలసీ స్వభావం, పాలసీదారులు నివశిస్తున్న భౌగోళిక ప్రదేశం ఆధారంగా టీపీఏల సంఖ్య పరిమితం చేసే అవకాశం కూడా ఆరోగ్య బీమా కంపెనీలకు ఇచ్చింది. ఐఆర్‌డీఏఐ ప్రకటించిన మార్పులిలా ఉన్నాయి.

- తన కోసం పని చేసేందుకు బీమా కంపెనీ నియమించుకున్న కొందరు టీపీఏల నుంచి ఎవరినైనా ఎంచుకునే స్వేచ్ఛ పాలసీదారులకే ఉంటుంది.
- పాలసీ కొనుగోలు చేస్తున్న సమయం లేదా రెన్యువల్ చేసుకుంటున్న సమయంలోనే టీపీఏను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.
- తాను అందుబాటులో ఉంచిన టీపీఏల్లో ఎవరినీ పాలసీదారుడు ఎంపిక చేసుకోకపోతే తనకు ఇష్టం వచ్చిన టీపీఏను కేటాయించే స్వేచ్ఛ బీమా కంపెనీకి ఉంటుంది.
- టీపీఏ సేవలు తనకు అవసరం లేదని, నేరుగా బీమా కంపెనీయే సేవలందించాలని కోరే హక్కు పాలసీదారునికి లేదు.
- పాలసీ అమలులో ఉన్న కారణంగానే ఆ టీపీఏ సేవలను బీమా కంపెనీ రద్దు చేసుకున్నట్టయితే కొత్త టీపీఏను ఎంపిక చేసుకునే అవకాశం పాలసీదారునికి ఇవ్వాలి.
- ఒకవేళ బీమా కంపెనీ ఒకే ఒక టీపీఏను నియమించుకుని ఉన్నట్టయితే ఆ సంస్థ సేవలు ఆమోదించడం తప్ప పాలసీదారునికి మరో మార్గం లేదు.

# బార్‌ట్రానిక్స్ దివాలా ప్రక్రియ షురూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన బార్‌ట్రానిక్స్ ఇండియాపై దివాలా ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా కంపెనీకి రుణాలు ఇచ్చిన బ్యాంకుల కమిటీ తొలిసారిగా సోమవారం సమావేశంకానుంది. కంపెనీ నుంచి రావాల్సిన రూ.39.96 కోట్ల రుణాలను వసూలు చేసుకోవడానికి ఎన్‌సీఎల్‌టీ, హైదరాబాద్‌లో ఇండియన్ బ్యాంకు కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రాసెస్‌కు పిటిషన్ దాఖలు చేసింది. దీనికి కంపెనీ కౌంటర్ పిటిషన్ వేసింది. రెండింటినీ పరిశీలించిన తర్వాత దివాలా ప్రక్రియకు ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలు జారీ చేసింది. దివాలా ప్రక్రియను చేపట్టడానికి మధ్యంతర ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ (ఐఆర్‌పీ)ను నియమించింది. దివాలా ప్రక్రియలో భాగంగా ఐఆర్‌పీ సీఓసీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.


**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 100 | విజయవాడ | 98 |
| వరంగల్ | 100 | గుంటూరు | 97 |
| మహబూబ్‌నగర్ | 100 | ఒంగోలు | 100 |
| కరీంనగర్ | 100 | చిత్తూరు | 90 |
| కర్నూలు | 100 | నెల్లూరు | 90 |
| విశాఖపట్నం | 100 | అనంతపురం | 93 |
| గోదావరి | 100 | | |



**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్100 గుడ్లు)**

| | | | |
|---|---|---|---|
| 28వ తేదీకి.. | | విజయవాడ | 466 |
| హైదరాబాద్ | 455 | విశాఖపట్నం | 475 |
| 29వ తేదీకి.. | | వరంగల్ | 458 |
| చిత్తూరు | 478 | డజను గుడ్లు రూ. | 69 |
| గోదావరి | 466 | | |



# కొత్త ఇంటిపై ఇన్వెస్ట్ చేస్తే లాభం

ఇల్లు లేదా భూమి విక్రయించబోతున్నారా? అలా విక్రయించగా వచ్చిన మొత్తాన్ని మళ్లీ స్థిరాస్తి కొనుగోలుపై ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలిక పెట్టుబడి లాభాల పన్ను నుంచి మినహాయింపు పొందొచ్చు. లేదంటే పన్ను రూపంలో భారీ మొత్తంలో చెల్లించవలసి ఉంటుంది.

## లేదంటే పన్ను వాయింపు



ప్రభుత్వం గత బడ్జెట్‌లో ప్రాపర్టీ రూపంలో ఇళ్లు కొనుగోలు చేసే వారికి పెద్ద ఊరట నిచ్చింది. రెండేళ్లపాటు తమ యాజమాన్యంలో ఉన్న ఇల్లు లేదా భూమి విక్రయించినట్టయితే ఆ మొత్తాన్ని తిరిగి కొత్త ఇల్లు లేదా భూమి కొనుగోలు కోసం ఇన్వెస్ట్ చేసినట్టయితే రూ.2 కోట్ల గరిష్ఠ పరిమితి వరకు దీర్ఘకాలిక పెట్టుబడి లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) నుంచి పూర్తి మినహాయింపు ఇచ్చింది. అయితే ఆ ఆస్తిపై మీకు చేకూరిన లాభం రెండు కోట్లు దాటితే మాత్రం దానిపై ఎల్‌టీసీజీ చెల్లించి తీరాల్సిందే. మీరు చెల్లించాల్సిన పన్ను ఆస్తి విక్రయం ద్వారా మీరు ఆర్జించిన లాభం ఎంత ఉంటే దానిపై 20 శాతం ఉంటుంది. ఉదాహరణకు రూ.50 లక్షల మేరకు ఆస్తిపై మీకు లాభం సమకూరిందంటే రూ.10 లక్షలు పన్నుగా చెల్లించాల్సిందే. ఆదాయపు పన్ను చట్టంలోని 54, 54ఎఫ్ సెక్షన్ల కింద ఈ మినహాయింపు పొందవచ్చు.

### ఎంత రీ ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది?

పాత ఇల్లు విక్రయించగా వచ్చిన సొమ్ము నుంచి పూర్తి లాభం పొందాలంటే ఎంత మొత్తం రీ ఇన్వెస్ట్ చేయాలనేది ఎవరికైనా సందిగ్ధమే. అలాగే ఆస్తిని విక్రయించడం ద్వారా వచ్చిన సొమ్ము మొత్తం ఇన్వెస్ట్ చేయాలా లేక దానిపై వచ్చిన లాభం మాత్రం ఇన్వెస్ట్ చేస్తే చాలునా అని చాలా మంది బంధుమిత్రుల సలహా అడుగుతూ ఉంటారు. ఐటీ చట్టం సెక్షన్ 54 ప్రకారం ఎవరి చేతిలో అయినా ప్రాపర్టీ రెండేళ్లకు పైబడి ఉన్నట్టయితే కొనుగోలు చేసిన రోజు నుంచి విక్రయించిన రోజు నాటికి ఎంత లాభం పొందితే ఆ మొత్తాన్ని మాత్రం రీ ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. రీ ఇన్వెస్ట్ చేసిన మొత్తం లేదా కొత్త ఆస్తి కొనుగోలు వ్యయం రెండింటిలో ఏది తక్కువ మొత్తం ఉంటే దానిపై పన్ను మినహాయింపు లభిస్తుంది. ఇది జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే వర్తించే ప్రయోజనం. పదే పదే ఇళ్లు అమ్మి, కొనుగోలు చేసి ప్రతి సందర్భంలోనూ ఎల్‌టీసీజీ మినహాయింపు పొందుతామంటే చెల్లదు. అందుకే ఈ ప్రయోజనం తీసుకోవాలా, వద్దా అనే విషయం జాగ్రత్తగా మదింపు చేసుకున్న తర్వాతనే నిర్ణయం తీసుకోవాలి. పెట్టుబడి లాభాల గరిష్ఠ పరిమితి రూ.2 లక్షలుగా ప్రకటించారు.

### కాలపరిమితి ఎంత?

ప్రాపర్టీ విక్రయించిన తేదీ నుంచి రెండేళ్ల లోగా మాత్రమే కొత్త ప్రాపర్టీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అప్పుడే 54 ఎఫ్ సెక్షన్ కింద పన్ను మినహాయింపు వర్తిస్తుంది. ప్రాపర్టీ విక్రయించడానికి ఒక ఏడాది ముందు ఏదైనా మరో ప్రాపర్టీ కొనుగోలు చేసి ఉంటే దానిపై కూడా పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. దాన్ని పెట్టుబడి లాభాల రీ ఇన్వెస్ట్‌మెంట్‌గా చూపించాల్సి ఉంటుంది. రెడీగా అందుబాటులో ఇల్లు కొనుగోలు చేయడానికి బదులు ఇల్లు కట్టుకుంటున్నా, నిర్మాణంలో ఉన్న ఇల్లు కొన్నా రీ ఇన్వెస్ట్‌మెంట్‌కు మరికొంత గడువు అదనంగా లభిస్తుంది. నిర్మాణం మూడు సంవత్సరాల లోగా పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ ఇంకో చిక్కుముడి కూడా ఉంది. పాత ప్రాపర్టీ విక్రయం లేదా బదిలీ తేదీ నాటికి ఆ ప్రాపర్టీ మినహా మీరు మరో ప్రాపర్టీ యజమాని అయి ఉండకూడదు. అలాగైతే ఎల్‌టీసీజీ పన్ను మినహాయింపు వర్తించదు.

### రెండు ప్రాపర్టీల కొనుగోలుకు అవకాశం

గతంలో ఎల్‌టీసీజీ సొమ్ముతో ఒక్క కొత్త ప్రాపర్టీ మాత్రమే కొనుగోలు చేసుకునే అవకాశం ఉండేది. కాని 2019 బడ్జెట్ ఆ సొమ్ముతో రెండు ప్రాపర్టీలు కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించింది. అలాగే అప్పటికే నిర్మాణం పూర్తయిన ఇల్లు నేరుగా కొనుగోలు చేసినా లేదంటే కొత్త ఇల్లు నిర్మించుకున్నా రెండింటికీ ఆ ప్రయోజనం అందుతుంది.

### రెండేళ్లలోగా అమ్మితే లాభం వెనక్కి...

కొత్తగా సమకూర్చుకున్న ప్రాపర్టీ కొనుగోలు తేదీ నుంచి రెండేళ్లలోగా తిరిగి అమ్మేసుకుంటే మాత్రం 54ఎఫ్ సెక్షన్ కింద పొందిన మినహాయింపు రద్దవుతుంది. అదే జరిగితే మినహాయింపు పొందిన పెట్టుబడి లాభాల పన్ను ఎంతైతే అంత మొత్తాన్ని ప్రభుత్వానికి పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది.

### గడువు తక్కువ ఉంటే ఏం చేయాలి?

పెట్టుబడి లాభాలతో కొత్త ప్రాపర్టీ కొనుగోలుకు గడువు తక్కువ ఉంటే ఏం చేయాలనేది మరో ప్రశ్న. ఉదాహరణకు మార్చిలో మీరు ఇల్లు అమ్ముతున్నారనుకుంటే జూలై చివరి లోగా ఐటీ రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది. అంటే అమ్మిన తేదీకి, కొత్త ప్రాపర్టీ కొనుగోలు డెడ్‌లైన్ ముగియడానికి 4 నెలలే గడువు ఉంటుంది. అప్పుడు పెట్టుబడి లాభంగా వచ్చిన సొమ్మును కేపిటల్ గెయిన్స్ అకౌంట్ స్కీమ్ కింద బ్యాంకులో ఖాతా తెరిచి అందులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అప్పుడే ఐటీ రిటర్న్‌లో ఎల్‌టీసీజీ పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు.

# 3 ఒక రాష్ట్రం.. రాజధానులు

విజయవాడ ● ఆదివారం 29 డిసెంబరు 2019




రాజధాని గ్రామాల రోడ్లపై కొనసాగుతున్న పోలీసుల బందోబస్తు

## సీఎం జగనా! విజయసాయా?



రాష్ట్రానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డా? లేక విజయసాయిరెడ్డా? దొంగ లెక్కలు రాసి జైలు పాలైన విజయసాయిరెడ్డి రాజధానిపై ప్రకటన చేయడమేమిటి? రాజ్యాంగేతర శక్తిగా, ఏ2 ముద్దాయిగా ఉన్న విజయసాయిరెడ్డి రాజధాని గురించి ఏ విధంగా ప్రకటన చేస్తారు? విశాఖపట్నంలో పులివెందుల పంచాయితీలు చేస్తున్న విజయసాయిరెడ్డిపై సీఎం జగన్ వివరణ ఇవ్వాలి. రాజధానిపై కేబినెట్‌లో సీఎం, మంత్రులకు చెప్పినదానిపై ప్రజలకు వివరణ ఇవ్వాలి. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీసుకునే తప్పుడు నిర్ణయాల్లో ఉన్నతాధికారులు ఎవరూ భాగస్వాములు కావద్దు. జగన్ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం సీబీఐ విచారణకు వెళుతుంది.

**- దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ మంత్రి**

## మూడు ముక్కలాట ముగిసేవరకు ఉద్యమం



ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి రాష్ట్రంలో మూడు ముక్కలాట ప్రారంభించిన జగన్ దాని నుంచి వెనక్కి తగ్గి అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించే వరకు ఉద్యమం ఆపేది లేదు. పరిపాలన చేతకాక, తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడమే మార్గంగా జగన్ నిర్ణయించుకొన్నారు. ప్రజలు అమరావతిని ఏకైక రాజధానిగా కోరుకొంటున్నారు.

**- నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి**

## అమరావతి ఆగితే భవిష్యత్తు అంధకారమే



రాష్ట్రంలోని 13 జిల్లాల అభివృద్ధికి అవసరమైన సంపదను సృష్టించి, యువత ఉపాధికి కేంద్ర బిందువుగా వున్న అమరావతి నిర్మాణాన్ని నిలిపివేస్తే రాష్ట్ర భవిష్యత్తు అంధకారమవుతుంది. సీఆర్‌డీఏ యాక్టును తీసుకువచ్చి, దానికి అనుబంధంగా అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను చట్టబద్ధంగా ఏర్పాటు చేశారు. రాజధాని నిర్మాణాలు, భూసమీకరణ, రైతులతో జరిగిన ఒప్పందాలన్నీ చట్టప్రకారమే జరిగాయి. ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా ఈ విధానాలను తప్పనిసరిగా అమలు చేయాల్సిందే.

**- కనకమేడల రవీంద్ర కుమార్, రాజ్యసభ సభ్యుడు**

## నిరాధార ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా

అమరావతిలో నేను ఇన్‌సైడర్ ట్రేడింగ్‌తో భూములు కొన్నట్టు నిరూపిస్తే సీబీఐతో సహా ఏ విచారణకైనా సిద్ధం. నాపై నిరాధార ఆరోపణలు చేస్తే పరువునష్టం దావా వేయాల్సి ఉంటుంది. రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువు ప్రాంతంలో భూమి అమ్మేసి అమరావతిలో రైతుల నుంచి ఓపెన్ మార్కెట్‌లో ఎక్కువ ధరకు భూమి కొనుగోలు చేశాను. జగన్మోహనరెడ్డికి సవాల్ విసురుతున్నాను. తాడేపల్లిలో నీవు కట్టుకున్న నివాసం ఇన్‌సైడర్ ట్రేడింగ్ అయితే నాది కూడా ఇన్‌సైడర్ ట్రేడింగే.

**- గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే**

## కోర్టు చివాట్లు పెట్టినా బుద్ధి రాదా?

రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై న్యాయస్థానాలు ఎన్నిమార్లు చివాట్లు పెట్టినా ప్రభుత్వంలోని పెద్దలకు బుద్ధి రావడంలేదు. ఇప్పటివరకు 27 విషయాల్లో న్యాయస్థానం ద్వారా ప్రభుత్వం చివాట్లు తిన్నా కనువిప్పు కలగడంలేదు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని, దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని భూములిచ్చిన రైతులు గత 11 రోజులుగా నిద్రాహారాలు మాని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం. మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా వాయిదా వేయడం రాజధానికి భూములిచ్చిన రైతులను అవమానపర్చడమే. దిశ చట్టం తీసుకువచ్చాం, మహిళల సమస్యలపై తక్షణమే స్పందిస్తాం, సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకరంగా పోస్టులు పెడితే తీవ్రమైన చర్యలు తీసుకుంటాం అని చెబుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి, తన సొంత పార్టీలోని ఎమ్మెల్యేలు మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు? నేను విజయవాడ మేయరుగా పనిచేసిన సమయంలో మల్లాది విష్ణు కార్పొరేటర్‌గా పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారు. ఆయన గురించి బీసెంట్ రోడ్డు, ఉడాలో అడిగితే కథలు కథలుగా చెబుతారు.

**- పంచుమర్తి అనురాధ, అధికార ప్రతినిధి, టీడీపీ**

## ఉద్యోగులూ రాజధానిపై స్పందించరా!

అమరావతి రాజధాని తరలింపు ఒక్క రైతుల సమస్య కాదు. దీనిపై ఉద్యోగులు స్పందించరా? నేడు విశాఖకు వెళ్లమంటారు. రేపు కర్నూలుకు వెళ్లమంటారు. ఉద్యోగులూ వెళతారా? గత ప్రభుత్వంలో హైదరాబాదు నుంచి అమరావతికి ఉద్యోగులు వచ్చినప్పుడు వారికి అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రత్యేక రైలు వేశారు. మరీ ఇప్పుడు విశాఖపట్నం వెళ్లమంటే ఎలా వెళతారు. ప్రభుత్వం మారితే రంగులు, కార్డులు, కార్లు మారిస్తే ఫరవాలేదు. కాని రాజధానిని మారిస్తే సహించేది లేదు.

**- నన్నపనేని రాజకుమారి, మాజీ చైర్‌పర్సన్, మహిళా కమిషన్**

## పెయిడ్ ఆర్టిస్టులతో మానవహారం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖ పర్యటనలో వైసీపీ నేతలు పెయిడ్ ఆర్టిస్టులతో మానవహారాలు నిర్వహించారు. విశాఖను రాజధానిగా ప్రకటించినందుకు ప్రజలు మానవహారం నిర్వహించారని చెప్పడం సిగ్గుచేటు. సీఎం జగన్ విశాఖ పర్యటనకు వచ్చిన వారు.. వైసీపీ నేతలు డబ్బులిచ్చి లారీలు, బస్సుల్లో తీసుకువచ్చిన వారే. స్వచ్ఛందంగా వచ్చిన వారెవరూలేరు. విద్యార్థులను, ప్రజలను బలవంతంగా వైసీపీ నాయకులు తరలించి కనీస సౌకర్యాలు వారికి కల్పించలేదు. సీఎం పర్యటనలో ప్రజల కన్నా పోలీసులు, వైసీపీ నాయకులు, పోలీసులే ఎక్కువ మంది ఉన్నారు. జగన్ విశాఖను ఏం ఉద్ధరించారని విశాఖ ప్రజలు సంబరాలు, మానవహారాలు నిర్వహిస్తారో చెప్పాలి.

**- నాదెండ్ల బ్రహ్మం చౌదరి, రాష్ట్ర అధ్యక్షుడు, టీఎన్ఎస్ఎఫ్**

## మండలిలో బ్రేక్ వేస్తాం

ఏదైనా బిల్లుపై శాసనసభ, మండలి సమావేశాలు ఉమ్మడిగా పెట్టి ఓటింగ్ కోరిన దాఖలాలు చరిత్రలో లేవు. వైసీపీకి శాసనమండలిలో బలం లేదు. కాబట్టి అసెంబ్లీ, మండలిని ఉమ్మడిగా సమావేశపరిచి రాజధాని తరలింపుపై ఆమోద ముద్ర వేయాలని చూస్తోంది. అది ఎట్టి పరిస్థితుల్లో జరగనివ్వబోం. విశాఖలో భూ దందాలు చేయటానికి మూడు రాజధానుల ప్రకటన చేశారు. జీఎన్ రావు కమిటీ రిపోర్టు ఒక పనికిమాలిన రిపోర్టు. రాబోయే రోజుల్లో జగన్ పరిస్థితి ఏమిటో ప్రజలే నిర్ణయిస్తారు.

**- బచ్చుల అర్జునుడు, ఎమ్మెల్సీ**

## ఆరు నెలల క్రితమే కుట్ర

అమరావతిని కించపరుస్తూ వైజాగ్‌కు రాజధానిని తీసుకెళ్లాలని ఒక పథకం ప్రకారం వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ వచ్చారు. రాజధాని తరలింపు ఈ రోజు మొదలైన కుట్ర కాదు. ఆరు నెలల క్రితమే ప్రారంభమైంది.

**- బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే**

## పిచ్చి తుగ్లక్‌ని ప్రజలు అణచి వేస్తారు

రాజధాని రైతులు 11 రోజులుగా చేస్తున్న ఆందోళన రాజధాని కడుపు కోత పోరాటం. మూడు రాజధానుల ఆలోచన పిచ్చి తుగ్లక్‌కే వస్తుంది. ఈ పిచ్చి తుగ్లక్‌ని ప్రజలు అణచి వేస్తారు. రైతుల కన్నీటి ఆవేదనలో కొట్టుకుపోతారు.

**- శ్రవణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే**


## సీఎం భయపడే డమ్మీ కాన్వాయ్

రాజధానిని కాపాడుకొనేందుకు 29 గ్రామాల రైతులు రోడ్కెక్కి ఉద్యమిస్తున్నారు. మీతో కలిసి పోరాటం చేయడానికి టీడీపీ సిద్ధంగా ఉంది. సీఎం డమ్మీ కాన్వాయ్‌లో తిరుగుతున్నారంటే రైతుల శక్తి ఏమిటో స్పష్టమవుతోంది.

**- దేవినేని చంద్రశేఖర్, తెలుగు యువత నేత**



తుళ్లూరులో ఆందోళన చేస్తున్న మహిళలు



మందడంలో ఎండలో అట్టలను అడ్డుగా పెట్టుకొని ఆందోళన చేస్తున్న మహిళలు, రైతులు



# తేలేదాకా పోరే

(మొదటి పేజీ తరువాయి)

వరుసగా పదకొండో రోజు వెల్లగక్కారు. రాజధానిపై స్పష్టత వచ్చేదాకా సమరమేనని తేల్చిచెప్పారు. అనిశ్చితి తొలగి..అమరావతి కొనసాగింపునకే ప్రభుత్వం ముందుకొచ్చేదాకా తమది పోరుబాటేనని రాజధాని గ్రామాలు తెగేసి చెప్పాయి. అప్పటివరకు తమకు కొత్త సంవత్సరాలు, సంక్రాంతి పండగలేవీ లేవని, ఉన్నదల్లా రోడ్లపై ఎగసే నిరసనలేనని స్పష్టం చేశాయి. రాజధానిపై కమిటీలను ఎన్నయినా ప్రభుత్వం వేసుకోవచ్చుగానీ నిర్ణయం మాత్రం నిర్ద్వంద్వంగా పూర్తిస్థాయి రాజధాని దిశగానే ఉండాలని పదకొండు రోజులుగా నడుస్తున్న మహాధర్నా శిబిరాలు నినదించాయి. మందడం, తుళ్లూరుల్లో శనివారం మహిళలు, రైతులు మోకాళ్లపై నిల్చొని ఇదే డిమాండ్‌ను వినిపించారు. మందడంలో రైతులు రాజధానిపై సీఎం మనస్సు మరాలంటూ పోలేరమ్మ, మాలచ్చమ్మ చెట్టు, ఇతర గ్రామ దేవతలకు పొంగళ్లు పెట్టారు. రాజధానిని అమరావతిలోనే కొనసాగించేలా చూడాలంటూ మొక్కారు. పోలీసుల డేగకళ్ల నిఘా మధ్యనే రైతులు పెద్దఎత్తున నిరసనల్లో పాల్గొన్నారు. తుళ్లూరులో మహిళలు రోడ్డుపైనే వంటావార్పు నిర్వహించారు. వెలగపూడిలో రైతుల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. రాజధానిని తరలిస్తే ఉరే శరణ్యం అంటూ రైతులు మెడకు ఉరి వేసుకున్నట్లుగా నిలబడ్డారు. సీఎం నోటి నుంచి రాజధాని ప్రకటన వచ్చే వరకు ఎన్ని రోజులైనా దీక్షలు కొనసాగిస్తామని రైతులు తెలిపారు. వీరి ఆందోళనలకు మాజీమంత్రులు నక్కా ఆనందబాబు, దేవినేని ఉమా, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు బచ్చుల అర్జునుడు, నన్నపనేని రాజకుమారి, తుళ్లూరులో జరుగుతున్న ఆందోళనలకు మాజీమంత్రులు నక్కా ఆనందబాబు, దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, బోడే ప్రసాద్, కృష్ణా జిల్లా టీడీపీ యువత అధ్యక్షుడు దేవినేని చంద్రశేఖర్, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు బచ్చుల అర్జునుడు, నన్నపనేని రాజకుమారి, శ్రావణ్‌కుమార్, పశ్చిమ గోదావరి జిల్లా మాజీ ఎంపీ మాగంటి బాబు తనయుడు రాంజీ, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ చాకిరేవు సంఘం నేత కొండపల్లి రవి, ఎన్ఆర్ఐ రాఘవేంద్రప్రసాద్, బీజేపీ నేతలు శ్రీనివాసరాజు తదితరులు మద్దతు తెలిపారు. తాడికొండ అడ్డరోడ్డు సమీపంలో శనివారం రాస్తారోకోను నిర్వహించారు. ఈ మండలంలోని పొన్నెకల్లు, నిడుముక్కల, మోతడక, తాడికొండ, లాం, రావెల, దామరపల్లి, ఫణిదరం తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతులు, మహిళలు పాల్గొన్నారు. నవరత్నాలు అవసరం లేదు.. రాజధాని ఇక్కడే ఉంచాలని మహిళలు నినాదాలు చేశారు. తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో బొడ్డురాయి సెంటర్‌లో ప్రధాన రహదారిపై గ్రామస్తులు, రైతులు, కూలీలు, మహిళలు బైఠాయించి నిరసన తెలిపారు. అప్పట్లో రాజధానికి విరాళాలు ఇచ్చిన సంగంజాగర్లమూడికి చెందిన మహిళలు దీక్షా శిబిరాలకు వచ్చి తమ సంఘీభావం తెలిపారు.

### స్పష్టత వచ్చేదాకా సమరమే..

రాజధానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ నిర్ణయించింది. కేబినెట్ భేటీలో ఏ నిర్ణయం తీసుకోకుండా ఇంకా సందిగ్ధాన్నే కొనసాగిస్తున్న నేపథ్యంలో జేఏసీ కన్వీనర్ ఎ.శివారెడ్డి, సభ్యులు గద్దె తిరుపతిరావు, ఆర్వీ స్వామి తదితరులు విజయవాడలో రౌండ్ టేబుల్ నిర్వహించారు. ఆది,సోమవారాలు విజయవాడ ధర్నాచౌక్‌లో నిరవధిక రిలే నిరాహార దీక్షలు, మంగళవారం విజయవాడ సివిల్ కోర్టుల వద్ద నుంచి అమరావతిలోని హైకోర్టు వరకు న్యాయవాదులతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని జిల్లాల్లోనూ ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ)లను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ముఖ్య నాయకులతో రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహించాలని కూడా నిర్ణయించారు. రాజకీయ పార్టీల నాయకులను సంప్రదించి, వీలైనంత త్వరగా అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళతామని జేఏసీ కన్వీనర్ శివారెడ్డి తెలిపారు. జేఏసీతో కలిసి ఉద్యమంలో పాల్గొంటున్న సుమారు 36 సంఘాల ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## కడపవాసిగా చెబుతున్నా

# రాష్ట్ర రాజధాని అమరావతిలోనే ఉండాలి

- జీఎన్ రావుది చెల్లని, దొంగ కమిటీ: రమేశ్‌నాయుడు
- తుళ్లూరు రైతులకు బీజేపీ యువమోర్చా సంఘీభావం
- తెనాలిలో అఖిలపక్ష రౌంట్ టేబుల్

రాజధాని రైతులకు మద్దతుగా తుళ్లూరు మహాధర్నా శిబిరాన్ని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు - రమేశ్ నాయుడు శనివారం సందర్శించారు. సీఎం జగన్ మూడు రాజధానుల ఆలోచనను ఈ సందర్భంగా రమేశ్ నాయుడు తీవ్రంగా గర్హించారు. "కడప వాసిగా చెబుతున్నా..జగన్ ఆంధ్రప్రదేశ్ ప్రజల సెంటిమెంట్ మీద దెబ్బ కొట్టారు. ఇది రాష్ట్రానికి అరిష్టం. రాష్ట్రం నడిబొడ్డున భవ్యమైన రాజధాని నగరం నిర్మాణం జరగాలని పెద్దలంతా ఆలోచన చేశారు. ఆ రోజున జగన్, వైసీపీ నాయకులు ఎవ్వరూ అభ్యంతరం చెప్పలేదు. నేడు మాట తప్పారు. నేను కడప జిల్లా వాసిని అయినప్పటికీ అమరావతి రాజధాని ఇక్కడే ఉండాలని చెబుతున్నా. అమరావతిపై రాయలసీమలో కూడా ఎవరికీ కోపం లేదు. కూర్చున్న చెట్టునే నరకాలని జగన్ చూస్తున్నారు. ఎన్నికల్లో ఆయనకు తెలంగాణలోని కార్పొరేట్ సంస్థలు సహకరించాయి. దాని వెనక ప్రధాన ఉద్దేశ్యం అమరావతిని చంపేసి హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ రంగాన్ని పెంచడమే"నని రమేశ్‌నాయుడు ధ్వజమెత్తారు. రాజధానిపై నివేదిక ఇచ్చిన జీఎన్ రావు కమిటీ చెల్లని కమిటీలని, అది దొంగల కమిటీ అని రమేశ్‌నాయుడు వ్యాఖ్యానించారు. "సామాజిక మాధ్యమాలలో వచ్చిన స్టేట్‌మెంటుల కలయికే జీఎన్ రావు నివేదిక. దొంగ పీహెచ్‌డీలు పొందే వారిలా జీఎన్ రావు కమిటీ వ్యవహరించింది. ఇలాంటి దొంగ నివేదికలు, కమిటీలను బీజేపీ ఆమోదించబోదు. కేంద్రం దృష్టికి రాజధాని అంశం ఇప్పటికే చేరింది. అమరావతి ఎక్కడకు వెళ్లదు. విశాఖ, కర్నూలు ప్రజలు రాజధాని, హైకోర్టు పెడతామంటే అంత ఆసక్తిగా లేరు. రాజధాని అమరావతి రైతులకే మద్దతు పలుకుతున్నారు" రమేశ్ నాయుడు స్పష్టం చేశారు. అమరావతికి అన్ని జిల్లా మద్దతు ఉన్నదని, చట్టంలో ఎక్కడా మూడు రాజధానులు అన్న పదమే లేదని బీజేపీ లీగల్ సెల్ నేత జూపూడి రంగరాజు తేల్చిచెప్పారు. కాగా, రాజధాని అమరావతి ప్రాంతంలో ఆదివారం బీజేపీ రాజ్యసభ సభ్యుడు సుజనాచౌదరి పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తుళ్లూరు నుంచి ఈ పర్యటన ప్రారంభమవుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, ముఖ్యనేతలు పర్యటించి రైతులకు సంఘీభావం తెలపనున్నారు. ఇప్పటికే కన్నా మౌనదీక్ష చేసి రైతులకు బాసటగా నిలిచారు. కాగా, పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా అమరావతి కోసం కలిసి నడుద్దామని నాయకులు నినదించారు. తెనాలిలో జరిగిన అఖిల పక్ష కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశంలో వైసీపీయేతర రాజకీయ పార్టీలన్నీ పాల్గొని.. పూర్తిస్థాయి రాజధానిపై ముక్తకంఠం వినిపించారు. రాజధాని అమరావతి కోసం రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించారు. జనసేన, టీడీపీ, కాంగ్రెస్, సీపీఎం, సీ పీ ఐ, బీసీ సంక్షేమ సంఘం, రైతుప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలుగు రచయితల సభల్లో 'రాజధాని' నిరసన

**అమరావతిని కాపాడాలని ప్లకార్డుల ప్రదర్శన**

రాజధాని రైతుల సెగ తెలుగు రచయితల మహాసభలను తాకింది. రాజధాని గ్రామాల రైతులు విజయవాడ పీబీ సిద్ధార్థలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభల వద్ద చేరుకొని ప్లకార్డులు ప్రదర్శించారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వెంట వారు సభ జరుగుతున్న హాలులోకి వచ్చారు. అమరావతిని కాపాడండి.. సేవ్ అమరావతి.. అంటూ కొంతసేపు నిరసన తెలిపి, వెనుదిరిగారు.




## భయపెట్టని తరలింపు కావాలి

- శాంతి కాముకులైన విశాఖవాసుల అభిమతమిది
- రాజధాని మార్పు రెండు పార్టీలు, 2 కుటుంబాల మధ్య క్రీడలా మారింది: బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్



అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): "తమను భయపెట్టని రీతిలో విశాఖకు త రలింపు ఉండాలని స్థానిక ప్రజలు కోరుకొంటున్నారు. విశాఖ ప్రజలు సహజంగా శాంతి కాముకులు. రాజధాని తరలింపు తమ జీవనానికి సమస్య కాకూడదని అక్కడి సామాన్యులు కోరుకొంటున్నారు. ఇళ్ల అద్దెలు విపరీతంగా పెరిగిపోవడం, ట్రాఫిక్ జంఝాటం, బయటి ప్రాంతాల వారు వచ్చి సమస్యలు సృష్టించడం, కబ్జాల గొడవలు వంటివి రాజధాని పేరుతో జరగకూడదని భావిస్తున్నారు" అని విశాఖకు చెందిన బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ వ్యాఖ్యానించారు. విజయవాడలో జ రుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభకు వచ్చిన ఆయన పాత్రికేయులతో ముచ్చటించారు. రాజధాని పేరుతో విజయవాడలో ఇళ్ల అద్దెలు విపరీతంగా పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ పరిస్థితి అక్కడ కూడా వస్తుందేమోనన్నది సాధారణ ప్రజల భయమన్నారు. రాజధానిని అమరావతిలోనే ఉంచి హెచ్‌ఓడీ కార్యాలయాలను వివిధ ప్రాంతాలకు తరలించాలన్నది తన అభిప్రాయమని చెప్పారు. ఐటి, పరిశ్రమలు, సముద్ర తీర అంశాలు చూసే శాఖల ప్రధాన కార్యాలయాలు విశాఖలో, నదీ వ్యవహారాల శాఖల కార్యాలయాలు రాజమండ్రిలో, గనుల వ్యవహారాలు వంటివి రాయలసీమలో, వ్యవసాయం, దాని అనుబంధ పరిశ్రమలు శాఖల కార్యాలయాలు సంబంధిత ప్రాంతాల్లో ఉండటం సముచితమన్నారు. అసెంబ్లీ సమావేశాలు కూడా ఒకో సీజన్‌లో ఒకోచోట పెట్టడం సరికాదని వివరించారు. రాజధాని మార్పుపై అక్కడి రైతుల ఆందోళనలో న్యాయం ఉందని, భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం జరగరాదని అన్నారు. రాజధాని మార్పు వ్యవహారం రెండు పార్టీలు, వాటిలోని రెండు కుటుంబాల మధ్య క్రీడలా మారిందని మాధవ్ విమర్శించారు. గతంలో తెలుగుదేశం, ఇప్పుడు వైసీపీ కూడా రాజధాని ఏర్పాటుపై విస్తృత చర్చ జరపకుండానే నిర్ణయాలు తీసేసుకొన్నాయన్నారు. ఆ పార్టీల నాయకత్వాల అభిప్రాయాలే తుది నిర్ణయాలుగా జరిగిపోయాయన్నారు. దీనివల్లే అప్పుడు అమరావతిలో, ఇప్పుడు విశాఖలో భూములు భారీగా ముందుగానే కొనుక్కొన్నారన్న ఆరోపణలు వస్తున్నాయని వివరించారు. ప్రజాస్వామిక వాతావరణంలో చర్చలు జరిపి అందరికీ ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకొంటే ఇటువంటి ఆరోపణలకు ఆస్కారం ఉండదని మాధవ్ పేర్కొన్నారు.

## విజయసాయిరెడ్డి అల్లుడి భూముల కోసమే

**రోహిత్ రెడ్డి స్నేహితుడిదే 'బోస్టన్'**

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపుకు ఉన్న విశ్వసనీయత, అనుభవం ఏపాటిదో స్పష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి వుంది. సదరు సంస్థ కంపెనీస్ అడ్వయిజింగ్ ఏజెన్సీ మాత్రమే. ఆ సంస్థకు రాజధానులు, వాటి తరలింపు, మార్పు గురించి ఏ విధమైన అనుభవం లేదు. బోస్టన్ గ్రూపుతో జగన్ ఎప్పుడు ఒప్పందం చేసుకున్నారు, దానికి సంబంధించిన జీవో ఏమిటి, ఆ గ్రూపునకు ఎంత సొమ్ము ఇవ్వబోతున్నారు, అసలు ఆ గ్రూపు గురించి సీఎంకు ఎలా తెలుసో ప్రజలకు చెప్పాలి. 2017లో పోర్చుగీసు పోలీసులు బోస్టన్ గ్రూపుపై దాడులు చేశారు. ఎఫ్‌బీఐ నిఘా ఈ గ్రూపుపై ఉంది. ఈ సంస్థ వంద మిలియన్ పౌండ్ల స్కామ్‌కు పాల్పడినట్టు ఆధారాలు వున్నాయి. ఇలాంటి గ్రూపునకు 5 కోట్ల ప్రజల భవిష్యత్తును అప్పగించడం వెనుక ఆంతర్యమేమిటో చెప్పాలి. బోస్టన్ గ్రూపు డైరెక్టర్ భట్టాచార్య, విజయసాయిరెడ్డి అల్లుడైన రోహిత్‌రెడ్డికి మంచి మిత్రుడు. రోహిత్‌రెడ్డి అరబిందో ఫార్మా కంపెనీ యజమాని. ఈ ఫార్మా కంపెనీకి విశాఖ-విజయనగరం మధ్యన వేలాది ఎకరాలు వున్నాయని, ఆ భూముల్లోనే ఏపీ రాజధాని వుండేలా బోస్టన్ గ్రూపు నివేదిక ఇవ్వబోతుంది. తమ భూములను అభివృద్ధి చేసుకోవాలన్న దురుద్దేశంతోనే విజయసాయిరెడ్డి బోస్టన్ గ్రూపును తెరమీదకు తీసుకువచ్చారు.

**- వర్ల రామయ్య, పొలిట్ బ్యూరో సభ్యుడు, టీడీపీ**

## అనంతలో అసెంబ్లీ పెట్టాలి: ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి, డిసెంబరు 28: రాష్ట్రంలో మూడు రాజధానులు ఏర్పాటు చేయడంలో భాగంగా అనంతపురం జిల్లాలో అసెంబ్లీని ఏర్పాటు చేయాలని కదిరి ఎమ్మెల్యే (వైసీపీ) పీవీ సిద్దారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కదిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతిలో లక్ష కోట్లు పెట్టి రాజధాని అభివృద్ధి చేసే కంటే 3 రాజధానులు ఏర్పాటు చేస్తే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతపురంలో అసెంబ్లీ ఏర్పాటు చేసి, శీతాకాల సమావేశాలు నిర్వహిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. దీంతో పాటు వివిధ శాఖాధిపతుల కార్యాలయాలు కూడా ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేయాలన్నారు.

## తిరగబడ్డ జగన్ 'ట్యాగ్': తులసిరెడ్డి



కడప(కలెక్టరేట్), డిసెంబరు 28: మాట తప్పను, మడమ తిప్పను అంటూ ప్రజల్లోకి వచ్చిన జగన్ అధికారంలోకి రాగానే రాజధానులను మార్చుకుంటూ తన ట్యాగ్‌ను పల్టీ కొట్టించారని పీసీసీ ఉపాధ్యక్షుడు ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ 134వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల అనంతరం శనివారం మీడియాతో మాట్లాడారు. జగన్ పరిపాలన అంతా తుగ్లక్ పాలనకు మించి ఉందన్నారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ సాక్షిగా రాజధాని అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎవరడిగారని విశాఖకు రాజధాని తరలిస్తామని జగన్ ప్రకటన చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అమరావతి రాజధానికే కట్టుబడి ఉందన్నారు. రాజ్యసభ సభ్యుడు సుబ్బరామిరెడ్డి వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్నారు. రాయలసీమలో హైకోర్టు కావాలని మొదట డిమాండ్ చేసింది కాంగ్రెస్ పార్టీ అని, దానిని స్వాగతిస్తున్నామన్నారు. మాజీ మంత్రి మైసూరారెడ్డి ప్రత్యేక రాయలసీమ కావాలని డిమాండ్ చేయడం సరైందేనన్నారు.

## జర్నలిస్టులపై వ్యక్తిగత ద్వేషం లేదు

**రాజధాని ప్రాంత రైతుల వివరణ**


అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మీడియా ప్రతినిధులకు తాము వ్యతిరేకం కాదని, ఎవరిపైనా తమకు వ్యక్తిగత ద్వేషం లేదని రాజధాని ప్రాంత రైతులు తెలిపారు. శుక్రవారం ఒక మహిళా జర్నలిస్టు రైతుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆమెపై దాడి జరిగిందన్న వార్తా కథనాలపై వారు వివరణ ఇచ్చారు. అమరావతిలో పెయిడ్ ఆర్టిస్టులతో ఆందోళన నిర్వహిస్తున్నారంటూ ఒక టీవీ చానల్‌లో చర్చలు, వ్యాఖ్యలు వచ్చాయని, దానికి తాము నిరసన వ్యక్తం చేశామన్నారు. అవి రిపోర్టర్ వ్యాఖ్యలు కాదు.. చానల్‌లో ప్రసారమైన చర్చలకు, చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగానే నిరసన తెలిపినట్లు రైతులు వివరించారు.

### కేసు నమోదు..

ఈ దాడి వ్యవహారంలో రైతులపై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. మీడియా ప్రతినిధులు, పోలీసులపై దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్నవారిని గుర్తించడానికి ఐదు పోలీసు బృందాలను నియమించారు.

# ఏ విచారణకైనా సిద్ధం

- ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలపై విజయసాయిరెడ్డి
- అమరావతి ఆందోళనకు బాబు ఫండింగ్
- విశాఖకు రాజధాని రాకుండా కుట్ర: మంత్రి ముత్తంశెట్టి



విశాఖపట్నం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో కార్యనిర్వాహక రాజధాని వస్తుందనే ఉద్దేశంతో ముందుగానే వైసీపీ నాయకులు ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేశారని టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై ఏ విచారణకైనా సిద్ధమేనని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. విశాఖ ఉత్సవ్‌లో భాగంగా సిటీ సెంట్రల్ పార్కులో ఏర్పాటు చేసిన పుష్ప ప్రదర్శనను ఆయన మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి శనివారం ప్రారంభించారు. అంతకుముందు వారిద్దరూ సింహాచలం అప్పన్నను దర్శించుకున్నారు. ఆ రెండు ప్రాంతాల్లోనూ వారిరువురూ విలేకరులతో మాట్లాడారు. తమపై సీబీఐ లేదా ఎఫ్‌బీఐ దేనితోనైనా విచారణ చేయించుకోవచ్చునని సవాల్ చేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తన కుటుంబం, తన మనుషులు మాత్రమే బాగుండాలని కోరుకుంటారని, కుటిల మనస్తత్వం కలిగిన మనిషి అని విమర్శించారు. విశాఖలో ఏర్పాటు చేయబోయే కార్యనిర్వాహక రాజధానిని న్యాయపరంగా అడ్డుకోవాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అయినా సరే విశాఖకు అనుకూలంగా సీఎం నిర్ణయం తీసుకుంటారని, రాజధాని వస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. రాజ్యాంగానికి లోబడి అన్ని చర్యలూ పూర్తి చేసుకొన్న తరువాత సీఎం స్పష్టమైన ప్రకటన చేస్తారని విజయసాయిరెడ్డి తెలిపారు. విశాఖపట్నంలో రాజధాని రాకుండా అడ్డుకోవడానికి చంద్రబాబు కుట్ర చేస్తున్నారని, ప్రజలను రెచ్చగొడుతున్నారని మంత్రి ముత్తంశెట్టి ఆరోపించారు. చంద్రబాబు కుల, మత, ప్రాంతీయ విభేదాలతో ప్రజలను విడదీస్తున్నారని విమర్శించారు. అమరావతిలో ఆందోళనకు చంద్రబాబు ఫండింగ్ చేస్తున్నారని, ఆయన నైజమే అంత అంటూ విమర్శలు గుప్పించారు. చంద్రబాబు అండ్ కో అమరావతిలో చేసిన ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై ఉపకమిటీ తాజాగా నివేదిక సమర్పించిందన్నారు. అందులో అన్ని విషయాలు ఉన్నాయని, వాటిపై ప్రభుత్వం కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి అన్నారు.

## అధికారం మీది... విచారణ చేయించాల్సిందీ మీరే

విజయసాయిరెడ్డి గారూ! టీడీపీ ఐదేళ్ల హయాంలో అమరావతి ప్రాంతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు 1170 ఎకరాలు. మీరు 4075 ఎకరాలు ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిపోయిందంటున్నారు. దీనిపై ఎటువంటి విచారణకైనా సిద్ధమని మా అధినేత సవాల్ చేశారు. అధికారంలో ఉన్నది మీరు. విచారణ చేసుకోవాల్సింది మీరే. అమరావతి ప్రాంతంలో జరుగుతున్న ఉద్యమాలన్నీ టీడీపీ ఫండింగ్‌తో జరుగుతున్నాయనీ, వారంతా పెయిడ్ ఆర్టిస్టులు అని విజయసాయిరెడ్డి పదేపదే అవమానిస్తున్నా సిగ్గులేని కృష్ణా, గుంటూరు వైసీపీ నేతలు నోరుమూసుకొని కూర్చున్నారు. ఈ ప్రాంత ప్రయోజనాలు కాపాడలేని, రైతులను, ప్రజలను అవమానపరుస్తున్నా నోరువిప్పలేని వైసీపీ నేతలు వెంటనే రాజీనామా చెయ్యాలి.

- బుద్దా వెంకన్న, ఎమ్మెల్సీ

## మూడు రాజధానుల నిర్ణయం సరైనదే

- జనవరి 20న అసెంబ్లీలో నిర్ణయం: ఎంపీ రఘురామకృష్ణంరాజు

నరసాపురం, డిసెంబరు 28: "రాష్ట్రానికి మూడు రాజధానుల ఏర్పాటుపై సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం సరైనదే. జనవరి 20న అసెంబ్లీలో చర్చించిన తరువాతే రాజధానులపై నిర్ణయం వెలువడవచ్చు" అని ఎంపీ రఘురామకృష్ణంరాజు అన్నారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం కొప్పర్రు గ్రామంలో ఆయన మాట్లాడారు. అధికార వికేంద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ రెండు అంశాలన్నారు. వీటిపై ప్రతిపక్షాలు చేస్తున్న... 'అధికార వికేంద్రీకరణ వద్దు, అభివృద్ధి వికేంద్రీకరణ కావాలి' అన్న వాదన నూటికి నూరుపాళ్లు సమంజసమైనదన్నారు. అయితే సీఎం ఆలోచించే ఈ నిర్ణయం తీసుకొన్నారని వివరించారు. గ్రోత్ ఇంజన్‌లా ఈ విభజన ఉపయోగపడుతుందని తెలిపారు. అయితే అమరావతి రైతుల, ప్రజల ఆశలు వమ్ము చేయకుండా బ్యాలెన్స్ చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. ఆ శక్తి, సామర్థ్యాలు ఆయనకు ఉన్నాయని ఎంపీ అన్నారు.

# విశాఖలో రాజధానికి.. 3 వేల ఎకరాలు?

- సచివాలయం, సీఎం క్యాంపు ఆఫీసు హెచ్‌వోడీ కార్యాలయాలు
- అధికారులకు నివాస గృహాలు
- ఐదు మండలాల్లో భూములు కేటాయింపు
- సీఎంవో సహా కొన్ని విభాగాలకు రుషికొండ ఐటీ సెజ్‌లో తాత్కాలిక వసతి
- మరికొన్నిటికి నగరం, మధురవాడల్లో
- రాజధాని ఏర్పాటుపై కసరత్తు ముమ్మరం
- పై నుంచి జిల్లా యంత్రాంగానికి సంకేతాలు

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)



రాజధాని మార్పుపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు సాగుతున్నా.. విశాఖపట్నంలో కార్యనిర్వాహక రాజధాని ఏర్పాటుకు ఉన్నత స్థాయిలో ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. అధికారికంగా ఆదేశాలు రాకపోయినా అందుకు అనుగుణంగా సన్నద్ధం కావాలని జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వ పెద్దల నుంచి సంకేతాలు అందినట్లు తెలిసింది. విశాఖపట్నం పాలనా రాజధాని కావచ్చని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అసెంబ్లీలో ప్రకటించారు. అనంతరం జీఎన్ రావు కమిటీ విశాఖపట్నంలో సీఎం క్యాంపు కార్యాలయం, సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో పాలనా రాజధానికి ప్రాథమికంగా 3 వేల ఎకరాలు సరిపోతాయని జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పలు కార్యక్రమాల నిమిత్తం జిల్లా అధికారులు ప్రభుత్వ భూముల వివరాలు సేకరించారు. ఇటీవల బిల్డ్ ఏపీ కోసం నగరంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములు, స్థలాలు, భవనాలను గుర్తించారు. వీటిలో అవసరమైన వాటిని రాజధానికి వినియోగించుకోవాలని భావిస్తున్నారు. ఒకేచోట కాకుండా పలుచోట్ల ఉన్న ప్రభుత్వ భూములను రాజధాని అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంది. పాలనా రాజధాని అంటే సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, మంత్రులు, ఉన్నతాధికారులు, సిబ్బంది నివాసాలు, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వస్తాయి. ముఖ్యమంత్రి కార్యాలయం ఒకచోట నిర్మిస్తారు. మిగిలినవి వేర్వేరు చోట్ల ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

### సచివాలయం, హెచ్‌వోడీలు ఒకేసారి..

హైదరాబాద్ నుంచి అమరావతికి రాజధానిని తరలించేప్పుడు తొలుత విభాగాధిపతులు విజయవాడ వచ్చారు. అనంతరం తాత్కాలిక వసతి సిద్ధం కావడంతో సచివాలయం కూడా తరలివచ్చింది. అయితే విశాఖలో సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు ఒకేసారి ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఇందుకు మూడు వేల ఎకరాలు సరిపోతాయని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. నగరంలోని ముడసర్లోవ ప్రాంతంతోపాటు విశాఖ రూరల్, భీమునిపట్నం, ఆనందపురం, సబ్బవరం, పెందుర్తి మండలాల్లోని భూములను రాజధానికి కేటాయించనున్నట్టు చెబుతున్నారు. శాశ్వత భవనాలు నిర్మించే వరకు తాత్కాలికంగా అందరికీ నగరంలో వసతి కల్పిస్తారు. ఇందుకోసం భవనాల అన్వేషణ కూడా మొదలైంది. ఈ కార్యక్రమాన్ని అధికారులు గుట్టుచప్పుడు కాకుండా చేపట్టారని తెలిసింది. సీఎం క్యాంపు కార్యాలయం, సచివాలయం, విభాగాధితుల్లో కొందరు కార్యాలయాల కోసం రుషికొండ ఐటీ సెజ్‌లోని భవనాలను పరిశీలిస్తున్నారు. మరికొన్ని విభాగాలు, ఉన్నతాధికారులకు నగరం, మధురవాడ పరిసరాల్లో కొత్తగా నిర్మించిన అపార్టుమెంట్లు చూస్తున్నారు. బిల్డర్లను సంప్రదిస్తున్నారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చిన తర్వాతే భవనాల సమీకరణకు ముందుకెళ్లాలని జిల్లా అధికారులు భావిస్తున్నారు. కాగా.. ఉన్నతాధికారులకు విజయవాడలో నెలకు 40 వేలు ఇంటి అద్దె అలవెన్స్ ఇస్తున్నారు. బహుశా అదే మొత్తం లేదా మరికొంత పెంచి ఇవ్వవచ్చనే చర్చ అధికారుల్లో సాగుతోంది.

### అనకాపల్లి నుంచి భోగాపురం వరకు మెట్రో

విశాఖ నగరంలో రహదారులు, ఇతరత్రా సౌకర్యాలు ఉన్నందున కొత్తగా భవనాలు నిర్మిస్తే సరిపోతుందనే భావన ఉన్నత స్థాయిలో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టును అనకాపల్లి నుంచి భోగాపురం వరకు నిర్మించాలనే ఆలోచన కూడా తాజాగా తెరపైకి వచ్చింది. భవిష్యత్‌లో నగరంలో ట్రాఫిక్ రద్దీని తట్టుకునేందుకు మెట్రో దోహదపడుతుందనేది అంచనా.

### అధికారికంగా ఆదేశాలు రాలేదు

పాలనా రాజధానికి సంబంధించి అధికారికంగా ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వస్తే జిల్లా యంత్రాంగం అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుంది. అయితే నగర పరిసరాల్లో ఇతరత్రా అవసరాలకు భూములు గుర్తించాం. ప్రభుత్వం ఎలా ఆదేశిస్తే ఆ విధంగా వాటిని వినియోగిస్తాం.

- వి.వినయ్‌చంద్, విశాఖ కలెక్టర్

# ఆరోపణలు తప్ప చర్యలేవీ?

- ఇది బ్లాక్‌మెయిల్ చేయడమే
- సిట్‌పై నమ్మకం లేదు... సిటింగ్ జడ్జితో విచారణ చేయించాలి
- వికేంద్రీకరణతో ప్రాంతాల అభివృద్ధి భ్రమే
- రాజధాని అమరావతి మార్పుకు సీపీఐ ససేమిరా: నారాయణ

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): "అమరావతిలో అవినీతి జరిగిందని ఆరునెలల నుంచి ప్రభుత్వం అంటోంది. అవినీతి జరిగితే యాక్షన్ తీసుకోవచ్చు. దీనికి ప్రత్యేకంగా మంత్రివర్గ కమిటీలు అవసరం లేదు. ఎమ్మార్వో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే ఎవరెవరు, ఎప్పుడెప్పుడు భూములు కొన్నారో చరిత్ర మొత్తం వచ్చేస్తుంది. అసైన్డ్ ల్యాండ్స్ ఎవరు తీసుకున్నారు? ప్రభుత్వ భూములు ఎవరు స్వాధీనం చేస్తున్నారో ఇట్టే తెలిసిపోతుంది. దీని ఆధారంగా చర్యలు తీసుకోవచ్చు. ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా బ్లాక్‌మెయిల్ చేస్తోంది" అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. శనివారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ప్రభుత్వం అనుకుంటే చట్ట విరుద్ధంగా భూములు కొనుగోలు చేసిన వారిపై రేపటిలోగా క్రిమినల్ కేసులు పెట్టి జైలులో పెట్టొచ్చన్నారు. ఇలా చేస్తే సీఎం జగన్‌కు పాలాభిషేకం చేస్తానని చెప్పారు. ప్రభుత్వం ఊరికే బుసకొట్టడం తప్ప కార్యాచరణ లేదని ఆరోపించారు. ఆరు నెలలుగా ప్రభుత్వం అవే ఆరోపణలు చేస్తోందని ఎద్దేవాచేశారు. విశాఖ భూ కుంభకోణాలపై తాము ఇచ్చిన రికార్డులను పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే భూ దొంగల్ని పట్టుకోవాలని డిమాండ్ చేశారు. సిట్‌పై నమ్మకం లేదని, హైకోర్టు జడ్జిని నియమించి విచారణ చేస్తే వేల కోట్లు విలువైన భూములు బయటపడతాయన్నారు. రాజధాని తరలింపును సీపీఐ ఆమోదించే పరిస్థితి లేదన్నారు. తాము ఇప్పటికే ఆందోళనలో పాలుపంచుకొంటున్నామని స్పష్టంచేశారు. 30న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దానిలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. అమరావతిని క్యాపిటల్‌గా కొనసాగించేందుకు అందర్నీ కలుపుకుని పెద్దఎత్తున ఆందోళనలు చేయడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. రాజధానిగా అమరావతి ఉండాలన్నది ప్రజల కోరికని, శాసనసభలో అప్పటి ప్రతిపక్ష నాయకుడు జగన్ కూడా అంగీకరించారని గుర్తుచేశారు. ఇష్టానుసారంగా రాజధానులను మార్చే నైతికహక్కు జగన్‌కు లేదన్నారు. అధికార వికేంద్రీకరణతో ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయనేది భ్రమ మాత్రమే అన్నారు. పాలన సజావుగా సాగుతున్న రాష్ట్రంలో రాయలసీమ, ఉత్తరాంధ్ర అంటూ ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొట్టే పద్ధతికి స్వయంగా సీఎం పూనుకున్నారని విమర్శించారు.

## ఏపీలో పరిస్థితులు తెలంగాణకు కలిసొస్తాయి

- రియల్ వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి
- తెలంగాణ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కలిసివస్తాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ రాష్ట్ర మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. క్రెడాయ్ తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన క్రియేట్ అవార్డు-2019 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రస్తుతం తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఎంతో మెరుగ్గా ఉందన్నారు. ఐటీ ఉద్యోగులతోపాటు బ్యూరోక్రాట్లు, వ్యాపార వేత్తలు ఇక్కడ స్థిరనివాసం ఏర్పాటు చేసుకునేందుకు ఎంతో ఆసక్తిగా ఉన్నారని చెప్పారు. చెన్నైలో మంచినీటి సమస్య, బెంగళూరులో ట్రాఫిక్, ఢిల్లీలో కాలుష్యం, ముంబైలో అధిక ధరలు ఉంటే హైదరాబాద్‌లో ఎలాంటి సమస్యలూ లేవన్నారు. తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలోని పెద్ద బిల్డర్లు సామాజిక బాధ్యతగా పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. క్రెడాయ్ ఆధ్వర్యంలో క్రియేట్ అవార్డులు-2019 కార్యక్రమాన్ని ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తున్నారని, ఈ బాధ్యతలను క్రిసిల్ సంస్థకు అప్పగించడమే దీనికి నిదర్శనమన్నారు. బిల్డర్లు ఈ అవార్డును ఆస్కార్‌తో పోల్చుకుంటున్నారని, తాను మాత్రం దీన్ని నోబెల్ అవార్డుగా భావిస్తానని మంత్రి పేర్కొన్నారు.

## అరకొరగానే సచివాలయాల పాలన

- పూర్తిగా సమకూరని మౌలిక వసతులు
- కంప్యూటర్లు, ఇంటర్నెట్, కుర్చీల కొరత
- జీతాలందక సిబ్బంది అయోమయం

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టి దాదాపు 3 నెలలవుతున్నా... తగిన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించకపోవడంతో అవి పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నాయి. జనవరి నెల నుంచి పూర్తిస్థాయిలో సచివాలయాల ద్వారా 500 రకాల సేవలందించాలని ప్రభుత్వం హడావుడి చేసినా ఇంకా అరకొర వసతులతోనే సచివాలయాలున్నాయి. భవనాలు లేక సామాజిక భవనాలు, పాఠశాల గదులు, అద్దె భవనాలకు రంగులు వేసి సచివాలయ భవనాలుగా మార్చారు. ప్రతి సచివాలయానికీ రెండు కంప్యూటర్లు, ఒక ప్రింటర్, స్కానర్, ల్యామినేషన్ మిషన్ సరఫరా కావాల్సి ఉన్నా... ఇంకా గ్రామాలకు చేరకపోవడంతో సచివాలయ ఉద్యోగులు అద్దె ప్రాతిపదికన వీటిని తెచ్చుకుంటున్నారు. సచివాలయాలకు అద్దె కుర్చీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న బల్లలను తాత్కాలికంగా అరువు తెచ్చుకుంటున్నారు. ఎలాగైనా జనవరి 1 నుంచి సేవలు ప్రారంభించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తుండటంతో స్థానికంగా అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ట్రయర్ రన్ కింద గురువారం అధికారులు అన్ని జిల్లాల్లో సచివాలయాల సేవలు ప్రారంభిస్తే... అంతా మొక్కుబడిగా అయిందనిపించారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో నెట్‌వర్క్ అందని పరిస్థితి నెలకొందని చెప్తున్నారు. కొందరు ఉద్యోగులు తమ వద్ద ఉన్న ల్యాప్‌ట్యాప్‌లతో కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకూ మీ-సేవ ద్వారా పలు సేవలను ప్రజలు పొందుతున్నారు. అవి మూతపడడంతో ప్రజలు సచివాలయాలకు పోటెత్తుతున్నారు.

### జీతాల ఖాతాలపై ఆందోళన

అదనపు మార్కులు కలిపి కొత్తగా చేపట్టిన నియామకాలు తప్పులతడకలుగా మారాయి. అర్హులైన అభ్యర్థులకు బదులుగా కొన్ని చోట్ల అనర్హులకు కూడా పోస్టులు దక్కాయని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే పలు కేసులు హైకోర్టులో దాఖలు కావడంతో ఈ నియామక ప్రక్రియ ఇంకా ఒక కొలిక్కి రాలేదంటున్నారు. మరోవైపు, జీతాలు ఇచ్చేందుకు సీఎఫ్‌ఎంఎస్ ఖాతాలు ప్రారంభించకపోవడంతో సిబ్బందిలో అయోమయం నెలకొంది. ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల కోసం ప్రత్యేక శాఖను తీసుకొస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. దీంతో కొత్తగా వచ్చిన ఆ శాఖకు సంబంధించిన అధికారులు చూసుకుంటారని పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు సచివాలయ సిబ్బందిని పట్టించుకోవడం మానేశారు. 010 ఖాతాల ద్వారా జీతాలు చెల్లిస్తామనే ఉత్తర్వులును అమలు చేయాలని సచివాలయాల ఉద్యోగులు కోరుతున్నారు. తమను ఉద్యోగంలోకి తీసుకున్న రోజు కాకుండా శిక్షణ పూర్తయ్యాక వార్డులో జాయిన్ అయిన తేదీని పరిగణనలోకి తీసుకోవడం వల్ల తాము 55 రోజుల సర్వీసు కోల్పోతున్నామని, దీనిని సవరించాలనీ కోరుతున్నారు.

# బీపీఎస్‌లో అక్రమాలు ఆగేనా!?

- అర్జీదారులకు చుక్కలు చూపిస్తున్న అధికారులు
- పట్టణ స్థానిక సంస్థలు, 'ఉడా'లన్నింట్లో ఇదే తంతు!
- దరఖాస్తులకు గడువు ముగిసి 4 నెలలు
- పరిష్కారమైనవి 30 శాతానికి లోపే!
- ప్రక్రియ పూర్తికి ఇంకా రెండు నెలలే..

(ఆంధ్రజ్యోతి, అమరావతి)

నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాల క్రమబద్ధీకరణకు బీపీఎస్ 2019 పథకం అవకాశం కల్పిస్తే.. సంబంధిత యంత్రాంగం అర్జీల పరిష్కారంలో తాత్సారం చూపుతోంది. దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియలో నత్తకు నడకలు నేర్పుతున్న చందంగా వ్యవహరిస్తోంది. ఈ పథకం కింద దరఖాస్తుల గడువు ఈ ఏడాది ఆగస్టు 31తో ముగిసింది. అనంతరం 6 నెలల్లోగా అంటే.. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖర్లోపు దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాల్సి ఉంది. అయితే గడిచిన 4 నెలల్లో పరిష్కారమైన దరఖాస్తుల సంఖ్య 30 శాతానికి లోపే కావడం గమనార్హం! ఇటీవల మంత్రి బొత్స సత్యనారాయణ సమీక్షలో ఈ విషయం వెల్లడైంది. దీంతో ఇటీవల ఒకేసారి 391 మంది పట్టణ ప్రణాళికోద్యోగులపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించారు! అయితే 30 శాతం దరఖాస్తులకే 4 నెలలు తీసుకున్న అధికారులు.. మిగిలిన సుమారు 70 శాతం అర్జీలను కేవలం 2 నెలల్లోనే పరిష్కరిస్తారని ఆశించడం అత్యాశే అవుతుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

భవన క్రమబద్ధీకరణ పథకాన్ని పట్టణ ప్రణాళికోద్యోగులు, అధికారుల్లో కొందరు తమ జేబులు నింపే కామధేనువుగా చేసుకుంటున్నారు. ఇందులోభాగంగా.. దరఖాస్తులకు కొర్రీలు వేసి పెండింగ్‌లో ఉంచుతున్నారు. పరిష్కారం కోరుతూ దరఖాస్తుదారులు వస్తే వారి నుంచి మామూళ్లు గుంజుతున్నారు. ఎవరైతే సొమ్ములిస్తారో వారివి పరిష్కరించడం రివాజుగా చేసుకున్నారు. అక్రమాల కట్టడికి బీపీఎస్ 2019ను ఆన్‌లైన్‌లో చేపడుతున్నప్పటికీ దానికీ తూట్లు పొడుస్తున్నారు. ఇందుకు సాంకేతికపరమైన, అనివార్యమైన కారణాల కంటే.. సంబంధిత అధికారులు, ఉద్యోగుల మితిమీరిన అలసత్వం, లాలూచీ వ్యవహారాలే కారణమనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ పరిస్థితిని డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌తోపాటు పురపాలకశాఖ ఉన్నతాధికారులు చక్కదిద్దేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో చర్యలకు ఉపక్రమించారు. ఏపీసీఆర్డీయే కూడా దీనికి అతీతం కాదన్న ఆరోపణలు వస్తున్నాయి.

### అతిక్రమణలు.. అభియోగాలు!

బీపీఎస్-2019 దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియ ఆన్‌లైన్ సిస్టం ద్వారా జరిగిపోవాలి. తర్వాత 10 రోజుల గడువులోగా క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, పూర్తిస్థాయి అనుమతుల కోసం సిఫారసు చేయాలి.అయితే రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల్లోని పట్టణ ప్రణాళికా విభాగాధికారులు, ఉద్యోగుల్లో పలువురు ఈ కాలపరిమితిని పాటించనందున అక్రమ కట్టడాలకు ఆస్కారమేర్పడుతోంది. అధికారులు సకాలంలో సిఫారసులు చేయకపోవడంతో 1600 భవనాలకు లభించిన ప్రాథమిక అనుమతులే.. 'డీమ్డ్ టు బి అప్రూవ్డ్ (పూర్తిస్థాయి అనుమతులు)'గా మారిపోయాయి. దీంతో ఇందుకు కారకులైన 312 మందికి షోకాజ్ నోటీసులిచ్చారు. 36 మంది అధికారులు బదిలీ అయిన తర్వాత కూడా 334 నిర్మాణాలకు అనుమతులను మంజూరు చేయడంతో వారికి షోకాజ్ నోటీసులిచ్చారు. వీరు కాకుండా.. లోపభరితమైన 63 ఫైళ్లకు బాధ్యులుగా గుర్తించి, 43 మందిపై అభియోగాలను నమోదు చేశారు. అయితే అక్రమార్జనకు అలవాటు పడిన అధికారులు, ఉద్యోగులు అంత తేలిగ్గా తమ పంథాను మార్చుకోరని, అందువల్ల నిరంతర సమీక్షలు, తక్షణ చర్యలు అవశ్యమన్న సూచనలు పలు వర్గాల నుంచి వస్తున్నాయి.

### ఇకపై ఏంచేయాలంటే!

- మంత్రి ఆదేశాలతో అధికారులు కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దీని ప్రకారం.. బీపీఎస్-2019 సక్రమంగా అమలుకు ఆర్‌డీడీటీపీ, ఆర్‌డీఎంఏలతో ప్రాంతీయ కమిటీలు ఏర్పాటు చేయాలి. ఈ పథకం కింద అందిన అన్ని దరఖాస్తులనూ క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి.
- బీపీఎస్ పథకం నిబంధనల ప్రకారం ముందు అందిన దరఖాస్తులు ముందుగా పరిష్కారం (ఫస్ట్ ఇన్, ఫస్ట్ అవుట్) కావాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా జరిగితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.
- కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా కొన్ని దరఖాస్తులను తిరస్కరించారంటూ ఆరోపణలు రావడంతో.. తిరస్కరణకు గురైన వాటిలో 5 శాతాన్ని పునఃపరిశీలించాలని ఆదేశాలిచ్చారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యుల పేర్లను చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు పంపాల్సి ఉంటుంది.

## కాలేజీ ఒకటే.. ఫీజులే వేరు!

(మొదటి పేజీ తరువాయి)

కాలేజీలు ట్యూషన్ ఫీజులను వాస్తవిక ఆదాయ, వ్యయాలను ప్రాతిపదికగా తీసుకుని ప్రతిపాదించాలన్నారు. కానీ, కాలేజీలు 20% ఫీజు పెంచాలని కోరుతున్నాయని చెప్పారు. ఫీజులను తగ్గించుకోవాలని కాలేజీలకు సూచించారు. చాలా కాలేజీలు హాస్టల్, ట్రాన్స్‌పోర్ట్, సెమినార్, పబ్లిసిటీలపై పెట్టిన ఖర్చులను కూడా చూపుతున్నాయని.. కానీ, విద్య కోసం పెట్టిన ఖర్చులను బట్టే కాలేజీల ఫీజులను నిర్ణయిస్తామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు చెప్పారు.

### వారు ఏ మీడియంలో చదువుతున్నారు?

మెజారిటీ ప్రజల అభీష్టం, అభిలాష, ఆకాంక్ష మేరకే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుందని జస్టిస్ వి.ఈశ్వరయ్య చెప్పారు. కేవలం సంపన్న వర్గాలకు చెందిన వారే దీన్ని వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. చాలామంది పేదలు తమ పిల్లలను ఇంగ్లీషు మీడియంలో చదివించలేకపోతున్నారని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో తగినంత మంది టీచర్లు లేరని, ఇకపై టీచర్లను పెంచి చిన్నారులకు ఇంగ్లీషు విద్యను ప్రభుత్వం అందిస్తుందన్నారు.

### తెలుగు కంటే ఇంగ్లీషే ఈజీ

బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకుని అభివృద్ధి చెందకూడదనేలా కొందరి వైఖరి ఉండడం దారుణమని జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. ఇంగ్లీషు మీడియంలో చదివితే వెనకబడిన తరగతుల వారు అభివృద్ధి చెందుతారని చెప్పారు. ప్రభుత్వ విధాన నిర్ణయంపై కోర్టులు కూడా అభ్యంతరం చెప్పరాదని సూచించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంగ్లీషు విద్య అత్యవసరమన్నారు. అసలు తెలుగు భాష కంటే ఆంగ్లం నేర్చుకోవడం సులువైన ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు.


## జైట్లీ బహుముఖ ప్రజ్ఞాశాలి: వెంకయ్య

జైట్లీపై వ్యాసాల సంకలనం ఆవిష్కరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశ హితాన్ని ప్రథమ కర్తవ్యంగా భావించి అదే సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తి అరుణ్ జైట్లీ అని, ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కొనియాడారు. శనివారం కేంద్ర మాజీ మంత్రి జైట్లీ జయంతి సందర్భంగా.. ఆయనపై తన కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్ తీసుకొచ్చిన వ్యాసాల సంకలనం 'ద రినైజెన్స్ మ్యాన్: ద మెనీ ఫాసెట్స్ ఆఫ్ అరుణ్ జైట్లీ' పుస్తకాన్ని వెంకయ్య ఢిల్లీలో ఆవిష్కరించారు. 'జైట్లీ ప్రతి విషయంలోనూ నిక్కచ్చి, ముక్కుసూటి. క్లిష్ట సమయాల్లోనూ సహనం కోల్పోకుండా సంయమనంతో మంచి నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనకు ఆయనే సాటి. జైట్లీ సలహాల కోసం అందరం ఎదురుచూసేవాళ్లం' అని వెంకయ్య కొనియాడారు. కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, విదేశాంగ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి మురళీధరన్ పాల్గొన్నారు.

# ఏపీ నిట్‌లో పరిశోధన కేంద్రాలు

- సెంటర్స్ ఫర్ ఎక్స్‌లెన్సీలో ఏర్పాటుకు సన్నాహాలు
- కేంద్ర మానవ వనరుల శాఖకు ప్రతిపాదనలు
- ఒక్కో కేంద్రానికి 25కోట్ల చొప్పున విడుదలకు చాన్స్
- వచ్చే ఏడాది నుంచి 10 సబ్జెక్టుల్లో ఎంటెక్ కోర్సులు




తాడేపల్లిగూడెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో నవశకం ప్రారంభం కానుంది. ఇప్పటి వరకూ బోధన, అధ్యయనాలకే పరిమితమైన నిట్‌లో పరిశోధన కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. సెంటర్స్ ఫర్ ఎక్స్‌లెన్సీలో వీటి ఏర్పాటుకు కేంద్ర మానవ వనరుల శాఖ సుముఖత వ్యక్తం చేసింది. దీంతో ఐదు పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు నిట్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఒక్కో కేంద్రానికి రూ.25కోట్ల మేర నిధులు విడుదల కానున్నాయి. డేటా వేర్‌హౌసింగ్, నానో టెక్నాలజీస్, త్రీడీ ప్రింటింగ్, హైవోల్టేజ్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ రంగాల్లో పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ పరిశోధన కేంద్రం లోనే కెమికల్, బయోటెక్నాలజీ సహా అన్ని బ్రాంచ్‌లకు సంబంధించి పరిశోధనలు నిర్వహించే కేంద్రాన్ని నిర్మించనున్నారు. ఇందుకు కేంద్ర అనుమతి కావాలి.

### ఏపీనిట్‌కు ప్రత్యేక స్థానం

ఏపీనిట్‌కు ప్రత్యేక స్థానం ఉంది. తొలి ఏడాదిలోనే 486సీట్లతో ప్రారంభమై నాలుగేళ్లలోనే సొంత క్యాంపస్ సిద్ధం చేసుకుంది. తొలిబ్యాచ్ విద్యార్థుల్లో 70శాతం మంది క్యాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలు పొందారు. మొత్తం 220మంది ఉద్యోగాలతో బయటకు వెళ్లారు. రెండోబ్యాచ్ ఇప్పుడు బీటెక్ నాలుగో సంవత్సరానికి చేరింది. ప్రభుత్వ రంగ సంస్థ బ్రహ్మోస్ సహ లెక్కకు మిక్కిలి పరిశ్రమలు అప్పుడే క్యూ కడుతున్నాయి. మొదటి సెమిస్టర్‌లోనే 83మంది క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపికయ్యారు. గరిష్ఠంగా రూ.14లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు లభించాయి.

### ఫేజ్-1సీకి సిద్ధం

176 ఎకరాల్లో ఏపీనిట్ శాశ్వత క్యాంపస్ సిద్ధమైంది. ఫేజ్-1ఏలో హాస్టల్, అకడమిక్ భవనాలు పూర్తవడంతో విద్యార్థులందరినీ తాత్కాలిక క్యాంపస్ నుంచి సొంతగూటికి తరలించారు. ఫేజ్-1బీలో రూ.196కోట్లతో కేంద్రీయ గ్రంథాలయం, అకడమిక్ భవన నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఫేజ్-1సీలో రూ.256కోట్లు కేటాయించేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతారు. వీటిలో మరో 6లక్షల చ.అ. నిర్మాణాలు చేపడితే ఏపీనిట్‌కు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చవచ్చని డైరెక్టర్ తెలిపారు. వచ్చే ఏడాది నుంచి 10 సబ్జెక్టుల్లో ఎంటెక్ కోర్సులు రానున్నాయి.



## ప్రపంచంలోనే అతి చిన్న ల్యాపీ

బీజింగ్, డిసెంబరు 28: ఈ చిత్రంలో.. అరచేతిలో ఇమిడిపోయేలా కనిపిస్తున్న ల్యాపీ ప్రపంచంలోనే అతి చిన్న ల్యాప్‌టాప్‌గా గుర్తింపు పొందింది. చైనాకు చెందిన 'మేజిక్ బెన్' అనే సంస్థ దీన్ని తయారు చేసింది. 20.7 సెం.మీ పొడవు, 14.6 సెం.మీ వెడల్పు, 1.8 సెం.మీ మందం ఉండే ఈ ల్యాప్‌టాప్ ధర రూ. 56,427. 16జీబీ ర్యామ్, 512జీబీ హార్డ్‌డిస్క్, ఇంటెల్ కోర్ ఎం3-8100వై ప్రాసెసర్‌తో అత్యంత వేగంగా పని చేసే ఈ ల్యాప్‌టాప్‌లో అన్నిరకాల పోర్టులున్నాయి.



## గోల్డ్ అనుకుంటే ఉల్క అయింది

మెల్‌బోర్న్, డిసెంబరు 28: కొంచెం ఎర్రగా, అక్కడక్కడ పసుపు పచ్చ మచ్చలతో ఉన్న ఈ రాయిని ఆస్ట్రేలియలో డేవిడ్ హోల్ అనే ఆస్ట్రేలియా వ్యక్తి రోడ్డుపై చూశాడు. మిగతా రాళ్ల కంటే భిన్నంగా, బరువుగా ఉండటంతో బంగారం అనుకొని ఐదేళ్ల క్రితం ఇంటికి తెచ్చాడు. ఎంత ప్రయత్నించినా అది పగల్లేదు. ఆ రాయిని తీసుకొని మెల్‌బోర్న్ మ్యూజియానికి వెళ్లాడు. అది మామూలు రాయి కాదని.. బంగారం కంటే విలువైన ఉల్క అని పరిశోధకులు చెప్పారు. అది భూమిపై ఎప్పుడు పడిందో శాస్త్రవేత్తలు పరిశోధిస్తున్నారు.



## పెళ్లిళ్ల సైట్ల పట్ల తస్మాత్ జాగ్రత్త

న్యూఢిల్లీ, డిసెంబరు28: పెళ్లి సంబంధాల వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని కేంద్ర హోం శాఖ హెచ్చరించింది. ఆ శాఖ సైబర్ సేఫ్టీ విభాగం ట్విటర్ హ్యాండిల్ 'సైబర్ దోస్త్' ద్వారా పలు సూచనలు చేసింది. "పెళ్లిళ్ల సైట్లు వేదికగా మోసగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారు. మ్యాట్రిమోని సైట్లలో రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక ఈ-మెయిల్ వాడాలి. ఫొటో, ఫోన్ నంబర్ వంటి వ్యక్తిగత వివరాలు సైట్లలో పెట్టొద్దు. ఆయా సైట్ల ద్వారా వ్యక్తులను కలిసే ముందు బంధుమిత్రులు వెంట ఉండేలా జాగ్రత్త పడండి. పెళ్లిళ్ల సైట్ల రేటింగ్, రివ్యూలు చూడండి" అని సూచించింది.

## గడ్డకట్టిన ఉత్తర భారతం!

**ఉత్తరాదిలో అత్యంత కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు**

**కశ్మీర్‌లో -12 డిగ్రీలు.. గడ్డకట్టిన నీరు**



చలికి మథురలో ఓ ఏనుగుకు ఇలా రగ్గులు తొడిగారు

న్యూఢిల్లీ, డిసెంబరు 28: ఉత్తర భారతం గడ్డకట్టుకుపోతోంది. శుక్ర, శనివారాల్లో అనేక రాష్ట్రాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పంజాబ్, ఢిల్లీ, హరియాణా, చండీగఢ్, యూపీ, ఉత్తర రాజస్థాన్‌లో ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. వచ్చే 2, 3 రోజుల్లో ఉష్ణోగ్రతలు ఇంకా తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం ఢిల్లీలో ఈ సీజన్‌లోనే అత్యంత కనిష్ఠంగా 2.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. 1901 నుంచి చూస్తే ఈ డిసెంబరు రెండో అత్యంత చల్లని నెలగా రికార్డు సృష్టించింది. భారీ హిమపాతం, దట్టమైన పొగమంచు వల్ల పలు విమానాలను దారిమళ్లించారు. యూపీలోని పలు ప్రాంతా ల్లో రైళ్లను రద్దు చేశారు. ఉత్తర రాజస్థాన్ ప్రాంతం చలిగాలులతో ఉక్కిరిబిక్కిరవుతోంది. కశ్మీర్ పూర్తిగా గడ్డకట్టుకుపోయింది. రాత్రివేళల్లో నల్లాల్లో నీళ్లు కూడా గడ్డ కట్టుకుపోతున్నాయి. శ్రీనగర్‌లో -5.6 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పహల్‌గావ్‌లో -12 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## 1700 మంది మంచులో చిక్కుకున్న పర్యాటకులు

**సిక్కింలో రక్షించిన సైన్యం.. ఆర్మీ క్యాంపులో ఆశ్రయం**



గాంగ్‌టక్, డిసెంబరు 28: సిక్కింలో భారీ హిమపాతం కారణంగా మంచులో చిక్కుకుపోయిన దాదాపు 1700 మంది పర్యాటకులను భారత సైన్యం రక్షించింది. నిరంతరాయంగా కురుస్తున్న మంచు నాథు లా కనుమ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డును పూర్తిగా కప్పేసింది. దీంతో శుక్రవారం పర్యాటకుల వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. "పర్యాటకులు దాదాపు 300 వాహనాల్లో సోమ్‌గో సరస్సు నుంచి తిరిగి వస్తున్నారు. మార్గంలో భారీగా మంచు పేరుకుపోవడంతో వారు మధ్య లోనే చిక్కుకున్నారు. అందరినీ రక్షించి ఆర్మీ క్యాంపులో ఆశ్రయం కల్పించాం. వారికి ఆహారం, దుస్తులు, మందులు అందజేశాం. జేసీబీలు, డోజర్లతో రోడ్డుపై మంచును తొలగిస్తున్నాం. పర్యాటకులు క్షేమంగా వారి స్వగ్రామాలకు చేరేలా చర్యలు తీసుకుంటాం" అని ఓ సైనికాధికారి తెలిపారు.



**లఖ్‌నవూలో హైడ్రామా..**

# నా మెడపై చేయి వేసి తోశారు

## నాపై చెయ్యి చేసుకున్నారు.. పక్కకు లాగడంతో కింద పడ్డాను



ప్రియాంక మెడపై చేయి వేసి తోస్తున్న పోలీసు అధికారి

- పోలీసులపై ప్రియాంక మండిపాటు
- బులెట్ ప్రూఫ్ వాహనం వదిలి స్కూటర్‌పై నిష్క్రమణ
- పోలీసులు అడ్డగించడంతో 2.5 కిలోమీటర్లు నడక
- ఘటనపై సీఆర్‌పీఎఫ్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు

లఖ్‌నవూ, డిసెంబరు 28: ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆకస్మిక పర్యటనలో హైడ్రామా చోటుచేసుకుంది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేసి.. అరెస్టయిన మాజీ ఐపీఎస్ అధికారి ఎస్ ఆర్ దారాపురీ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆమె లఖ్‌నవూ వచ్చారు. పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించాక సెక్టర్-18లోని ఇందిరానగర్‌లో ఉన్న దారాపురీ ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో.. ఆమె బులెట్ ప్రూఫ్ వాహనాన్ని లోహియా క్రాసింగ్ వద్ద పోలీసులు అడ్డగించారు. దీంతో ఆమె "ఎందుకు నన్ను ఆపారు..?" అంటూ వారితో వాగ్వాదానికి దిగారు. ఆమె పర్యటనతో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడే ప్రమాదముండటంతో అనుమతించలేమని వారు స్పష్టం చేశారు. "నేను కేవలం సానుభూతి ప్రకటించడానికి వెళుతున్నా. నా రాక గురించి ఎవరికీ చెప్పలేదు. నా వెంట ముగ్గురు మాత్రమే ఉన్నారు. నా పర్యటన శాంతి భద్రతలనెలా దెబ్బతీస్తుంది..?" అని ప్రశ్నిస్తూ ఆమె కొంతదూరం నడిచే ముందుకు వెళ్లారు. అయితే మహిళా పోలీసులంతా చుట్టుముట్టి కదలడానికి వీల్లేదని ఆంక్ష పెట్టారు. ఆ సమయంలో చిన్నపాటి తోపులాట జరిగింది. "యూపీ మహిళా పోలీసులు నాపై చేయి చేసుకున్నారు. ఓ మహిళా కానిస్టేబుల్ నన్ను మెడపట్టి తోసేసింది. మరొకరు గొంతు పట్టుకుని పక్కకు లాగడంతో నేను కిందకు పడిపోయాను" అని ప్రియాంక ఆరోపించారు. "ఇది దారుణం. నేను ముందుకే వెళ్లాలని స్థిరనిర్ణయం తీసుకున్నాను. ప్రజాస్వామ్యయుతంగా నిరసన కూడా తెలిపే హక్కు కూడా లేదా..? శాంతియుతంగా ఆందోళన చేసిన 76 ఏళ్ల దారాపురీని అరెస్టు చేసి జైలుపాల్జేశారు. ఆ కుటుంబాన్ని పరామర్శించబోతే అది జరగరాదన్నారు. ఇది అమానుషత్వం. నా హక్కులు నాకున్నాయి" అని ప్రియాంక తేల్చిచెప్పారు. ఈ నిలువరింత జరుగుతున్నపుడే ఓ పార్టీ కార్యకర్త స్కూటర్ తేవడంతో ఆమె దానిపై దారాపురీ ఇంటి దిశగా బయల్దేరారు. పోలీసులు వెంబడించారు. దాదాపుగా సెక్టర్ 18కు ఓ రెండు కిలోమీటర్ల దూరం దాకా చేరుకున్నారు. అక్కడ మళ్లీ పోలీసులు నిలిపేశారు. దాంతో ప్రియాంక స్కూటర్ దిగి వారితో వాగ్వాదానికి దిగారు. ప్రియాంక ఆగలేదు. భద్రతా వలయాన్ని ఛేదించుకుని కాలినడకన రెండు కిలోమీటర్ల దూరం నడిచి దారాపురీ ఇంటికి చేరుకున్నారు. వారిని పరామర్శించి బయటకు వచ్చాక మీడియాతో మాట్లాడారు. 'యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఓ పిరికిదాన్లా ప్రవర్తించింది. నేను ఏదో కొద్ది మందితో వెళుతుంటే వారు ట్రాఫిక్‌ను నిలిపేసి నానా హంగామా సృష్టించారు. ఎవరైనా ఓ నడిరోడ్డు కూడలి మీద ఇలా నిలువరిస్తారా..?" అని ప్రశ్నించారు. "నేను ప్రశాంతంగానే వెళుతున్నాను. కానీ రాష్ట్ర శాంతి భద్రతలు సవ్యంగానే ఉన్నాయా? వారు నన్ను అరెస్టు చేయదల్చుకుంటే చేయాలి తప్ప ఇలా చెయ్యి చేసుకోవడం తప్పు" అన్నారు.

### 'బ్రిటిష్ పాలనలా ఉంది'

కాగా, బీజేపీ పాలన నాటి బ్రిటిష్ పాలనను తలపిస్తోందని ప్రియాంక గాంధీ వాద్రా అంతకుముందు పార్టీ కార్యకర్తల సమావేశంలో విమర్శించారు. "స్వాతంత్ర్య పోరాటం సమయంలో ఏ ఆదర్శాల కోసం పోరాడామో ఇప్పుడూ అవే ఉదాత్త ఆశయాల కోసం పోరాడాల్సి వస్తోంది. ఇప్పుడు దేశం ప్రమాదంలో ఉంది. మనం గళమెత్తకపోతే పిరికిపందలమని నిరూపించుకున్నట్టే. భయపెట్టి అణగదొక్కేయాలని ప్రభుత్వం చూస్తోంది. రాజ్యాంగానికి వ్యతిరేకమైన చట్టాలను బీజేపీ రూపొందిస్తోంది. వాటిని వ్యతిరేకించేవారిని చంపేస్తోంది లేదా జైలుపాల్జేస్తోంది' అని దుయ్యబట్టారు. కాగా, పార్టీ కార్యకర్త ఒకరు భద్రతా వలయాన్ని ఛేదించుకొని వేదికపై ఉన్న ప్రియాంక వద్దకు దూసుకు వెళ్లడం కలకలం రేపింది. భద్రతాసిబ్బంది అతనిని అడ్డుకోబోగా- ప్రియాంక వారించి, తన దగ్గరకు పిలిపించుకుని, ఆయన చెప్పినది విని షేక్‌హ్యాండిచ్చి పంపారు.

**ఆరోపణలు అబద్ధం: పోలీసులు**

ప్రియాంక ఆరోపణలను పోలీసులు ఖండించారు. 'మేం చెయ్యి చేసుకున్నట్లు చెప్పడం అబద్ధం. ఆమె ముందుకు వెళ్లకుండా మేం అడ్డగించామంతే. ఆమే మా చెయ్యి దాటుకుని ముందుకెళ్లారు" అని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అర్చనా సింగ్ వివరణ ఇచ్చారు. అటు కాంగ్రెస్ ఈ పరిణామాలపై తీవ్రంగా మండిపడింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని డిస్మిస్ చేసి యూపీలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేసింది. అంతేకాక- ప్రియాంక భద్రతా వ్యవహారాలను చూస్తున్న సీఆర్‌పీఎఫ్‌కు ఈ విషయమై ఓ ఫిర్యాదు పంపింది. 'యూపీలోని ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రియాంకను బెదిరించారు. ఆమెను అడ్డగించారు...సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఎదుటే ఈ ఘటన చోటుచేసుకుంది" అని అందులో పేర్కొంది. ఈ ఘటనపై అంతర్గత దర్యాప్తుకు సీఆర్‌పీఎఫ్ ఆదేశించింది.

## చరిత్రపై 'చెడ్డీగ్యాంగ్' దాడి

**ఆరెస్సెస్ అసోంను పాలించలేదు: రాహుల్**



న్యూఢిల్లీ/గువాహటి/లఖ్‌నవూ, డిసెంబరు 28: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరెస్సెస్‌ను 'చెడ్డీ గ్యాంగ్' అంటూ విమర్శించారు. ప్రజల కష్టాలు వినేందుకు బీజేపీ సిద్ధంగా లేదని మండిపడ్డారు. శనివారం గువాహటిలో సీఏఏ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఈ సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ఆరెస్సెస్, బీజేపీలపై తీవ్ర విమర్శలు చేశారు. "అసోం చరిత్ర, భాష, సంస్కృతి మీద బీజేపీ, ఆరెస్సెస్‌లను దాడి చేయనివ్వం. అసోంను నాగ్‌పూర్ నుంచి పాలించలేరు. ఆరెస్సెస్ చెడ్డీగ్యాంగ్ అసోంను పాలించలేదు. రాష్ట్రంలో శాంతి నెలకొల్పిన అసోం-ఒప్పందం స్ఫూర్తిని నాశనం చేయొద్దు" అని హితవు పలికారు. బీజేపీ ఎక్కడికి వెళ్లినా విద్వేషాలు రగిలిస్తోందన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వాలు తెచ్చిన విధానాల వల్ల అసోం మళ్లీ హింస బాట పట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు... సీఏఏ, ఎన్ఆర్సీ, ఎన్‌పీఆర్‌లకు వ్యతిరేకంగా 'రాజ్యాంగాన్ని రక్షించండి-భారత్‌ను రక్షించండి' పేరుతో కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా శనివారం భారీ ప్రదర్శనలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ 135వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇక్కడి ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలోనూ రాహుల్‌గాంధీ మాట్లాడారు. ఎన్ఆర్సీ, ఎన్‌పీఆర్‌లను 'పెద్దనోట్ల రద్దు-2'గా అభివర్ణించారు. ఇవి 'పెద్దనోట్ల రద్దు' కంటే ప్రమాదకరమైనవి అన్నారు. నిర్బంధ కేంద్రాలపై రాహుల్ అబద్ధాలు చెబుతున్నారని మోదీ చేసిన విమర్శనూ ఆయన తిప్పికొట్టారు.

# వెయ్యి మంది విద్యార్థులపై కేసులు

## అంతా అలీగఢ్ ముస్లిం వర్సిటీ విద్యార్థులే.. సీఏఏ వ్యతిరేక ఆందోళనల ఫలితం

- యూపీలో హింస వెనక పీఎఫ్ఐ
- ఆ రాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరో నివేదిక

లఖ్‌నవూ, డిసెంబరు 28: సీఏఏ వ్యతిరేక ఆందోళనలకు సంబంధించి వెయ్యి మంది గుర్తు తెలియని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ విద్యార్థులపై ఉత్తరప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేశారు. సెక్షన్ 144 ఉల్లంఘన, పోలీసులపై దాడి చేసినందుకు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఫిర్యాదు మేరకు కేసు లు పెట్టారు. రాష్ట్రంలో సీఏఏకి వ్యతిరేకంగా ఆగ్రహావేశాలు ఆకస్మికమేనని, హింస మాత్రం పక్కా ప్రణాళికతో సాగిందని ఇంటెలిజెన్స్ బ్యూరో నివేదించింది. హింస వెనక నిషేధిత సిమికి మరో రూపమైన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) పాత్ర ఉందని తేల్చింది. రాష్ట్రంలో మతపరంగా సున్నితమైన ప్రాంతాల్లో ప్రజలను రెచ్చగొట్టిందని, విధ్వంసానికి, కాల్పులకు పాల్పడేలా చేసిందని, చివరికి బాంబులు విసరడానికి కూడా అదే కారణమని నిర్ధారించింది. "పలు ఘటనల్లో పీఎఫ్ఐ నాయకుల పాత్ర ఉందని తేలింది. అందుకు ఆధారాలు లభించాయి. పీఎఫ్ఐ రాజకీయ విభాగమైన సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు నూర్ హసన్ సహా 20 మందికిపైగా పీఎఫ్ఐ సభ్యులను ఇప్పటికే అరెస్టు చేశాం. ఆందోళనలు ఎక్కువగా మీరట్, ముజఫర్‌నగర్, బులంద్‌షహర్‌లలో జరిగాయి" అని మీరట్ జోన్ ఏడీజీపీ ప్రశాంత్ కుమార్ చెప్పారు. ఇక, లఖ్‌నవూలో భారీఎత్తున హింస, విధ్వంసానికి పాల్పడిన ఆరోపణలపై పీఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ వసీమ్ అహ్మద్ సహా ముగ్గురు ఆఫీసు బేరర్లను అరెస్టు చేశారు. కొంతమంది శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారని, వారికి సమాంతరంగా కొంత మంది అక్కడికి దగ్గర్లోనే హింసకు పాల్పడ్డారని, కాల్పులకు, విధ్వంసానికి తెగించారని వివరించారు. హింస వెనక పీఎఫ్ఐతోపాటు స్థానిక ముస్లిం సంస్థలు కీలక పాత్ర పోషించాయని పోలీసులు తెలిపారు. అయితే, యూపీ ప్రభుత్వం తమను తప్పుడు కేసుల్లో ఇరికించిందని పీఎఫ్ఐ కేంద్ర సచివాలయం ప్రకటించింది. "అహ్మద్‌కు, లఖ్‌నవూ విధ్వంసానికి ఏమాత్రం సంబంధం లేదు ప్రస్తుత ప్రజాందోళనలను అణచి వేయడానికి మాపై విష ప్రచారం చేస్తున్నారు. మమ్మల్ని ఉగ్రవాదులుగా చూపుతున్నారు" అని పీఎఫ్ఐ ఆఫీస్ బేరర్ ఒకరు తెలిపారు.

**ఆందోళనకారులు హడల్: సీఎంవో**

నిరసనల్లో విధ్వంసంపై యోగి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఆందోళనకారులు హడలిపోయారని, దిగ్భ్రాంతికి గురయ్యారని యూపీ సీఎంవో పేర్కొంది. 'ప్రతి ఆందోళనకారుడు దిగ్భ్రాంతికి గురయ్యాడు. సమస్య సృష్టించాలని భావించిన ప్రతి ఒక్కడూ నివ్వెరపోయాడు. మీరేం చేసుకుంటారో చేసుకోండి. ఆస్తి నష్టాలకు కారకుల నుంచే వాటిని వసూలు చేస్తామని సీఎం యోగి స్పష్టం చేశారు. అందుకే, ప్రతి ఆందోళనకారుడు ఇప్పుడు గగ్గోలు పెడుతున్నాడు' అని 'ద గ్రేట్ సీఎం యోగి' హ్యాష్‌ట్యాగ్ పేరిట ట్వీటింది.



**భారీ జాతీయజెండాతో**

## చెన్నైలో 'పౌరసత్వ' నిరసన

చెన్నై, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ శనివారం చెన్నైలో ముస్లిం మత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. తమిళనాడు దౌహీద్ జమాత్ సంస్థ నాయకత్వంలో జరిగిన ఈ ర్యాలీలో సుమారు 40 వేలమంది పాల్గొన్నారు. 650 అడుగుల జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. స్థానిక ఆలందూరు నుంచి గిండీ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో రాజభవన్‌ను ముట్టడించేందుకు యత్నించారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు ముస్లిం యువతీయువకులు, మహిళలు, విద్యార్థులు, మత సంస్థల పెద్దలు తరలివచ్చారు.

**మంగళూరు మృతులకు**

## బెంగాల్ పరిహారం

**రూ.5 లక్షలు అందించిన టీఎంసీ నేతలు**

బెంగళూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మంగళూరులో జరిగిన అల్లర్లలో పోలీసు కాల్పుల్లో మృతి చెందిన ఇద్దరి కుటుంబ సభ్యులకు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేసింది. తృణమూల్ కాంగ్రెస్ నేతలు, రైల్వే శాఖ మాజీ మంత్రి దినేశ్ త్రివేది, ఎంపీ ఎండీ నదీమ్ ఉల్ హక్ నేతృత్వంలోని బృందం శనివారం కందక నివాసి అబ్దుల్ జలీల్, కుద్రోళి నివాసి నౌషీద్ కుటుంబాలను పరామర్శించి రూ.5 లక్షల విలువైన చెక్కులను అందజేసింది. మంగళూరు మహానగర పాలికె కార్పొరేటర్లు లతీఫ్ కందక్, షంషుద్దీన్ కుద్రోళిలు వారి వెంట ఉన్నారు. ఈ నెల 19వ తేదీ మంగళూరులో జరిగిన పోలీసు కాల్పులను పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. మృతులకు రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. పశ్చిమబెంగాల్ కార్మిక సంఘాల ద్వారా వసూలు చేసిన మొత్తం ద్వారా పరిహారం ఇచ్చినట్టు టీఎంసీ వర్గాలు తెలిపాయి. కర్ణాటక సీఎం యడియూరప్ప మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. విచారణ నివేదిక తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. పరిహారం ఇవ్వడం ద్వారా మమతా బెనర్జీ హింసను ప్రోత్సహించినట్టుగా ఉందని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ సవది, పలువురు బీజేపీ నేతలు మండిపడ్డారు.



మృతుల కుటుంబసభ్యులతో దినేశ్ త్రివేది



వేస్ట్ షార్క్ డ్రోన్

## నీటి శుభ్రతకు 'వేస్ట్ షార్క్'

- చెన్నై నగరంలో డ్రోన్ల వినియోగానికి ఏర్పాట్లు


చెన్నై, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెరువుల్లో, కాలువల్లో, నీటి కుంటల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం వలన నీటి కాలుష్యం పెరిగిపోతుంది. దానివలన ప్రజా ఆరోగ్యానికీ ముప్పే. అయితే ఈ సమస్యకు 'వేస్ట్ షార్క్' డ్రోన్లతో చెక్ పెట్టాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నిర్ణయించింది. నగరంలోని నీటి వనరులపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు 'వేస్ట్ షార్క్' అనే ఆక్వా డ్రోన్లను కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతోంది. బ్యాటరీ సాయంతో పనిచేసే ఈ డ్రోన్‌ను రిమోట్‌తో ఆపరేట్ చేస్తే అది నీటిలో ఈదుకుంటూ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని సేకరిస్తుంది. వేల్ షార్క్ స్ఫూర్తితో రూపొందించిన ఈ ఆక్వా డ్రోన్‌ను పోర్టుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు వినియోగిస్తుంటారని, వీటిని నగరాల్లోని నీటివనరుల శుభ్రతకు ఉపయోగించవచ్చని, ఆలయ కోనేర్లు, చెరువులను శుభ్రం చేసేందుకు కూడా వీటిని వినియోగిస్తామని అధికారులు తెలిపారు. దీని బ్యాటరీని ఒకసారి పూర్తిగా చార్జింగ్ చేస్తే 8 గంటల పాటు పనిచేస్తుంది. అంతేకాదు.. దీనిలో ఉండే సెన్సర్ల ద్వారా నీటి నాణ్యతను కూడా తెలుసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

## డ్రైవర్‌ను కిడ్నాప్ చేసి.. ఉల్లిగడ్డల చోరీ

- బిహార్‌లోని కైమూర్ జిల్లాలో ఘటన

పట్నా, డిసెంబరు 28: ధర పెరుగుదలతో వరుసగా ఉల్లిగడ్డల చోరీ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గత నెల మధ్యప్రదేశ్‌లో ఇలాంటివి జరగ్గా.. తాజాగా బిహార్‌లో లారీ డ్రైవర్‌ను కిడ్నాప్ చేసి 51 క్వింటాళ్ల ఉల్లిని దోచుకెళ్లారు. జహనాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌కు ఉల్లి లోడుతో వెళ్తున్న లారీని గురువారం రాత్రి కైమూర్ జిల్లాలో సాయుధులైన ఆరుగురు దుండగులు అటకాయించారు. డ్రైవర్ దేశ్‌రాజ్‌ను నాలుగు గంటల పాటు ఆధీనంలో ఉంచుకుని.. ఐదు కిలోమీటర్ల దూరంలో వదిలిపెట్టి సరుకు ఎత్తుకెళ్లారు. ఇదే జిల్లాలో ఇటీవల ఎల్లిపాయల లోడు చోరీకి గురైంది. రెండు ఘటనలపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.

## 'ఈ-మెయిల్ స్పూఫ్' సృష్టికర్త అరెస్టు




న్యూఢిల్లీ, డిసెంబరు 28: 'ఈ-మెయిల్ స్పూఫ్' యాప్ సృష్టికర్త రమేశ్ భండారీని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ యాప్ సాయంతో సైబర్ నేరగాళ్లు రుణాలు, పెళ్లి సంబంధాలు, డేటింగ్, ఉద్యోగాలు, ఆఫర్ల పేరుతో వేల మందిని మోసగించారు. నకిలీ ఈ-మెయిల్స్‌పై ఫిర్యాదులు అందడంతో రంగంలోకి దిగిన ఢిల్లీ సైబర్‌సెల్ పోలీసులు.. యూపీకి చెందిన రమేశ్‌ను నిందితుడిగా గుర్తించారు. అతడిని బెంగళూరులో అరెస్టు చేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. జవాన్‌కు గాయాలు

రాయ్‌పూర్, డిసెంబరు 28: ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్‌తో జరిగిన ఎదురుకాల్పుల్లో డీఆర్‌జీ జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నారాయణ్‌పూర్ జిల్లాలోని బుర్గం గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం 1 గంటకు ఈ సంఘటన చోటుచేసుకుంది. నక్సల్స్ ఏరివేత ఆపరేషన్‌లో భాగంగా ఇండో టిబెటియన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ), డీఆర్‌జీ జవాన్లు శనివారం ఉదయం కరేనార్ క్యాంపు నుంచి బయల్దేరి అడవిలోకి ప్రవేశించారు. మధ్యాహ్నానికి బుర్గం గ్రామ సమీపంలో వారికి నక్సల్స్ ఎదురుపడ్డారు. ఆ సమయంలో ఇరువర్గాల మధ్య అరగంటపాటు జరిగిన ఎదురు కాల్పుల్లో డీఆర్‌జీ జవాన్‌కు బుల్లెట్ గాయాలయ్యాయని నారాయణ్‌పూర్ ఎస్పీ మోహిత్ గార్గ్ వెల్లడించారు. వెంటనే అతన్ని చికిత్స కోసం రాయ్‌పూర్ తరలించినట్టు ఆయన తెలిపారు.



**సోమాలియాలో కారుబాంబు పేలుడు..**

సోమాలియా రాజధాని మొగదీషులో కారు బాంబు పేలుడు అనంతరం బీభత్సం

# 90 మంది దుర్మరణం

## బస్సులో కాలేజీకి వెళ్తున్న విద్యార్థుల సజీవ దహనం

- 70 మందికి గాయాలు
- మృతుల్లో 17 మంది పోలీసులు
- అల్-షబాబ్ పనేనని అనుమానం

మొగదీషు, డిసెంబరు 28: సోమాలియా రాజధాని మొగదీషు కారుబాంబు పేలుడుతో దద్దరిల్లింది. అత్యంత రద్దీగా ఉండే నగరంలోని పన్ను కార్యాలయం కూడలిలోని పోలీసు చెక్‌పోస్టు వద్ద శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ దురంతంలో 90 మంది అక్కడికక్కడే మృతిచెందగా, 70 మంది గాయాలపాలయ్యారు. కాలి బూడిదైన వాహనాలు, తెగిపడిన శరీర భాగాలు, గుర్తుపట్టలేని విధంగా మిగిలిన మృతదేహాలు, రక్తసిక్తమైన ఘటనా స్థలంతో మొగదీషులో భీతావహ వాతావరణం నెలకొంది. మృతుల్లో ఎక్కువ మంది స్థానిక విశ్వవిద్యాలయ విద్యార్థులేనని గుర్తించారు. కారు బాంబుకు అత్యంత సమీపం నుంచి వర్సిటీ బస్సు వెళ్తుండగా పేలుడు జరగడంతో.. అందులోని విద్యార్థులంతా సజీవ దహనమైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుల్లో 17 మంది పోలీసు సిబ్బంది, ఇద్దరు టర్కీ జాతీయులు ఉన్నట్లు గుర్తించారు. కాగా, ప్రమాద వివరాలను మొగదీషు మేయర్ ఒమర్ మహమూద్ మొహ్మద్ ధ్రువీకరించారు. మృతుల సంఖ్య మరింత పెరగొచ్చని తెలిపారు. అయితే ఈ దాడికి తామే కారణమని ఏ ఉగ్రవాద సంస్థ కూడా ప్రకటించుకోలేదు. గతంలో అల్‌ఖైద్ అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్-షబాబ్ ఇదే తరహా కారుబాంబు దాడులకు పాల్పడింది. దీంతో ఈ ఘాతుకం కూడా దాని పనే అయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కాగా, 2015 నుంచి ఇప్పటివరకు మొగదీషులో పదకొండుసార్లు కారు బాంబు పేలుళ్లు చోటుచేసుకున్నాయి. 2017 అక్టోబరులో జరిగిన ట్రక్కు బాంబు పేలుడులో 512 మంది మృతిచెందగా, 295 మంది గాయాలపాలయ్యారు.

ఆస్ట్రేలియా × న్యూజిలాండ్
రెండో టెస్ట్ - నాలుగో రోజు
ఉ. 5 గం. నుంచి
సోనీ సిక్స్‌లో




## త్వరలో ఎమ్మెస్కే వారసుడి ఎంపిక

- చైర్మన్‌తోపాటు మరో సెలెక్టర్ నియామకం
- మొత్తం కమిటీ ప్రక్షాళన కాదు
- బీసీసీఐ చీఫ్ గంగూలీ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** జాతీయ సీనియర్ సెలెక్షన్ కమిటీని సమూలంగా మార్చివేసే ఆలోచన లేదని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ వెల్లడించాడు. పదవీకాలం పూర్తయిన చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్, సభ్యుడు గగన్ ఖోడా స్థానాల్లో మాత్రమే కొత్త వారిని ఎంపిక చేస్తామని చెప్పాడు. మరో ఏడాది పదవీకాలం ఉన్న దేవాంగ్ గాంధీ, శరణ్‌దీప్ సింగ్, జతిన్ పరంజపేలను కొనసాగిస్తామని శనివారం స్పష్టంజేశాడు. దాంతో సెలెక్షన్ కమిటీని పూర్తిగా ప్రక్షాళన చేస్తారంటూ వస్తున్న వార్తలకు గంగూలీ తెరదించాడు. కొత్త చైర్మన్‌గా ఎవరు రానున్నారో చెప్పేందుకు మాత్రం దాదా నిరాకరించాడు. బీసీసీఐ కొత్త రాజ్యాంగం ప్రకారం క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) మాత్రమే చైర్మన్‌ను ఎంపిక చేస్తుందన్నాడు. 'రెండుమూడు రోజుల్లో సీఏసీని నియమిస్తాం. ఈ దశలో పేర్లు చెప్పడం సబబుకాదు. సీఏసీకి మేం ఎంపిక చేసిన క్రికెటర్లు తమ నిర్ణయం తెలిపేందుకు కొంత సమయం తీసుకుంటారు. అందువల్ల త్వరలో ఇందుకు సంబంధించిన వివరాలు తెలియజేస్తాం' అని చెప్పాడు. నాలుగు దేశాల సూపర్ సిరీస్ టోర్నీపై స్పందిస్తూ.. 'ఇది ప్రతిపాదన మాత్రమే. అది ఏ రూపు తీసుకుంటుందో చూడాలి' అని అన్నాడు.









## వారెవా..ఒలింపిక్ క్యాలెండర్

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** వచ్చే ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్ క్రీడలను పురస్కరించుకుని కేరళకు చెందిన ప్రొఫెసర్ ఎంసీ వశిష్ట్ చక్కని క్యాలెండర్‌ను తయారుచేశారు. 'రోడ్ టు టోక్యో 2020' పేరుతో రూపొందిన ఈ క్యాలెండర్‌లో జనవరి నుంచి డిసెంబరు వరకూ మొత్తం 12 మాసాల పేజీల్లో 1896 నుంచి 2016 వరకూ జరిగిన ఒలింపిక్ క్రీడల విశేషాల్ని పొందుపరిచారు. ప్రాచీన ఒలింపిక్స్ చరిత్రతోపాటు లెజెండరీ అథ్లెట్లు పావో నూర్మీ, జెస్సీ ఓవెన్స్, బాబ్ బీమన్, మార్క్ స్పిట్జ్, నాడియా కొమనేసి, మైకేల్ ఫెల్ప్స్ చిత్రాలున్నాయి. భారత ఒలింపిక్ చరిత్రలో పతకాలు నెగ్గిన ఆటగాళ్లు, అలాగే భారత హాకీ స్వర్ణ చరిత్ర, ధ్యాన్‌చంద్ ఫొటోలను కూడా ఈ క్యాలెండర్‌లో నిక్షిప్తం చేశారు. 'ప్రపంచ శాంతికి ఒలింపిక్స్' అనే సందేశాన్ని వ్యాపింపజేసే లక్ష్యంతో దీన్ని తయారుచేసినట్టు వశిష్ట్ తెలిపారు. వశిష్ట్... కాలికట్‌లోని మలబార్ క్రిస్టియన్ కళాశాలలో హిస్టరీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

# నిఖత్‌కు మేరీ పంచ్



ఏకపక్షంగా ఫైనల్ బౌట్

- 9-1తో కోమ్ విజయం
- జరీన్ ఒలింపిక్ ఆశలు గల్లంతు

**న్యూఢిల్లీ:** ఆరు సార్లు ప్రపంచ విజేతగా నిలిచిన దిగ్గజ బాక్సర్, 36 ఏళ్ల మేరీ కోమ్ తన స్థాయేంటో నిరూపించుకుంది. ఒలింపిక్స్ అర్హత టోర్నీ కోసం జరిగిన ట్రయల్స్‌లో మేరీ 9-1 తేడాతో తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్‌ను చిత్తుగా ఓడించింది. 51 కేజీల విభాగంలో శనివారం జరిగిన ఈ బౌట్ ఫలితంతో ఫిబ్రవరి మూడు నుంచి చైనాలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో మేరీ కోమ్ స్థానం ఖాయమైంది. దీంతో అటు 23 ఏళ్ల నిఖత్ ఒలింపిక్ ఆశలకు తెర పడినట్టయింది. బౌట్‌కు ముందు నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఈ ఇద్దరి పోరుపై ఉద్విగ్న వాతావరణం నెలకొంది. కానీ గట్టి పోటీ ఇస్తుందని భావించిన నిఖత్.. మేరీ అనుభవం ముందు నిలవలేకపోయింది. దిగ్గజ బాక్సర్‌తో పోరు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్టు నిఖత్ ప్రకటించినా రింగ్‌లోకి ప్రవేశించాక పూర్తిగా తేలిపోయింది. మేరీ నుంచి వచ్చిన పంచ్‌లకు సమాధానం ఇవ్వలేకపోయింది. కొన్ని రోజులుగా తనను విసిగిస్తున్నందుకో.. ఏమో కానీ నిఖత్‌పై మేరీ కోమ్ శక్తివంతమైన పంచ్‌లతో విరుచుకుపడింది. ఇలాంటి పోరాటాన్ని ఏమాత్రం ఊహించని నిఖత్ రింగ్‌లో ప్రేక్షకపాత్రకు పరిమితమైంది. ఫలితంగా బౌట్ పూర్తి ఏకపక్షంగా మారి మేరీ ఘనవిజయం సాధించింది. క్వాలిఫయింగ్ టోర్నీ కోసం ఎంపిక పారదర్శకంగా సాగాలన్న డిమాండ్‌ను నిఖత్ కొంతకాలంగా వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) శుక్ర, శనివారాల్లో ట్రయల్స్ నిర్వహించగా 51 కేజీల విభాగంలో మేరీ, నిఖత్ ఫైనల్లో తలపడ్డారు. కానీ ఈ సదవకాశాన్ని నిఖత్ వినియోగించుకోలేకపోయింది.

**సాక్షి చౌధరి విజయం**

57 కేజీల విభాగంలో రెండుసార్లు ప్రపంచ రజత విజేత సోనియా లాథర్‌కు చుక్కెదురైంది. ఆమెపై సాక్షి చౌధరి విజయం సాధించగా.. 60 కేజీల విభాగంలో మాజీ ప్రపంచ చాంపియన్ సరితా దేవిపై జాతీయ చాంపియన్ సిమ్రన్‌జిత్ కౌర్ గెలిచింది.

**ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో తలపడే భారత జట్టు:**

మేరీ కోమ్ (51 కి), సాక్షి చౌధరి (57 కి), సిమ్రన్‌జిత్ కౌర్ (60 కి), లవ్లీనా బోర్గోహెయిన్ (69 కి), పూజా రాణి (75 కి).

మేరీ కోమ్ వర్సెస్ నిఖత్ జరీన్.. ఈ ఇద్దరి మధ్య నెలకొన్న వివాదం దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించిందనడంలో సందేహం లేదు. ట్రయల్స్ లేకుండానే మేరీ కోమ్‌ను ఒలింపిక్ అర్హత పోటీలకు ఎలా పంపిస్తారని కొంత కాలంగా పట్టు వీడకుండా ప్రయత్నించిన నిఖత్.. చివరకు మేరీని బౌట్ వరకు తేగలిగింది. ఆమె కోరుకున్నట్టుగానే ఇద్దరి మధ్య పోరు కూడా ఖాయమైంది. ఇక వీళ్ల సమరంలో అంతిమ విజేత ఎవరనే చర్చ సర్వత్రా సాగింది. అయితే అత్యంత ఆసక్తిగా ప్రారంభమైన ఈ బౌట్‌లో మేరీ పంచ్‌లకు నిఖత్ నిలువలేకపోయింది. జరీన్ ఒలింపిక్ ఆశలపై నీళ్లు జల్లుతూ మేరీ కళ్లుచెదిరే పంచ్ ఇచ్చింది. బౌట్ ముగిశాక ప్రత్యర్థితో కరచాలనం చేయకుండా వెళ్లిపోవడం మేరీ అసహనాన్ని సూచించింది.

**షేక్ హ్యాండ్ ఎందుకివ్వాలి?**

'నేనా సమయంలో చాలా కోపంగా ఉన్నా. బౌట్ ముగిశాక నేను ఆమెకు షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు.. కౌగిలించుకోలేదు. అయితే ఏంటి? ఇతరుల నుంచి గౌరవాన్ని కోరుకుంటే ముందుగా ఆమె గౌరవం ఇవ్వడం నేర్చుకోవాలి. నిఖత్ తరహా మనుషుల్ని నేను ఇష్టపడను. ఎవరైనా బౌట్‌లోనే నిరూపించుకోవాలి. ఇప్పుడు రింగ్‌లో ఏం జరిగిందో అంతా చూశారు. ఆమెతో ట్రయల్స్‌లో పాల్గొనని నేనెప్పుడైనా చెప్పానా.. మరి నన్నెందుకు ఈ వివాదంలోకి లాగారు. నేను కూడా మనిషినే. నా విశ్వసనీయత ను ప్రశ్నిస్తే కోపం రాదా? బౌట్‌లో గెలిచి నా స్థానాన్ని తీసుకోవచ్చు. ఎవరు వద్దన్నారు. అంతేకానీ మీడియా ముందు వాగితే దానికి తగినట్టుగానే బదులిస్తా'

- మేరీ కోమ్



**మేరీ ప్రవర్తన బాధించింది..**

బౌట్ ముగిశాక మేరీ ప్రవర్తన బాధించింది. రింగ్‌లోనూ ఆమె నాతో అసభ్యకరంగా మాట్లాడింది. నేను జూనియర్‌ను. బౌట్ ముగిశాక నేను హత్తుకునే ప్రయత్నం చేసినా పట్టించుకోలేదు. అయితే ఈ విషయంలో ఇక నేనేం కామెంట్ చేయదల్చుకోలేదు.

-నిఖత్ జరీన్

## టీబీఏ నిరసన

నిఖత్, మేరీ కోమ్ ఫైట్‌కు ముందు.. తర్వాత కూడా పోరు జరిగిన గదిలో ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది. దీనికి తగ్గట్టుగానే బౌట్ జరుగుతున్నప్పుడు, పూర్తయ్యాక కూడా ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. పోరు ముగిశాక ఇద్దరూ కరచాలనం కూడా చేసుకోకపోవడం గమనార్హం. జరీన్ కౌగిలించుకునేందుకు ప్రయత్నించినా మేరీ అసలేం పట్టించుకోకుండా విసురుగా రింగ్ నుంచి వెళ్లిపోయింది. మరోవైపు ఫలితం ప్రకటించాక తెలంగాణ బాక్సింగ్ సంఘానికి (టీబీఏ) చెందిన ప్రతినిధి ఏపీ రెడ్డి ఫౌల్ అంటూ అరిచారు. ఇలాంటి రాజకీయాలతో బాక్సింగ్ ఎలా అభివృద్ధి చెందుతుందని నిరసన వ్యక్తం చేశాడు. దీంతో వెంటనే అతడిని రింగ్ సమీపం నుంచి వెళ్లిపోవాల్సిందిగా నిర్వాహకులు కోరారు. ఇదిలా ఉండగా అందరూ కోరినట్టుగానే ఈ ట్రయల్స్ పారదర్శకంగా జరిగాయని భారత బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు అజయ్ సింగ్ తెలిపారు.



## రాహుల్, అతియా.. సమ్‌థింగ్, సమ్‌థింగ్

**బెంగళూరు:** సోషల్ మీడియాలో పెద్దసంఖ్యలో ఫాలోయర్లున్న క్రికెటర్లలో కేఎల్ రాహుల్ ఒకడు. క్లాస్ ఆటకు మారుపేరైన ఈ టీమిండియా బ్యాట్స్‌మన్ పర్సనల్ లైఫ్‌ను బాగా ఎంజాయ్ చేస్తాడు. చేతినిండా టాటూలు, అర్ధరాత్రి వరకూ పార్టీలతో నేటి యూత్‌కు సిసలైన ఉదాహరణగా నిలుస్తాడు. మైదానం వెలుపల తన ప్రవర్తనతో విమర్శలపాలైనా వాటిని బేఖాతర్ అంటాడు. తాజాగా, అతడు బాలీవుడ్ నటి అతియా షెట్టితో డేటింగ్‌లో ఉన్నట్టు సమాచారం. అతియాతో తాను కలిసున్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో రాహుల్ పోస్ట్ చేయడం ఆ వార్తలకు బలం చేకూర్చింది. అందులో..రాహుల్ ఓ పాతకాలంనాటి ఫోన్ హ్యాండిల్ పట్టుకొని ఉండగా, అతియా ముసిముసి నవ్వులు చిందిస్తూ కెమెరావైపు చూస్తోంది. ఆ ఫొటోకు అతియా తండ్రి, బాలీవుడ్ నటుడు సునీల్ షెట్టి నటించిన కామెడీ చిత్రం 'హేరా ఫేరీ'లోని డైలాగ్ 'హలో.. దేవీ ప్రసాద్' అని రాహుల్ క్యాప్షన్ పెట్టాడు. ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేస్తున్న ఈ చిత్రానికి ఇప్పటికే 5లక్షలకుపైగా లైక్‌లు, మూడు వేల కామెంట్లు వచ్చాయి. అతియా తండ్రి, బాలీవుడ్ నటుడు సునీల్ షెట్టి ఈ ఫొటోకు స్పందిస్తూ 'ఓకే, నవ్వుతున్న' ఎమోజీ పోస్ట్ చేయడం.. క్రికెటర్, హీరోయిన్ మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్‌ను మరింత బలపరిచేలా ఉంది.



## ఇదే..ఈ దశాబ్దపు చెత్త ట్వీట్

**న్యూఢిల్లీ:** మరో రెండ్రోజుల్లో ఈ దశాబ్దానికి ముగింపు కార్డు పడనుంది. ఈ నేపథ్యంలో కామెంటేటర్, మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ గతంలో విరాట్ కోహ్లీని విమర్శిస్తూ చేసిన ఓ ట్వీట్ ఈ దశాబ్దపు అత్యంత చెత్త ట్వీట్‌గా నమోదైంది. ఏడేళ్ల క్రితం టెస్టులు, వన్డే సిరీస్ ఆడేందుకు ఆస్ట్రేలియా పర్యటనకు భారత జట్టు వెళ్లిన సందర్భంగా మంజ్రేకర్ 2012 జనవరి 6న ట్విటర్‌లో ఓ పోస్ట్ పెట్టాడు. 'నేనైతే వీవీఎస్ లక్ష్మణ్‌ను తప్పించి.. తర్వాతి టెస్ట్‌కు రోహిత్‌ను ఎంపిక చేస్తా. అయితే విరాట్ కోహ్లీకి మరో టెస్ట్ చాన్సిస్తా.. ఎందుకంటే, అతను ఎలాగూ ఎక్కువకాలం టెస్టు జట్టులో కనబడడు' అని మంజ్రేకర్ ట్వీట్ చేశాడు. విరాట్‌కు టెస్టుల్లో భవిష్యత్ లేదని నాడు మంజ్రేకర్ విమర్శించినా.. ఇప్పుడదే కోహ్లీ టెస్టులతో పాటు అన్ని ఫార్మాట్లలో భారత్‌ను సమర్థవంతంగా నడిపిస్తున్నాడు. అంతేకాదు.. విజ్డెన్ ప్రకటించిన 'ఈ దశాబ్దపు టాప్-5 క్రికెటర్ల'లో ఒకడిగా విరాట్‌కు చోటు దక్కింది. అందుకే.. సరైన అంచనా లేకుండా విరాట్‌పై మంజ్రేకర్ చేసిన ట్వీట్ ఇప్పుడు అత్యంత చెత్తదని ట్రెండింగ్‌లో ఉంది.

**కోహ్లీకి టెస్టుల్లో భవిష్యత్‌లేదట**



## యశస్వీ 'జై'స్వాల్

- దుమ్మురేపిన ఆల్‌రౌండర్
- మూడో వన్డేలో యువ భారత్ గెలుపు
- దక్షిణాఫ్రికా అండర్-19పై సిరీస్ కైవసం



**ఈస్ట్‌లండన్:** ఆల్‌రౌండర్ యశస్వీ జైస్వాల్ (89 నాటౌట్, 4/13) అదరగొట్టడంతో దక్షిణాఫ్రికా అండర్-19 జట్టుతో జరిగిన రెండో వన్డేలో యువ భారత్ ఘన విజయం సాధించింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత దక్షిణాఫ్రికా అండర్-19 జట్టు జైస్వాల్ లెగ్‌స్పిన్‌కు 29.5 ఓవర్లలో 119 పరుగులకే కుప్పకూలింది. జొనాథన్ బిర్డ్ (25) టాప్ స్కోరర్. ఆరుగురు బ్యాట్స్‌మెన్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఆకాష్ సింగ్, అంకోలేకర్, రవి బిష్ణోయ్ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో ఓపెనర్ జైస్వాల్ బ్యాట్‌తోనూ (56 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 89 నాటౌట్) దుమ్ము రేపాడు. దాంతో 16.2 ఓవర్లలోనే భారత్ 120/2తో లక్ష్యాన్ని ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్న యశస్వి శనివారం తన 18వ జన్మదినాన్ని మరపురానిదిగా చేసుకున్నాడు. ఇక ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇంకా ఒక వన్డే మిగిలి ఉండగానే 2-0తో భారత్ కైవసం చేసుకుంది.

## లిఫ్టర్ సీమపై నాలుగేళ్ల నిషేధం



**న్యూఢిల్లీ:** భారత వెయిట్ లిఫ్టర్, కామన్వెల్త్ చాంపియన్‌షిప్ రజత పతక విజేత సీమ డోపింగ్‌లో పట్టుబడింది. ఈ ఏడాది విశాఖపట్నంలో జరిగిన జాతీయ మహిళల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల సందర్భంగా నిర్వహించిన డోప్ పరీక్షలో సీమ శాంపిల్ పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆమెపై నాలుగేళ్ల నిషేధం విధిస్తున్నట్టు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ప్రకటించింది. 2017 కామన్వెల్త్ లిఫ్టింగ్‌లో 75 కిలోల విభాగంలో రజతం నెగ్గిన సీమ.. 2018 కామన్వెల్త్ క్రీడల్లో ఆరోస్థానంలో నిలిచింది.

## హోటల్ ఉద్యోగినితో ఢిల్లీ క్రికెటర్ల అసభ్య ప్రవర్తన!

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అండర్-23 క్రికెట్ జట్టులోని ఇద్దరు ఆటగాళ్లు ఓ హోటల్ ఉద్యోగినితో అసభ్యకరంగా ప్రవర్తించినట్టు ఆరోపణలు రావడం కలకలం సృష్టిస్తోంది. వివరాల్లోకెళితే.. సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా బెంగాల్‌తో మ్యాచ్ ఆడుతున్న ఢిల్లీ జట్టు కోల్‌కతాలోని ఓ హోటల్‌లో బస చేసింది. అయితే, ఢిల్లీ బ్యాట్స్‌మన్ లక్షయ్ థరేజా, పేసర్ కుల్దీప్ యాదవ్ రెండ్రోజుల క్రితం హోటల్‌లోని ఓ ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు తెలిసింది. ఇద్దరు ఆటగాళ్లు ఆ ఉద్యోగిని గది వద్దకు వెళ్లి పదేపదే తలుపులు కొట్టినట్టు అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయింది. నష్ట నివారణ చర్యల్లో భాగంగా తమ డైరెక్టర్ సంజయ్ భరద్వాజ్‌ను కోల్‌కతాకు పంపిన డీడీసీఏ.. ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. ప్రస్తుతం ఆ ఇద్దరు ఆటగాళ్లను జట్టులో ఆడించకుండా ఇంటికి పంపించినట్టు డీడీసీఏ అధికారి ఒకరు వెల్లడించారు. కాగా.. ఈ ఘటనకు సంబంధించి హోటల్ సిబ్బందితో పాటు యాజమాన్యానికి ఆటగాళ్ల తరఫున డీడీసీఏ క్షమాపణ చెప్పింది. దీంతో హోటల్ సిబ్బంది పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.

## కెప్టెన్..ధోనీ కాదు రోహిత్

**ఈ దశాబ్దపు అత్యుత్తమ ఐపీఎల్ జట్టును ప్రకటించిన విజ్డెన్**



**న్యూఢిల్లీ:** ఇప్పటికే ఈ దశాబ్దపు అత్యుత్తమ టెస్టు, వన్డే అంతర్జాతీయ జట్లను ప్రకటించిన విజ్డెన్.. తాజాగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) జట్టును ఎంపిక చేసింది. లీగ్ నిబంధనల ప్రకారం నలుగురు విదేశీయులు, ఏడుగురు స్వదేశీ ఆటగాళ్లకు చోటు కల్పిస్తూ ఈ దశాబ్దపు ఉత్తమ ఐపీఎల్ జట్టును విజ్డెన్ ప్రకటించింది. అయితే, ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్లుగా నీరాజనాలందుకున్న ధోనీ, రోహిత్ శర్మలలో ఎవరికి పగ్గాలు అప్పగించాలన్నదానిపై తర్జనభర్జనలు పడ్డ విజ్డెన్.. చివరికి అత్యధికంగా నాలుగుసార్లు ముంబై ఇండియన్స్‌ను విజేతగా నిలిపిన రోహిత్‌కు సారథ్య బాధ్యతలు కట్టబెట్టింది. ధోనీని వికెట్‌కీపర్‌గా జట్టులోకి తీసుకుంది.

**విజ్డెన్ బెస్ట్ ఐపీఎల్ జట్టు:** రోహిత్ శర్మ (కెప్టెన్), క్రిస్ గేల్, సురేశ్ రైనా, విరాట్ కోహ్లీ, డివిల్లీర్స్, ధోనీ (వికెట్ కీపర్), జడేజా, సునీల్ నరైన్, మలింగ, భువనేశ్వర్, బుమ్రా, డ్వేన్ బ్రావో (12వ ఆటగాడు).

## ఆంధ్ర-బెంగాల్ రంజీ డ్రా

**కోల్‌కతా:** ఆంధ్ర, బెంగాల్ జట్ల మధ్య రంజీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ప్రతికూల వాతావరణం కారణంగా ఈ మ్యాచ్ సజావుగా సాగలేదు. తొలిరోజు నుంచే వెలుతురులేమితో పలుమార్లు ఆటను నిలిపివేశారు. ఓవర్‌నైట్ స్కోరు 110/7తో చివరిరోజైన శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 181 వద్ద ఆలౌటైంది. టెయిలెండర్లు స్టీఫెన్ 14, అయ్యప్ప 11 రన్స్ చేశారు. ఇషాన్ 4, ఆకాశ్‌దీప్ 3, ముకేష్ 2 వికెట్లు తీశారు. అనంతరం ఆటచివరకు బెంగాల్ రెండో ఇన్నింగ్స్‌లో 46/0 స్కోరు చేయడంతో.. మ్యాచ్ డ్రా అయింది. తొలి ఇన్నింగ్స్‌లో బెంగాల్ 289 స్కోరు చేసింది. ఈ గెలుపుతో బెంగాల్‌కు 3, ఆంధ్రకు ఓ పాయింట్ లభించాయి. ఇక, ఢిల్లీతో జరిగిన రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది.

### ఇంగ్లండ్ లక్ష్యం 376.. ప్రస్తుతం 121/1

**సెంచూరియన్:** దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ఇంగ్లండ్ పోరాడుతోంది. 376 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 121 పరుగులు చేసింది. ఓపెనర్ రోరీ బర్న్స్ (77), జో డెన్లీ (10) క్రీజులో ఉన్నారు. అంతకుముందు సఫారీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 272 రన్స్‌కు ఆలౌటైంది.

**ఇంత ద్వేషమా..?**



● **బాక్సర్ అమీర్‌ఖాన్ ఆవేదన**

**లండన్:** ముస్లిం అయివుండి క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతావా అంటూ తనపై మండిపడుతున్నారని ఇంగ్లండ్ బాక్సర్ అమీర్‌ఖాన్ ఆవేదన వ్యక్తం చేశాడు. క్రిస్మస్ సంప్రదాయ దుస్తులు ధరించి శుభాకాంక్షలు తెలిపిన తనను విమర్శిస్తూ వచ్చిన ట్వీట్లను చూసి షాక్‌కు గురయ్యానన్నాడు. పాకిస్థాన్ సంతతికి చెందిన ముస్లిం అయిన అమీర్‌ఖాన్.. భార్య ఫర్యాల్ మక్దూమ్, ఇద్దరు పిల్లలతో కలిసి క్రిస్‌మస్ ట్రీ ముందు నిల్చుని ఆ పండుగను ప్రతిబింబించే దుస్తులు ధరించి శుభాకాంక్షలు తెలిపాడు. దీంతో అమీర్‌ఖాన్‌ను విమర్శిస్తూ ట్వీట్లు మొదలయ్యాయి.

## చెలరేగిన కమిన్స్

- న్యూజిలాండ్ 148 ఆలౌట్
- ఆస్ట్రేలియాతో రెండో టెస్టు

**మెల్‌బోర్న్:** ఈ సీజన్ ఐపీఎల్ వేలంలో అత్యధిక ధరకు అమ్ముడైన విదేశీ ఆటగాడిగా నిలిచిన ఆస్ట్రేలియా పేసర్ ప్యాట్ కమిన్స్ (5/28) న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో చెలరేగాడు. కమిన్స్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో ఐదు వికెట్లు కూల్చి కివీస్ బ్యాటింగ్ లైనప్‌ను కకావికలం చేశాడు. ఓవర్‌నైట్ స్కోరు 44/2తో మూడో రోజైన శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విలియమ్సన్ సేన.. కమిన్స్ దెబ్బకు 148 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ టామ్ లాథమ్ (50) ఒక్కడే పోరాడాడు. రాస్ టేలర్ (4), హెన్రీ నికోల్స్ (0), వాట్లింగ్ (7) విఫలమయ్యారు. ప్యాటిన్సన్ 3, స్టార్క్ 2 వికెట్లు తీశారు. అనంతరం ఆట చివరకు రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 137/4 స్కోరు చేసింది. ప్రస్తుతం కంగారూలు 456 పరుగుల ఆధిక్యంలో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 467 రన్స్ సాధించింది.

**బౌల్ట్ చేతికి గాయం:** కివీస్ లెఫ్టామ్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ కుడిచేతికి గాయమైంది. దీంతో ఆసీస్‌తో మూడో టెస్టుకు బౌల్ట్ దూరం కానున్నాడు. బ్యాటింగ్ సందర్భంగా స్టార్క్ వేసిన బౌన్సర్ బౌల్ట్ కుడిచేతి గ్లోవ్‌కు బలంగా తాకడంతో గాయమైంది.



కమిన్స్ (5/28)

# డబ్బులిస్తేనే.. మద్యం!



- బకాయిల కోసం డిస్టిలరీల పట్టు
- 16 వందల కోట్లకుపైగా పెండింగ్
- సరుకు ఇవ్వలేమంటున్న యాజమాన్యాలు

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): డబ్బులిస్తేనే మందు... అదేంటి డబ్బులిచ్చేగా తాగుతున్నాం అనుకుంటున్నారా! మీరు ఇస్తున్నారు సరే.. ఆ సొమ్మును ప్రభుత్వం మద్యం ఉత్పత్తిదారులకు (డిస్టిలరీలకు) చెల్లించాలిగా! గతంలో ఐదారు రోజులకు ఓసారి సొమ్ములు చెల్లించేవారు. ఇప్పుడు బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ఎంతంటే రెండు వేల కోట్ల రూపాయల వరకూ. గత ప్రభుత్వం దిగిపోయే నాటికే వెయ్యి కోట్లకుపైగా బకాయిలు ఉండేవి. రెండు రోజుల కిందట రెండు వేల కోట్లకు చేరాయి. ఇలాగైతే మద్యం సరఫరా తమ వల్ల కాదని ఉత్పత్తిదారులు తెగేసి చెప్పడంతో మంగళవారం ప్రభుత్వం 120 కోట్లు విడుదల చేసింది. అంతకుముందు కూడా కొన్ని నిధులు విడుదల చేసింది. ఇంకా 16 వందల కోట్లపైనే బకాయిలు ఉండిపోయాయి. ఈనెలాఖరులో (డిసెంబరు 31) అమ్మకాలు భారీగా పెరుగుతాయి. అప్పటికి బకాయిలు 18 వందల కోట్లకు చేరుకుంటాయి. ఈ స్థాయిలో బకాయిలు ఉంటే మద్యం సరఫరా తమ వల్ల కాదని ఉత్పత్తిదారులు తెగేసి చెబుతున్నారు. బకాయిలు భారీగా పేరుకుపోవడంతో ఇప్పటికే కొన్ని కంపెనీలు మొక్కుబడిగా మద్యాన్ని సరఫరా చేస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపడా మద్యం సరఫరా కావడం లేదు. ఇటీవల ఓ బ్రాండ్‌కు సంబంధించి ఎక్సైజ్ శాఖ కోరిందాంట్లో సగం మాత్రమే సరఫరా చేశారు. శ్రీకాకుళం జిల్లాలో ఓ డిస్టలరీ పూర్తిగా ఉత్పత్తిని ఆపేసింది. ఇతర జిల్లాల్లో కూడా దాదాపు ఇదే పరిస్థితి ఉంది. బకాయిలు చెల్లించకుండా ఎక్సైజ్ శాఖ ఆర్డర్లు మాత్రం పెడుతోందని ఇలాగైతే వ్యాపారం ఎలా చేయాలని ఉత్పత్తిదారులు ప్రశ్నిస్తున్నారు.

## బ్రాండ్లలోనూ గందరగోళం

బకాయిలు చెల్లించకపోవడమేకాక ఎక్సైజ్ శాఖ అడిగే బ్రాండ్ల విషయంలోనూ గందరగోళం నెలకొంది. సాధారణంగా వినియోగదారులు ఏ రకాలు ఎక్కువ తాగితే వాటినే ఎక్సైజ్ శాఖ ఆర్డరు పెడుతుంది. కానీ ఇటీవల డిమాండ్ లేని బ్రాండ్లకూ ఆర్డర్లు పెడుతోంది. మన రాష్ట్రంలో పెద్దగా ఆదరణ లేని బ్రాండ్లను ఎక్సైజ్ శాఖ దుకాణాల్లో ఉంచుతోంది. అందుకు తగ్గట్టుగానే డిస్టలరీలకు ఆర్డర్లు ఇస్తోంది. దీంతో కొత్త బ్రాండ్లను ఉత్పత్తి చేయాల్సిన పరిస్థితి డిస్టలరీలకు ఏర్పడుతోంది. తక్కువ ధర ఉండి, ఎక్కువగా వెళ్లే బ్రాండ్లను ఎక్సైజ్ శాఖ దాదాపు దూరం పెట్టేసిందని ఉత్పత్తిదారులు చెబుతున్నారు.

# పదో ఎక్కమే రాదు.. తెలుగు రాయలేరు



కంది జడ్పీ పాఠశాలలో శనివారం గణితం సబ్జెక్టు గురించి విద్యార్థులను ప్రశ్నిస్తున్న మంత్రి హరీశ్ రావు

- పది పరీక్ష ఎలా పాసవుతారు!?
- మాస్టార్‌గా మారిన తెలంగాణ మంత్రి హరీశ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి)

ప్రభుత్వ పాలనా వ్యవహారాలు, రాజకీయ కార్యకలాపాలతో రోజూ బిజీగా ఉండే ఆర్థిక మంత్రి హరీశ్ రావు శనివారం కాసేపు లెక్కల మాస్టార్ అవతారం ఎత్తారు. సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కంది సమీపంలో నిర్మిస్తున్న పార్టీ జిల్లా కార్యాలయ భవనాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం, కందిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అని ప్రశ్నించారు. అనంతరం, పదో తరగతి గదిలోకి వెళ్లారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో గణితం సబ్జెక్టులో విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరిశీలించారు. ఎక్కాలు ఎంత వరకూ వచ్చని అడిగిన మంత్రి.. 17వ ఎక్కం చెప్పాలని కోరారు. విద్యార్థులెవరూ చెప్పలేదు. 12, 13 ఎక్కాలు చెప్పమన్నా చెప్పలేకపోయారు. దాంతో, ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, గణితం చెప్పే టీచర్ సత్తయ్యపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఎక్కాలు మీకు ఎంత వరకూ వచ్చని అడగడంతో పది వరకు మాత్రమే వచ్చని విద్యార్థులు చెప్పారు. దాంతో, పదో ఎక్కం వరకే చెబుతారా? అంటూ మంత్రి హరీశ్ అసహనం వ్యక్తం చేశారు. పదో ఎక్కం కూడా రాకపోతే పదో తరగతి ఎలా పాసవుతారని ప్రశ్నించారు. ఆ తర్వాత ప్రధానోపాధ్యాయునితోపాటు కొందరి పేర్లను తెలుగు, ఇంగ్లిష్, హిందీలో బోర్డుపై రాయాలంటూ విద్యార్థులను పిలిచారు. ఒక్క విద్యార్థిని మాత్రమే మూడు భాషల్లో పేర్లను సరిగా రాసింది. దాంతో, ఆమెను మంత్రి అభినందించారు. ఆయా పేర్లను కొందరు విద్యార్థులు తెలుగులోనూ తప్పులు రాయడంతో హరీశ్ అవాక్కయ్యారు. రాష్ట్ర రాజధాని, దేశ రాజధాని ఏదని అడిగినా విద్యార్థులు సరిగా చెప్పలేకపోయారు. దాంతో, మంత్రి హరీశ్ రావు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా చదివితే పిల్లలు పదో తరగతి ఎలా ఉత్తీర్ణులవుతారని ప్రశ్నించిన మంత్రి.. పరిస్థితులు మారాలని ఆదేశించారు.

# రెవె'న్యూ' సెటిల్‌మెంట్!

**నిషేధ భూముల కేసుల్లో సొంత తీర్పులు.. ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు**

**హైకోర్టు ఆదేశాలూ బుట్టదాఖలు.. 22-ఏ కేసుల్లో కలెక్టర్లకు ఏకపక్షంగా ఆదేశాలు**

**రిటైర్డ్ జడ్జి లేకుండానే పరిష్కారాలు.. ప్రభుత్వ న్యాయవాది సూచనలూ బేఖాతరు**

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నిషేధ భూముల కేసుల పరిష్కారంలో రెవెన్యూశాఖ సొంతంగా సెటిల్‌మెంట్లు చేస్తోంది. హైకోర్టు ఆదేశాలను సైతం బుట్టదాఖలు చేస్తూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోంది. కీలక కేసుల్లో అత్యంత విలువైన ప్రభుత్వ భూములను క్లెయిమ్ చేస్తున్నవారికి అనుగుణంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడాల్సిన కేసుల్లోనూ అడ్డగోలు కమిటీలు వేసి ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూరుస్తోంది. దీనికి చిత్తూరు జిల్లా వికృతమాలలో రూ.225 కోట్ల విలువైన ప్రభుత్వ భూముల కేసే ఉదాహరణ. దీనికంటే ముందు రాజధాని పరిధిలో నవలూరు, కురగల్లు తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములపై కూడా ఇలాంటి నిర్ణయాలు తీసుకొన్న ఉదంతాలు తాజాగా వెలుగు చూస్తున్నాయి. ఇవన్నీ హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా తీసుకున్నవేనని రెవెన్యూ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## ఆ ఆదేశాలన్నీ చట్టవిరుద్ధం

హైకోర్టు ఆదేశాల మేరకు 22-ఏ కేసుల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక కమిటీ ఉండాలని గుర్తుచేస్తూ రెవెన్యూశాఖ తరపున హైకోర్టులో కేసులు వాదించే ప్రభుత్వ న్యాయవాది కొర్రపాటి సుబ్బారావు గతేడాది సీసీఎల్ఏకు లేఖరాశారు. 'హైకోర్టు ఫుల్‌బెంచ్ ఆదేశాల మేరకు, రిటైర్డ్ జిల్లా జడ్జితో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీనే 22-ఏ కేసుల పరిష్కారం చేపట్టాలి. ఆయన లేకుండా కమిటీ తీసుకునే నిర్ణయాలు హైకోర్టు ఆదేశాలకు విరుద్ధమైనవిగానే పరిగణిస్తారు. కాబట్టి కమిటీలో విధిగా రిటైర్డ్ జడ్జిని నియమించేలా చర్యలు తీసుకోవాలి' అని తన లేఖలో అప్రమత్తం చేశారు. అయితే ఈ సూచనలను రెవెన్యూ శాఖ బుట్టదాఖలు చేసింది. కమిటీతో సంబంధం లేకుండానే ఇప్పటి వరకు 120కేసులు సెటిల్ చేసినట్లు తెలిసింది. అందులో ప్రభుత్వ భూములతో ముడిపడినవే 56 ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వ న్యాయవాది లేఖ రాసిన తర్వాతే మరిన్ని కేసులు సెటిల్ చేసింది. 2019 జనవరి 19నుంచి జూన్ వరకూ 22-ఏ కేసులు సెటిల్ చేసేలా భారీగా మెమోలు ఇచ్చారు. ఇందులో తూర్పుగోదావరి, విశాఖ, కృష్ణా, గుంటూరు జిల్లాల కేసులు ఎక్కువగా ఉన్నాయి. జూలై నుంచి అక్టోబరు 29నాటికి విశాఖ, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, చిత్తూరు, కర్నూలు జిల్లాల పరిధిలో అత్యంత విలువైన భూములను 22-ఏ నుంచి తొలగించేలా కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లినట్లు తెలిసింది.

## న్యాయాధికారి లేని కమిటీ

నిషేధ భూముల జాబితా 22-ఏ(ఇ) కేసుల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని 2015, డిసెంబరులో ఏపీ సర్కారును హైకోర్టు ఆదేశించింది. 2016, జూలై 5న కమిటీని నియమిస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు (జీఓ.300) జారీ చేసింది. అప్పటి సీసీఎల్ఏ, సర్వే కమిషనర్, రిటైర్డ్ జడ్జి నర్రా గణేశ్‌బాబుతో కమిటీ ఏర్పాటైంది. 2017, ఫిబ్రవరి 2న సమావేశం ఉంటుందని షెడ్యూల్ ఖరారు చేసినా, ఆ సమావేశం జరగలేదు. ఆ తర్వాత గణేశ్‌బాబు పదవికి రాజీనామా చేశారు. అప్పటినుంచి ఆ స్థానంలో మరొకరిని నియమించనేలేదు. కమిటీ పూర్తిస్థాయిలో లేకుండా నిర్ణయాలు తీసుకోవడం హైకోర్టు ఫుల్‌బెంచ్ ఆదేశాలను ఉల్లంఘించడమే. కానీ, కమిటీతో ప్రమేయం లేకుండానే రెవెన్యూ శాఖ 22-ఏ కేసులను పరిష్కరిస్తోంది. పైగా కమిటీ సమావేశాలకు రావాలంటూ రాజీనామా చేసిన అధికారికే లేఖలు కూడా పంపించడం గమనార్హం. ఇదిలా ఉండగా, రాజధాని పరిధిలోని కురగల్లు, నవులూరు, తదితర ప్రాంతాల్లోని అసైన్డ్ భూములు, వివాదాల్లో ఉన్న ప్రభుత్వ భూములపై 2018లో వరస తీర్పులు ఇవ్వడంపై హైకోర్టుకు ఫిర్యాదులు వెళ్లాయి.






















Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.